


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




వరంగల్ | 28-06-2026 ఆదివారం | సంపుటి : 11 | సంచిక : 208 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on


## వీబీజీ రామ్‌జీ చట్టంపై తెలంగాణ

రైతులు, పేదల భవిష్యత్తును తాకట్టు పెట్టనివ్వం

# సర్కార్ గరం



- వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు
- పేదల ఉపాధిని దెబ్బతీసే చట్టంపై సుప్రీంకోర్టుకు వెళ్తాం..
- కేరళ, కర్ణాటకలతో కలిసి ఉమ్మడి పోరాటం
- రైతు వ్యతిరేక 'వీబీజీ రామ్‌జీ' చట్టాన్ని అమలు చేయబోం

**హైదరాబాద్, జూన్ 27 (వుదయం) :**
వివాదాస్పద 'వీబీజీ రామ్‌జీ' చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని రాష్ట్ర సాగునీటి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం దేశంలోని రైతులు, ముఖ్యంగా గ్రామీణ పేదల ఉపాధిని దారుణంగా దెబ్బతీసేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వీబీజీ రామ్‌జీ పథకం, దాని అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన తెలంగాణ క్యాబినెట్ సబ్ కమిటీ (మంత్రుల ఉపసంఘం) శనివారం సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ భేటీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొని, పథకం వల్ల రాష్ట్రానికి జరిగే నష్టాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. పేద ప్రజల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే ఎలాంటి నల్ల చట్టాన్నైనా రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా ప్రతిఘటిస్తుందన్నారు. "ఈ వీబీజీ రామ్‌జీ చట్టంపై చట్టపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నాం. అవసరమైతే దీనికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. మనతో పాటు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న కేరళ, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి, త్వరలోనే ఒక ఉమ్మడి కార్యాచరణను రూపొందిస్తాం" అని ఉత్తమ్ వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసే ఇటువంటి విధానాలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలే తమకు పరమావధి అని ఈ సందర్భంగా మంత్రుల ఉపసంఘం స్పష్టం చేసింది.

## నగరంలో రోహింగ్యాల

# అక్రమ నివాసాలు

**హైదరాబాద్, జూన్ 27 (వుదయం) :**
హైదరాబాద్ నగరంలో ఎంతో మంది రోహింగ్యాలు అక్రమంగా నివాసం ఉంటున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల నుంచి అక్రమంగా చొరబడిన వారికి సైతం ఇక్కడ స్థానికంగా ఓటు హక్కులు, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతాలు లభించడంపై ఆయన తీవ్ర ఆక్షేపణ వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ (సమగ్ర ఓటరు సర్వే 'సర్') ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ప్రజల్లో కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరెన్ని కుట్రలకు పాల్పడినా, అక్రమాలను అడ్డుకునేందుకు చేపట్టిన ఓటరు జాబితా సవరణ ప్రక్రియను మాత్రం ఆపలేరని ఆయన తేల్చి చెప్పారు. పాతబస్తీ ప్రాంతంలో ఓటర్ల సర్వేకు వెళ్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) మజ్లిస్ (AIMIM) నేతలు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన



ధ్వజమెత్తారు. అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి.. అంతకుముందు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రామ్‌కోఠి ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి, అక్కడ చిన్నారులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఆ తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నైరుతి రుతుపవనాల జోరు



**హైదరాబాద్, జూన్ 27 (వుదయం) :**
నైరుతి రుతుపవనాల ప్రభావం తెలంగాణపై ముమ్మరంగా కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాగల ఏడు రోజుల పాటు విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ పరిధిలోని జిల్లాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుందని అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు వాతావరణశాఖ నేడు 'ఎల్లో అలర్ట్' (ముందస్తు హెచ్చరిక) జారీ చేసింది. రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబాబాద్, మంచిర్యాలు, ములుగు, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. వర్షం పడే సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉన్నందున, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కాగా, శనివారం ఉదయం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం పూర్తిగా మేఘావృతమై చల్లటి వాతావరణం నెలకొంది.

## తుంగభద్ర ఒప్పందాలపై

# అఖిలపక్షం పెట్టాలి



**హైదరాబాద్, జూన్ 27 (వుదయం) :**
కర్ణాటక వేదికగా మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన రహస్య భేటీ వివరాలను తక్షణమే ప్రజల ముందుంచాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దీనిని 'చారిత్రక ఒప్పందం' అని అభివర్ణిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ వివరాలను తెలంగాణ ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. శనివారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారంలో రేవంత్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. మూడు రాష్ట్రాల మధ్య జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పంద పత్రాలను రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని, దీనిపై తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎంతో కీలకమైన ముఖ్యమంత్రుల సమావేశంలో రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులను కూడా బయట కూర్చోబెట్టడం వెనుక ఉన్న మర్మమేంటని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. "ఎంతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే ఊరుకునే ప్రసక్తే లేదు. మన రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను రేవంత్‌రెడ్డి పూర్తిగా దెబ్బతీస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఏది చెబితే కేంద్రం అది వింటుందన్న సంగతి తెలిసిందే. అలాంటి పరిస్థితుల్లో మన రాష్ట్ర భవిష్యత్తును కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతిలో ఎలా పెడతారు?" అని హరీశ్‌రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈనెల 25న కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగిన విషయం విదితమే. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని కొత్త గేట్లను ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే అక్కడ జరిగిన అంతర్గత చర్చలపై హరీశ్‌రావు ఈ తరహా విమర్శలు గుప్పించారు.

## పెట్రోల్, డీజిల్

# రేట్లు ఎందుకు తగ్గించట్లేదు?

**న్యూఢిల్లీ:**
అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు భారీగా తగ్గి పశ్చిమాసియా యుద్ధానికి ముందు నాటి స్థాయికి చేరుకున్నా.. భారత్‌లో మాత్రం ఇంధన ధరలను ఎందుకు తగ్గించడం లేదని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచుకుంటూ వారి జేబులను ఖాళీ చేస్తోందని ఆరోపించారు. మోదీ సర్కార్ దేశ ప్రజలను కేవలం పన్నుల వసూలు సాధనంగా మాత్రమే చూస్తోందంటూ ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమాసియాలో యుద్ధం ఉద్ధృతంగా సాగుతున్న సమయంలో ముడి చమురు ధర అంతర్జాతీయంగా బ్యారెల్‌కు ఏకంగా 138 డాలర్లకు చేరింది. అప్పట్లో దేశంలో పెట్రోల్ లీటరు ధర రూ.94.77, డీజిల్ రూ.87.67గా ఉంది. కానీ, ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు కేవలం 70 డాలర్లకు పడిపోయింది. ముడి చమురు ధరలు సగానికి పైగా తగ్గినప్పటికీ.. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించడానికి మోదీ ప్రభుత్వానికి మనసెందుకు రావడం లేదు?" అని ఖర్గే ప్రశ్నించారు.

**ఎల్పీజీ ధరలపైనా నిలదీత..**
పశ్చిమాసియా యుద్ధాన్ని సాకుగా చూపి కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్‌పీజీ (కమర్షియల్ సిలిండర్) ధరలను ఏకంగా రెట్టింపు చేసిందని ఖర్గే గుర్తుచేశారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి చేరినప్పటికీ, పెంచిన ధరలను మాత్రం ఎందుకు తగ్గించడం లేదని ఆక్షేపించారు. గృహావసరాలతో పాటు, వలస కార్మికులకు ఎంతో ఆసరాగా నిలిచే ఐదు కిలోల చిన్న సిలిండర్ల ధరలను సైతం కేంద్రం విపరీతంగా పెంచేసి పేదల కడుపు కొడుతోందని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ట్యాంకర్‌పై దాడితో

అమెరికా-ఇరాన్‌ల ప్రతీకార దాడులు

# మళ్లీ పెరిగిన ఉద్రిక్తతలు

**వాషింగ్టన్:**
అమెరికాఇరాన్‌ల మధ్య చోటుచేసుకుంటున్న పరస్పర ప్రతీకార దాడులతో వ్యూహాత్మక హర్మూజ్ జలసంధి ప్రాంతంలో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా ఈ జలసంధి గుండా ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య ట్యాంకర్‌ను క్షిపణి తాకినట్లు బ్రిటన్ (యూకే) మిలిటరీ అధికారికంగా వెల్లడించింది. ఈ దాడిలో నౌక పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ.. అందులోని సిబ్బంది ఎవరికీ ప్రమాదం జరగలేదని, అంతా సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. అయితే, అంతర్జాతీయ నౌకాయానాన్ని వణికించిన ఈ క్షిపణిని అసలు ఎవరు ప్రయోగించారనే విషయంపై ప్రస్తుతానికి స్పష్టత రాలేదు. ఇటీవల అమెరికా, ఇరాన్ దేశాలు పరస్పర చర్చల అనంతరం శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడంతో హర్మూజ్ జలసంధిలో నౌకాయానం



ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి చేరుకుంటోంది. గత కొన్ని నెలలుగా సురక్షిత ప్రాంతాల్లో నిలిచిపోయిన వందలాది వాణిజ్య నౌకలు, ఆయిల్ ట్యాంకర్లు ఇప్పుడే తమ ప్రయాణాలను పునఃప్రారంభించాయి. అయితే, ఇంతలోనే ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని బేఖాతరు చేస్తూ మళ్లీ దాడులకు దిగడం అంతర్జాతీయ సమాజాన్ని కలవరపెడుతోంది. డ్రోన్లు, క్షిపణులతో ఇరు పక్షాలు విరుచుకుపడుతుండటంతో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి మరోసారి రణరంగంగా మారింది.






# ఆంక్షల గుప్పిట్లో భారతీయ సంస్థ



- భారతీయ కంపెనీ, ఎనిమిది మంది వ్యక్తులపై అమెరికా ఆంక్షలు!
- భారతీయ సంస్థ 'ఎస్‌బీఎల్ ఎనర్జీ'పై యూఎస్ కఠిన చర్యలు

**హైదరాబాద్, జూన్ 27 (వుదయం) :**
సూడాన్‌లో కొన్నేళ్లుగా సాగుతున్న అంతర్యుద్ధాన్ని మరింత ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలపై ఒక భారతీయ కంపెనీ సహా పలు అంతర్జాతీయ సంస్థలు, ఎనిమిది మంది వ్యక్తులపై అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ మేరకు అమెరికా ఆర్థిక శాఖకు చెందిన 'ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్' (OFAC) అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. సూడాన్ సాయుధ దళాలు (SAF), రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (RSF) మధ్య ఘర్షణలు తీవ్రతరం కావడానికి, తద్వారా అక్కడ మానవతా సంక్షోభం మరింత ముదరడానికి ఈ సంస్థలే కారణమవుతున్నాయని అమెరికా పేర్కొంది. ఆంక్షల జాబితాలో రాయ్‌పూర్‌కు చెందిన అలోక్ చౌధరీ అనే భారతీయ పౌరుడి పేరు కూడా ఉంది. ఈయన ప్రస్తుతం 'అమిన్ ఎక్స్‌ప్లోజివ్ ప్రైవేట్ లిమిటెడ్' (మరో పేరు: ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్) అనే సంస్థకు సీఈఓగా వ్యవహరిస్తున్నారు. సూడాన్ సాయుధ దళాల (SAF) ఆధీనంలో నడిచే ఆయుధగార నిర్వహణ సంస్థకు.. ఈ అమిన్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ భారీ ఎత్తున పేలుడు పదార్థాలు ఉన్న దాదాపు 200 షిప్‌మెంట్లను సరఫరా చేసినట్లు అంతర్జాతీయ నిఘా వర్గాల విచారణలో తేలింది. ఈ తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలోనే ఎస్‌బీఎల్ ఎనర్జీతో పాటు సూడాన్, ఈజిప్ట్ దేశాల కేంద్రంగా నడుస్తోన్న పలు ఇతర ముఠా సంస్థలపై యూఎస్ ప్రభుత్వం నిషేధాత్మక ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది.

**ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభం..**
ఈ అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై యూఎస్ విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగాట్ స్పందిస్తూ.. "ఈ సంస్థలు సూడాన్ అంతర్గత దళాలకు ఆయుధాలు, వినాశకర పేలుడు పదార్థాలు, విదేశీ ఫైటర్లను చేరవేస్తూ యుద్ధాన్ని సుదీర్ఘ కాలం పాటు సాగదీస్తున్నాయి. దీనివల్ల అక్కడ పెను మానవతా సంక్షోభం ఏర్పడటమే గాకుండా.. అంతర్జాతీయ ఉగ్రవాద గ్రూపులు మరింతగా చెలరేగిపోవడానికి మార్గం సుగమమైంది" అని ఆందోళన వ్యక్తంచేశారు. కొన్నేళ్లుగా సాగుతోన్న ఈ ఘోర అంతర్యుద్ధం కారణంగా సూడాన్‌లో అత్యాచారాలు, లైంగిక హింస విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని, సామాన్య ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని ఐక్యరాజ్యసమితి (UN) కూడా గతంలోనే అంతర్జాతీయ సమాజాన్ని హెచ్చరించింది. తాజాగా అమెరికా తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఆయుధాల అక్రమ రవాణా ముఠాలకు పెద్ద చెక్ పెడుతుందని భావిస్తున్నారు.



# ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఏ.బి. గోవింద్ జన్మదిన వేడుకలు

- విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**ముషీరాబాద్,జూన్ 28(వుదయం)**

.ఆల్ ఇండియా ప్రభాస్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ ఏ.బి. గోవింద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా ప్రభాస్ ఫ్యాన్స్ సిటీ ప్రెసిడెంట్ చక్రం ఆధ్వర్యంలో కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేసి ఏ.బి. గోవింద్‌కు అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిల్స్, ఇతర స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేసి సేవా భావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సిటీ ప్రెసిడెంట్ చక్రం మాట్లాడుతూ, "ఏ.బి. గోవింద్ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉంది. విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి చదువుకు తోడ్పాటు అందించడం మా లక్ష్యం. భవిష్యత్తులో కూడా ప్రభాస్ అభిమానుల ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు, స్థానిక నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏ.బి. గోవింద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్జున్, హనుమంతు, సల్మాన్, రామ్, అనిల్, సాయి ప్రసాద్, గిరిచారి, విక్రమ్, టీంకు, శ్యామ్, తులసి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లా బిజెపి ఓ.బీ.సీ అధ్యక్షుడిగా కోణం విఠల్

**పెద్ద శంకరంపేట్ వుదయం ప్రతినిధి జూన్ 27**

భారతీయ జనతా పార్టీ zసంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా పెద్ద శంకరంపేట మండల పరిధిలోని టింకటి గ్రామానికి చెందిన కోణం విఠల్ నియామకం అయ్యారు. శనివారం నూతనంగా నూతనంగా సంగారెడ్డి జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన కోణం విఠల్ మెదక్ ఎం.పీ రఘునందన్ రావు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి. సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. జిల్లాలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓబిసి జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్ రావు.. రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు ఆనంద్ గౌడ్. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్ పాల్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. బిజె వై ఎమ్ అధ్యక్షుడు బుగుడాల కృష్ణ.. తదితరులు పాల్గొన్నారు.



# సర్ లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

- ఓటును రక్షించుకోవాలి

**నారాయణపేట టౌన్ జూన్ 27(వుదయం ప్రతినిధి)**

కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు ప్రక్షాళనలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఓటును రక్షించుకోవాలనీ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నారాయణపేట మున్సిపాలిటీ ఒకటవ వార్డు కౌన్సిలర్ ఎస్.రఘుపాల్ అన్నారు.శనివారం వార్డులో ఎన్యూమరేషన్ పత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును రక్షించుకోవాలనీ సూచించారు.ఓటరు ప్రక్షాళన కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుజాత ఉమ,మసి పవన్ నాగరాజు వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# దళితులను ఏకం చేసి బిజెపిని పటిష్టం చేస్తా

- జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షుడు కృష్ణ

**నారాయణపేట టౌన్, జూన్ 27(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లాలో దళితులందరినీ ఏకం చేసి బిజెపిని పటిష్టం చేస్తామని నూతన జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కృష్ణ అన్నారు.తనను జిల్లా అధ్యక్షుడుగా నియమించినందుకు శనివారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ కృష్ణను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు.పార్టీని దళిత వర్గాల్లో మరింత పటిష్టం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్ ను నారాయణపేట జిల్లా బీజేపీ కోశాధికారి.ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ,నాయకులు సైదప్ప,దానపోల్ల కతలప్ప,లక్ష్మణ్ బొకే శాలువాతో ఘనంగా సన్మానించారు.



# మరికల్ లో 3 ఇసుక లారీలు సీజ్

**(మరికల్ జూన్ 27 వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలో శనివారం రైతు టాస్క్ ఫోర్స్ జరిపిన పోలీస్ తనిఖీలు అక్రమంగా ఇసుక తరలిస్తున్ 3 లారీలు ఇచ్చేశారు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు మరికల్ ఎస్సై ఎం విక్రమ్ తెలిపారు అక్రమంగా రవాణ చేస్తున్నా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు అక్రమంగా రవాణా పాల్పడిన వారు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు

# గజ్వేల్‌లో'ఛాత్రోన్ కి గూంజ్' ఉద్యమ రణభేరి

- విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ భారీ ర్యాలీ, నిరసన

**గజ్వేల్, జూన్ 27 (వుదయం ప్రతినిధి)**



టీపీసీసీ ఆదేశాల మేరకు పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ ప్రారంభించిన "ఛాత్రోన్ కి గూంజ్" ఉద్యమానికి మద్దతుగా గజ్వేల్ పట్టణంలో శనివారం విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో వందలాది మంది విద్యార్థులు, యువకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తారు. దేశంలో తరచూ జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామక ప్రక్రియల్లో జాప్యాలు లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయని ఆంక్ష రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని, రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమను కేంద్రం బూడిదలో పోసిన పన్నీరు చేసిందని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగ యువతను నమ్మించి ఓట్లు వేయించుకున్న బీజేపీ ప్రభుత్వం, ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్అ ధ్యక్షురాలు తూంకుంట ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నప్పటికీ, కేంద్రంలోని అధికార పక్షానికి ఉద్యోగాల భర్తీపై ఎటువంటి స్పష్టమైన విధానం లేకపోవడం సిగ్గుచేటన్నారు. యువత గొంతుకే దేశ భవిష్యత్తు. విద్యార్థుల, నిరుద్యోగుల హక్కుల కోసం రాహుల్ గాంధీ గారు చేపట్టిన 'ఛాత్రోన్ కి గూంజ్' ఉద్యమం దేశంలో పెద్ద విప్లవంగా మారబోతోంది. పేపర్ లీకేజీల మాఫియాపై, నిరుద్యోగంపై కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపదు అని కొనియాడారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం చేపట్టిన ఈ "ఛాత్రోన్ కి గూంజ్" ఉద్యమాన్ని జయప్రదం చేయాలని, యువత అంతా తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యోగ నిర్వహణలో బదిలీలు

**నారాయణపేట టౌన్ జూన్ 27(వుదయం ప్రతినిధి)**



నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో గత సుమారు ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్లకు శనివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపేట సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి వారిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి వారి సేవలను అభినందించారు.బదిలీపై మల్లేష్,మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు, రాముకృష్ణా పోలీస్ స్టేషన్‌కు, సృజన దామరగిద్ద పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారణమని, ఒక ప్రాంతంలో విధులు నిర్వహించిన అనంతరం మరో ప్రాంతంలో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం పోలీసు శాఖలో భాగమని అన్నారు. నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కాలంలో ముగ్గురు కానిస్టేబుళ్లు క్రమశిక్షణ, అంకితభావం, నిజాయితీతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. ఎక్కడ విధులు నిర్వహించినా అదే సేవాభావంతో ప్రజలకు అందుబాటులో ఉండాలని, చట్ట పరిరక్షణలో నిబద్ధతతో పనిచేస్తూ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు.బదిలీపై వెళ్తున్న సిబ్బంది కొత్త విధి నిర్వహణ ప్రాంతంలోనూ అదే క్రమశిక్షణ, అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ 2 గాయత్రి, పోలీసు సిబ్బంది పాల్గొని బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జహీరాబాద్ నియోజకవర్గం లో ఆయా కార్యక్రమం లో పాల్గొన్నాను ఎం ఎల్ ఏ

**కోహీర్ జూన్ 27 (వుదయం ప్రతినిధి)**




జహీరాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు రేపు అనగా 28062026 (ఆదివారం) నాడు ఈ క్రింది కార్యక్రమాలలో పాల్గొనున్నారు ఉదయం కార్యక్రమాలు ఉదయం 09:00 గంటలకుజహీరాబాద్‌లో నిర్వహించే పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొంటారు.ఉదయం 11:00 గంటలకుస్థలం: ఎస్.వి. కన్వెన్షన్ హాల్, పస్తాపూర్లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చెక్కులను అందజేస్తారు. కావున మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్‌లు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు, ప్యాక్స్ చైర్మన్‌లు,మాజి జెడ్పీటీసీలు ,మాజీ ఎంపీపీ లు ,జహీరాబాద్ & కోహీర్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్‌లు ,వార్డ్ అధ్యక్షులు (కౌన్సిలర్ అభ్యర్థులు ) గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులు అందరూ సకాలంలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా బి ఆర్ ఎస్ ఎం ఎల్ ఏ క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు

**సంగారెడ్డి, జూన్ 27:వు దయం.**



అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవాని చంద్ర సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువతపై వాటి ప్రభావం, మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం నేరమని, వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా విద్యా హక్కు చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన వివిధ చట్టాలపై విద్యార్థులకు వివరించారు. పిల్లలు తమ భవిష్యత్తును సుస్థిరంగా తీర్చిదిద్దుకోవాలని, బాలల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.న్యాయ సంబంధిత అంశాల్లో అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్, అడ్వకేట్లు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బీరంగూడ మారుతి నగర్ కాలనీలో ఘనంగా శ్రీ లక్ష్మి గణపతి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం..

**అమీన్పూర్ (వుదయం):**

పటాన్చెరు నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మారుతి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో శనివారం నిర్వహించిన విగ్రహ, ధ్వజ స్తంభం ప్రతిష్టాపనల కార్యక్రమాలకు ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# సర్‌ను సక్రమంగా నిర్వహించాలి

- తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారు చేయాలి
- తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**యాలాల జూన్ 27 (వుదయం ప్రతినిధి):-**



ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా సవరణ చేయాలని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం యాలాల మండల పరిధిలోని ముద్దయిపేట్, పగిడాల గ్రామాలలో జరుగుతున్న సర్ సర్వేను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చేపడుతున్న సర్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఓటర్ జాబితా లో ఎలాంటి ఇబ్బంది కలగరాదని ఉద్దేశంతో తామంతా గ్రామ గ్రామాన్ని తిరుగుతున్నామని తెలిపారు అరులైన ఓటర్ల జాబితాలో పేర్లు తప్పిపోకుండా అధికారులు చూడాలని ఆదేశించారు. గ్రామాల నుండి ఇతర ప్రదేశాలకు వలస వెళ్లిన వారికి సమాచారం అందించాలని తెలిపారు. ఓటరు జాబితాను తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని బిఎల్ఓ లను ఆదేశించారు. బిఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని ఫారం లు పూర్తి చేయాలని తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సామర్థ్యవంతంగా నిర్వహించాలని సూచించారు. సర్ కార్యక్రమంలో అర్హుడైన ప్రతి ఓటరు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా అన్యాయం జరుగుద్దని తెలిపారు. ఓటు హక్కు అనేది పౌరుడు బాధ్యత అని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే ఇంటికి వచ్చిన అధికారిని అడిగి తెలుసుకోవాలని సూచించారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నుండి నియమితులైన బూతులు ఏజెంట్లు అధికారులకు సహకరించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఓటరు జాబితాను తయారు చేసే విధంగా చూడాలని తెలిపారు. గ్రామాల నుండి కొందరు వ్యక్తులు ఇతర ప్రదేశాలకు వెళ్లిన వారి జాబితాని కూడా తయారు చేసుకుని అర్హులై ఉంటే ఓటర్ నమోదు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్, తాండూర్ నియోజకవర్గం ఎస్ఆర్ఐ కన్వీనర్ కర్ణం పురుషోత్తం రావు. తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, యాలాల తాసిల్దార్ గాయత్రి, ఆర్ఐ శివశరణ్, యాలా ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, మాజీ పార్టీ అధ్యక్షులు భీమయ్య, మాజీ ఎంపిటిసి దేవగారి రాములు, తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సింలు గౌడ్, ముద్దయిపేట్ గ్రామ సర్పంచ్, పగిడాల్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జనార్దన్ రెడ్డి, రాములు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గురు పీఠంలో పువ్వుల మొక్కలు నాటుదాం

- పూజకై వాడుదాం..
- శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్....

**వుదయం న్యూస్, శివ్వంపేట జూన్ 27**



మెదక్ జిల్లా శివంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ విశ్వయోగిస్వంజి మహారాజ్ దివ్య ఆశీస్సులతో పెద్దగోని జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు. దేశంలోనే ఎక్కడ లేనివిధంగా నిర్మించి ప్రతిష్ఠించిన. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. శ్రీ గురు పీఠంలో వెలసిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి. షిరిడి సాయిబాబా దేవతామూర్తులకు. ఈనెల జేష్ఠ శుద్ధ దశమి జూన్ 24వ తారీఖు నాడు జరిగిన శ్రీ గురు పీఠం ప్రథమ వార్షికోత్సవంలో మూడు సంవత్సరాల వయసుగల మొక్కలను విజయవాడ నుండి తెప్పించడం జరిగింది.. హిమాలయ సంత్ శ్రీశ్రీశ్రీ వేదానంద సరస్వతి స్వామీజీ వారు రుద్రాక్ష వృక్షము మరియు ఏక భిలువ వృక్షము నాటారు. నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి సునీత లక్ష్మా రెడ్డి గారు శ్రీ గురు పీఠంలో శ్రీ షిరిడి సాయి దేవాలయం ముందు అహోబిల వృక్షాన్ని నాటారు. సాయి టీవీ అధినేత దంపతులు శ్రీ అనిల్ గారు శ్రీమతి సాయివాహిని గారు మరో రుద్రాక్ష వృక్షాన్ని నాటారు. శ్రీ శివ కుమార్ గౌడ్ రమాదేవి దంపతులు ఏకభిల్వాన్ని నాటారు. రాజ్యం బిక్షపతి త్రిబిలం మొక్కను నాటారు. ఈనెల జేష్ఠ శుద్ధ పౌర్ణమి 29 జూన్ రోజున మరికొందరు ప్రముఖులు శ్రీ గురు పీఠంలో పారిజాత వృక్షాలను నాటనున్నారు. శ్రీ గురు పీఠం ప్రతిమ వార్షికోత్సవం పురస్కరించుకొని శ్రీ గురు పీఠం ప్రాంగణంలో వివిధ రకాల పూల మొక్కలు గన్నేరు మందారం నందివర్ధనం గులాబీ మల్లెలు ఉసిరి, జమ్మి, తులసి మొక్కలు నాటడం జరిగింది. భవిష్యత్తులో ఈ మొక్కలన్నీ శ్రీ గురు పీఠంలోని దేవతల ఆరాధనకు అవసరమైన పుష్పాలు భిలువములు, తులసి తమలపాకులు, ఉసిరి, మొదలైన వి దేవతారాధనకు అందించగలవు. ఈ పౌర్ణమి రోజున శ్రీ గురు పీఠములో శ్రీ దత్తాత్రేయ పంచాయతనం, పంచవటి మరియు షిరిడి సాయి దేవాలయంలో వివిధ పూజా కార్యక్రమాలు చేయబడును, భక్తులు శ్రీ డి, పద్మారావు వెంకట లక్ష్మి,దంపతులు ఆమెరికా లో ఉన్నవారి కూతురులు హారిక దుర్గాభవాని,షర్మిలా దేవి, కమారుడు శివనాగరాజు అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు కావున భక్త మహాశయులందరూ సోమవారం పౌర్ణమి రోజు గురుదేవులను దర్శించి ఆశీస్సులు పొందాలని శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కోరుతున్నారు.

# ప్రజాధనం హృద నిర్లక్ష్యం నీడలో ప్రజాప్రయోజనం పార్కులు

- 'సామాన్య ప్రజలు ప్రశ్నిస్తే గాని ప్రత్యేకంగా పట్టించుకోని అధికారులు '
- 'కోట్ల రూపాయల ప్రజాధనం వృధా '
- పి.రాములు నేత
- 'జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు'

**కోహీర్ జూన్ 27 (వుదయం ప్రతినిధి)**



జహీరాబాద్ పట్టణంలో అనేకచోట్ల కాలనీలలోని పార్కులలో ప్రజల అవసరం కోసం పార్కులను ఏర్పాటు చేసి ప్రజలు ఉదయం వాకింగ్ చేయడానికి సౌకర్యవంతంగా ఉండేటట్లు ప్రభుత్వం పార్కులను కోట్ల రూపాయలు పెట్టి అభివృద్ధి చేసింది కానీ వాటి మీద సంబందించిన అధికారులకు ప్రత్యేక శ్రద్ధ లేనందుకు పిచ్చి మొక్కలు ముళ్ళ కంపలతో నిండిపోయి ప్రజలు వినియోగించుకోవడానికి అసౌకర్యవంతంగా తయారై ముళ్ళ పొదలు పెంటకుప్పల్లాగా తయారైయి దర్శనం ఇస్తుంది ప్రస్తుతం జహీరాబాద్ పట్టణంలోని ఐడిఎస్ఎండి కాలనీలో గల పార్కు ప్రత్యేక పర్యవేక్షణ లేక పిచ్చిముక్కలు మొలిసి ఒక చిన్న అడవి లాగ తయారయింది గత నాలుగు సంవత్సరాల క్రితం లక్షల రూపాయలు పెట్టి ఈ పార్కు చుట్టూ కంచవేసి ఉదయం పూట ప్రజలు నడవడానికి సౌకర్యాలు కల్పించినారు ఆ తర్వాత ఆ పార్కును పూర్తిగా మర్చిపోయినారు కేవలం ఆరు నెలలు మాత్రమే ఆ పార్కు ప్రజలకు వినియోగించుకోవడానికి వచ్చింది ప్రత్యేక పర్యవేక్షణ లేక పార్కులో పందులు వీధి కుక్కలు వీధి పశువులు చేరి కంచెను మొత్తము నాశనం చేస్తున్నాయి పార్కులో పిచ్చి మొక్కలన్నీ పెరిగి ప్రజలకు వాడుకోడానికి రావడం లేదు కావున పురకపాలక సంఘం అధికారులు తమ పరిధిలోకి వచ్చే ప్రజా ప్రతినిధులు ఇలాంటి పార్కులపై స్పందించి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూడాలి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణ తీసుకొచ్చే విధంగా కృషి చేయాలన్నారు పనికి వచ్చే పార్కులు అసౌకర్యంగా తయారైనందుకు చాలామంది ప్రజలు రోడ్లపై ఉదయం పూట నడవడంతో అనేక సందర్భాలలో ప్రమాదాలకు గురవుతున్నారు అందులో ముఖ్యంగా వృద్ధులకు చిన్న పిల్లలకు మహిళలకు గర్భిణీ స్త్రీలకు ఇలాంటి పార్కులు చాలా ఉపయోగపడతాయి కానీ అసౌకర్యంగా ఉన్నందుకు రోడ్ల పైన వెళ్లి నడవల్సిన పరిస్థితి ఉంది కావున జహీరాబాద్ పట్టణ ప్రజల పక్షాన ఇలాంటి పార్కులను అధికారులు నాయకులు గుర్తించి సౌకర్యవంతంగా తీర్చిదిద్ది ప్రజలకు అందించాలని కోరడమైనది

# ఐ డి ఓ సి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**నారాయణపేట జూన్ 27 (వుదయం ప్రతినిధి)**




నారాయణ పేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐ డి ఓ సి ) పనులను శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పరిశీలించారు. ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి భవనం మొత్తం తిరిగి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ లోని కలెక్టర్ ఛాంబర్, మీటింగ్ హాల్, అదనపు కలెక్టర్, ఏ వో చాంబర్లను పరిశీలించారు. బిల్డింగ్ లోపల చాంబర్ల కు కిటికీలు, తలుపులను వెంటనే బిగించాలని, వైరింగ్, శానిటరీ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలన్నారు. మీటింగ్ హాల్ లో ప్రొజెక్టర్, సౌండ్ సిస్టమ్, మీటింగ్ హాల్ కలరింగ్ కోసం ఇతర జిల్లాలలోని కలెక్టరేట్ భవనాలలో ఆయా మీటింగ్ హాల్స్, కలెక్టర్ ఛాంబర్ ల డిజైన్ల ను చూసి, అలాంటి వాటినే ఇక్కడ డిజైన్ చేయాలని ఆదేశించారు. అంతలోపు వుడెన్ వర్క్ ప్రారంభించాలన్నారు. అలాగే భవనం వెనుకభాగంలో దారిని ఏర్పాటు చేసి గేటును అమర్చాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. బిల్డింగ్ బయట ఆవరణలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయడానికి కుదరదని, హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని అధికారులు కలెక్టర్ కు తెలపగా, ఆ స్థలాన్నీ వాహనాల పార్కింగ్ కు కేటాయించాలని, పార్కింగ్ షెడ్డు పై మహిళా సంఘాల సభ్యుల సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటు గురించి అధికారులతో ఆమె చర్చించారు. అనంతరం కలెక్టర్ బంగ్లా వెనుక భాగంలో 2 ఎకరాలలో స్థలంలో 5 కోట్ల తో కొనసాగుతున్న ఇందిరా మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఆ భవనంలోని మీటింగ్ హాల్, ఇతర గదులను చూశారు. భవనం బయట స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అవకాశం ఉంటే చూడాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. భవన ఆవరణలో ఒక వైపు రహదారిని ఏర్పాటు చేసి, మిగతా స్థలంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని డీ ఆర్డీ ఓ వెంకట్ రాములు కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈ ఈ వెంకట రమణ, డీ ఈ రాములు, పీ ఆర్ ఈ ఈ అశోక్ కుమార్, ఆయా శాఖల ఏ ఈ లు, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ఘనంగా భ్రమరాంబ సమేత శంబులింగేశ్వర దేవస్థానం సప్తమ వార్షికోత్సవ మహోత్సవాలు

**బీరంగూడ (వుదయం):**

బీరంగూడలోని శ్రీ భ్రమరాంబ సమేత శంబులింగేశ్వర దేవస్థానం సప్తమ వార్షికోత్సవ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ ధర్మకర్త, శ్రీ శంబులింగేశ్వర సేవా సమితి అధ్యక్షులు అదెల్లి రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ గోమాత పూజ, గణపతి పూజ, ప్రత్యేక హోమాలు, రుద్రాభిషేకం, శివార్చన తదితర విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, శ్రీ శంబులింగేశ్వర సేవా సమితి అధ్యక్షులు అదెల్లి రవీందర్ మాట్లాడుతూ, కీర్తిశేషులు అదెల్లి నారాయణ నిర్మించిన



ఈ దేవాలయం ఆధ్యాత్మిక సేవలకు కేంద్రంగా నిలుస్తోందన్నారు. గత పదేళ్లుగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రతి సంవత్సరం వార్షికోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాంత ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని సంకల్పించి గోమాత పూజలు, హోమాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదెల్లి కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయంలో నిత్యపూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఏడాది భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం ఆనందంగా ఉందని తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. ఆధ్యాత్మిక వాతావరణంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా బీరంగూడ గ్రామ పెద్దలు రమేష్ గౌడ్, మాకం మల్లేష్, పిర్జపతి సత్యనారాయణ, చిన్న వీరేశం, పెద్ద వీరేశం, నక్కల కిష్టయ్య, ఎడ్ల జనార్దన్, బంటు శివ, ప్రవీణ్, నవీన్, నాయకులు శ్రవణ్, లక్ష్మణ్ గుప్తా, గోపాల్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రవణ్ పంతులు, సంబశివా రావు పంతులు, విశ్వేశ్వర్ పంతులు, నరేష్ పంతులు, అదెల్లి కుటుంబ సభ్యులు జైరాములు, శంకర ప్రసాద్, ఆంజనేయులు, రాజు, శ్రీధర్, యాదగిరి, ప్రభాకర్, చంద్రశేఖర్‌తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ఘనంగా లక్ష్మీ గణపతి ప్రతిష్టాపన



**అమీన్ పూర్ జూన్ 27,**

పఠాన్ చెరు నియోజకవర్గంలోని అమీనాపూర్ డివిజన్ పరిధి మారుతి నగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది.
ఈమహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆమెకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా కాట సుధా మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రజలంతా ధర్మపరమైన కార్యక్రమాల్లో భాగస్వాములై భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ



**జిన్నారం**
**జూన్ 27(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మున్సిపల్ తో పాటు బొల్లారం డివిజన్ పరిధిలో బూత్ లెవల్ అధికారులు(బీఎల్ వోలు) ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సంబంధిత పత్రాలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియను తాసిల్దార్ ఆంటోనీ స్వయంగా పర్యవేక్షించారు. ప్రతి ఓటరు అందిన ఫారాలను చాలని అధికారులు సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బిఎల్వోలు సునీత, మౌలాలి, తదితరులు ఓటర్లు స్థానికులు పాల్గొన్నారు.

## పెట్రోలు, డీజిల్‌పై తాత్కాలిక ఆంక్షలు

**- పెద్ద మొత్తంలో కొనుగోళ్లకు అడ్డుకట్ట బంకుల్లో రోజుకు 200**
**- లీటర్ల డీజిల్ మాత్రమే 90 రోజుల పాటు కొత్త నిబంధనలు**
**- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్,**
**జూన్ 27 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో పెట్రోలు, డీజిల్ అమ్మకాలు అసాధారణంగా పెరగడం, పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు చిల్లర బంకుల నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయడంతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక నియంత్రణలు విధించింది.భారత ప్రభుత్వ చమురు, సహజ వాయు శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వచ్చి 90 రోజుల పాటు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమల్లోకి వచ్చిన కీలక నిబంధనలు : పెద్ద కొనుగోళ్లకు నిషేధం సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు చిల్లర పెట్రోలు బంకుల నుంచి ఇంధనం కొనరాదు. వారికి కేటాయించిన సొంత ఇంధన నిల్వ కేంద్రాలు లేదా పెద్ద మొత్తంలో సరఫరా చేసే మార్గాల ద్వారానే తీసుకోవాలి. ఆమోదించిన తొట్టెలకే డీజిల్ డీజిల్‌ను వాహనాల ఇంధన తొట్టెలకు లేదా పేలుడు పదార్థాల నియంత్రణ సంస్థ ఆమోదించిన డబ్బాలకు మాత్రమే నింపాలి. 200 లీటర్ల పరిమితి ఒక వ్యక్తికి లేదా ఒక వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల డీజిల్ మాత్రమే ఇవ్వాలి. మళ్లీ అమ్మడం నేరం చిల్లర బంకుల నుంచి కొన్న డీజిల్‌ను తిరిగి ఇతరులకు అమ్మడం పూర్తిగా నిషేధం.చట్టపరమైన చర్యలు తప్పవుఇంధనాన్ని దాచిపెట్టడం, నల్లబజారుకు తరలించడం, అక్రమంగా నిల్వ చేయడం, అనుమతి లేకుండా అమ్మడం, ఇంధనాన్ని దారి మళ్లించడం వంటివి నిత్యావసర వస్తువుల చట్టం, 1955 ప్రకారం శిక్షార్హమైన నేరాలని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లాలోని అన్ని పెట్రోలు బంకుల యజమానులు, చమురు సంస్థలు, పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు, సాధారణ ప్రజలు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.

## ఎమ్మెల్యేను కలిసిన రైతు సంఘం నాయకులు



**జిన్నారం**
**జూన్ 27(వుదయం ప్రతినిధి)**

**- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలిసిన నూతన కార్యవర్గం**
**- రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని వెల్లడి**
**- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచన**

జిన్నారం మండలంలో నూతనంగా ఏర్పాటైన రైతు సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు శనివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ఏర్పాటుకు సంబంధించిన వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేసి, రైతుల సంక్షేమం కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రైతుల అభివృద్ధికి సంఘం చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆకాంక్షించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ కుంచాల ప్రభాకర్, రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు పర్వతాలు యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, కోశాధికారి నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కీలక సమస్యలపై కమిషనర్ కు వినతి



**జిన్నారం**
**జూన్ 27(వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో నెలకొన్న కీలక సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు శనివారం కమిషనర్ తాన్యాను కలిసి విజ్ఞప్తి చేశారు. పలు ముఖ్యమైన సమస్యలపై కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. వీటిలో బృందావన్ వెంచర్ హనుమాన్ గుడి సమీపంలో డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. మున్సిపాలిటీలో పందుల బెడద దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కూడలి సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నీరు నిలిచిపోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని వెంటనే అక్కడ సమస్యను పరిష్కరించి మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీలో ఇటీవల వరుసగా జరుగుతున్న దొంగతనాల నివారణకు భద్రతను పటిష్టం చేస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. బృందావన్ వెంచర్ లో నీటి సౌకర్యాన్ని మెరుగుపరుస్తూ నల్ల కలెక్షన్లు అందించాలన్నారు. విద్యుత్ కార్యాలయం వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించి ప్రజల రాకపోకలకు అంతరాయం కలవకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీలోని ప్రధాన సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ పరిష్కార చర్యలకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వాసులు దేవయ్య శివకుమార్ సుధాకర్, శ్రీకాంత్ వెంకటేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి స్కూళ్లకు సీఎస్ఆర్ నిధులు

**సంగారెడ్డి వుదయం**



సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం టీజీఐఐసీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద రూ.5.40 కోట్లను కేటాయించారు. ఈ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం రూ.4 కోట్ల వ్యయంతో హాస్టల్ నిర్మాణం చేపట్టనున్నారు. గర్ల్స్ జూనియర్ కాలేజీలో రూ.75 లక్షలతో ఆడిటోరియం నిర్మించనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం డైనింగ్ హాల్, కిచెన్ నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించారు. అలాగే తారా డిగ్రీ కళాశాలలో ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు చేశారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, విద్యాశాఖ అధికారులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గడ్డపోతారంలో ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ



**జిన్నారం**
**జూన్ 27(వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో సర్ ప్రక్రియ మూడవరోజు జోరుగా కొనసాగింది. బి ఎల్ వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. పత్రాలను పూర్తి వివరాలతో నింపి బి ఎల్ వోలకు అందజేయాలని సూచించారు. ఖచ్చితమైన సమాచారాన్ని అందించి ప్రక్రియ సజావుగా పూర్తి చేసేలా ఓటర్లు సహకరించాలని ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు బి ఎల్ వో లు ఓటర్లు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



**- వికారాబాద్ జిల్లా ఉద్యమకారుల పిలుపు**

**తాండూరు**
**వుదయం ప్రతినిధి న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సమ్మేళనం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం సాయంత్రం 3:00 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా ఉద్యమకారులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమం,భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనం వేదికగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హాజీపూర్ మాజీ సర్పంచ్ ఒంగోని బాయి శ్రీనివాస్,ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సంజయ్ గౌడ్,ఉద్యమకారులు ప్రకాశ్ గౌడ్,జిలాని, హేమంత్ కుమార్,ఇంద్రానగర్ ప్రకాష్ గౌడ్,మహేష్ కుమార్,నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్ అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరు

**- కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలభివృద్ధి**
**- మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్**

**సిద్దిపేట, వుదయం**



పార్టీలకు అతీతంగా గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా అయన శనివారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దౌల్తాబాద్ గ్రామ అభివృద్ధి కోసం సుమారు రూ.50 లక్షల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన అభివృద్ధి పనులకు ప్రస్తుతం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం నిరంతరం నిధులు విడుదల చేస్తోందని పేర్కొన్నారు.మహిళల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా మహిళా భవనం నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు చెప్పారు.గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆది వేణుగోపాల్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టనున్నట్లు తెలిపారు.గ్రామాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకువచ్చి దౌల్తాబాద్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నూతన వస్త్రాల బహుకరణ

**- గృహ ప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పర్స దేవరాజు**

**వుదయం, దుబ్బాక సిద్దిపేట**

జిల్లా దుబ్బాక మండలం అచ్చుమాయపల్లి గ్రామానికి చెందిన మంద స్వప్న-సాయిరెడ్డి దంపతులు శనివారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పర్స దేవరాజు ముఖ్య పట్టు వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకొని గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు అభినందనలు తెలియజేశారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంపతి మైసయ్య, వార్డు సభ్యుడు సోమారపు రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంపతి రాజేందర్, పాతర్ల భాస్కర్, లక్ష్మీనర్సు, మంద మోహిన్ రెడ్డి, దుబ్బాక వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






## వినోద్ హాస్పిటల్‌లో నిబంధనల ఉల్లంఘన



**సంగారెడ్డి, జూన్ 27:వు దయం.**

సంగారెడ్డి పట్టణంలోని 33 వార్డ్ లో ఉన్న వినోద్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహణపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహణ కొనసాగుతోందన్న ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.తనిఖీ సందర్భంగా ఆస్పత్రి భవనం ఒకచోట ఉండగా, పార్కింగ్ సదుపాయం మరోచోట ఏర్పాటు చేసిన విషయాన్ని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో స్థానిక కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. ఆస్పత్రి విస్తరణ పేరుతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.అంతేకాకుండా ఆస్పత్రిలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను రక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉన్నాయా లేదా అనే అంశంపై సమగ్రంగా పరిశీలించినట్లు సమాచారం. మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ అందుకు తగిన వైద్య సదుపాయాలు, పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉన్నారా అనే విషయంపై కూడా అధికారులు వివరాలు కోరినట్లు తెలిసింది. కొన్ని విభాగాల్లో నిర్వహణ లోపాలు, గందరగోళ పరిస్థితులు కనిపించడంతో అధికారుల ప్రశ్నలకు యాజమాన్యం సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం.తనిఖీ సమయంలో ఆస్పత్రిలో రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉండటం, ఐసీయూ వార్డులోని పలు బెడ్లు ఖాళీగా కనిపించడం కూడా అధికారుల దృష్టిని ఆకర్షించింది. రిజిస్ట్రేషన్ వివరాలు, అనుమతులు, భద్రతా ప్రమాణాలకు సంబంధించిన పత్రాలను కూడా అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది.తనిఖీ అనంతరం పూర్తి నివేదికను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు సమాచారం. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైతే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.వైద్య సేవల ముసుగులో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారా? లేక ఫిర్యాదుల్లో అతిశయోక్తి ఉందా? అధికారుల నివేదిక వెలువడే వరకు ఈ వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ గా అనిత

**సూర్యాపేట జూన్ 27**
**వుదయం ప్రతినిధి**



జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ గా అనిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన లక్ష్మణ్ నాయక్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ పై వెళ్లగా జనగాం నుండి ఆమె సూర్యాపేట జిల్లాకు వచ్చింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.



## మన మౌనం ప్రమాదం...

"గాజా యుద్ధం, పాలస్తీనా అంశంపై కేంద్ర ప్రభుత్వం మౌనం దాల్చటం దారుణం. పశ్చిమాసియాతో సంబంధాల విషయంలో భారత్ తన చారిత్రక వైఖరికి దూరమవుతోంది. గాజాలో పౌరుల మరణాలపై భారత్ బలంగా స్పందించడం లేదు. పాలస్తీనా హక్కులకు మద్దతుగా భారత్ గతంలో అవలంబించిన విధానానికి ఇప్పుడు దూరమవుతోంది. ఐక్యరాజ్యసమితి స్వతంత్ర దర్యాప్తు కమిషన్ నివేదికను ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి. గాజాలో వేలాది మంది చిన్నారులు మరణించారు, మరెందరో గాయపడ్డారు. అంతర్జాతీయ సమాజం ఇప్పటికీ ఈ ఘర్షణను నిలిపివేయడంలో విఫలమైంది. భారత్ ఈ అంశంలో "ఒంటరి మౌన స్వరం"గా మారింది. ఇది నైతికంగానే కాకుండా జాతీయ ప్రయోజనాల కోణంలోనూ సమర్థించలేని వైఖరి. పాలస్తీనాతో భారత్‌కున్న చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా స్పందించాల్సిన అవసరముంది..."

* –సోనియా గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

## వే'మన'పద్యం

నీళ్ళలోన మొసలి నిగిడి యేనుఁగు దీయు
బయట కుక్కచేత భంగపడును
స్థానబలిమిగాని తన బలిమి కాదయా
విశ్వదాభిరామ! వినుర వేమ!



## సంపాదకీయం

# పోయిన ప్రాణాలు తిరిగొస్తాయా..?

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని కోచింగ్ సెంటర్‌లో సోమవారం జరిగిన అగ్నిప్రమాదం పద్నాలుగు మంది విద్యార్థుల్ని బలిగొంది. ఉద్యోగాల కోసం పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే ఆశతో కోచింగ్‌కు వెళ్లిన వారు సజీవ దహనమవడం దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మంటలు, పొగల మధ్య చిక్కుకున్న విద్యార్థులు కిటికీల నుంచి దూకి ప్రాణాలు కాపాడుకు నేందుకు ప్రయత్నించిన దృశ్యాలు ప్రతి ఒక్కరి హృదయాలను కలచి వేశాయి. ఈ ఘటన ఒక సాధారణ ప్రమాదం అనడం కంటే నిర్లక్ష్యానికి, పరిపాలనా వైఫల్యానికి, ఉపాధి సంక్షోభానికి సజీవ సాక్ష్యంగా చెప్పొచ్చు. ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగి, ప్రధాని మోడీ విచారం వ్యక్తం చేస్తూ, పరిహారం కూడా ప్రకటించారు. కానీ, పోయిన ప్రాణాలను తీసుకు రాగలరా?భవనంలో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు సరిపడా లేవన్న అను మానాలు వ్యక్తమ వుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు అవసరమైన మార్గాలు లేకపోవడం, భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించడం కారణంగా తెలుస్తోంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. భవన యాజమాన్యం, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, పర్యవేక్షణ బాధ్యత వహించే ప్రభుత్వం తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి ఉంటే ఇంత పెద్ద ప్రాణనష్టం జరిగేది కాదు. మంటలు వ్యాపించినప్పుడు విద్యార్థులు కిటికీలను ఆశ్రయించడం, పై నుంచి దూకడం చూస్తుంటే తప్పించుకోవడానికి సరైన దారి కూడా కనిపించడం లేదని అర్థమవుతోంది. ఇది ముమ్మాటికీ పాలనావ్యవస్థ పర్యవేక్షణ లోపమే అవుతుంది.అలాగే ఈ విషాదాన్ని అర్థం చేసుకోవాలంటే యూపీలోని యువత పరిస్థితిని కూడా పరిశీలించాలి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షలాది మంది యువకులు ఏండ్ల తరబడి సిద్ధమవుతున్నారు. నియామకాలలో జాప్యాలు, పరీక్షల రద్దులు, ప్రశ్నా పత్రాల లీకేజీలు, ఖాళీల భర్తీలో ఆలస్యం వంటి సమస్యలు యువతను కోచింగ్ సెంటర్లపై మరింతగా ఆధారపడేలా చేస్తున్నాయి. ఉద్యోగం దొరకాలంటే కోచింగ్ తప్పనిసరి అన్న పరిస్థితి ఏర్పడింది. దీంతో కోచింగ్ పరిశ్రమ భారీ వ్యాపారంగా మారింది. బీజేపీ పాలకులు ఉత్తర ప్రదేశ్‌ను అభివృద్ధి నమూనాగా ప్రచారం చేస్తున్నారు. కేంద్రం లోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండటాన్ని "డబుల్ ఇంజన్ ప్రభుత్వం"గా పేర్కొంటున్నారు. కానీ ఈ ఘటన ఆ ప్రచారానికి భిన్నమైన వాస్తవాలను బయటపెడుతోంది. ఉపాధి అవకాశాలు సమృద్ధిగా ఉంటే, ప్రభుత్వ నియామకాలు క్రమబద్ధంగా జరిగితే, యువత లక్షల సంఖ్యలో కోచింగ్ కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఏముంటుంది? ఉద్యో గాల కొరతే కోచింగ్ కేంద్రాలను ప్రత్యామ్నా యంగా మార్చింది.లక్నో అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి విద్యార్థి వెనుక ఒక్కో కుటుంబ శ్రమ దాగి ఉంది. వాళ్లు వ్యవసాయంపై ఆధార పడిన వారు కావచ్చు, లేదంటే చిన్న వ్యాపారం చేసుకుని జీవనాధారం పొందేవారు కావచ్చు, అప్పులు చేసి చదువుకునే వారు కావచ్చు. ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఇంటికి పెద్దదిక్కుగా మారతారని భావించిన తల్లిదండ్రులకు పిల్లలు అగ్నికి ఆహుతి కావడం వారిని శాశ్వత విషాదంలోకి నెట్టింది. ఈ ప్రమాదం యాజమాన్య నిర్లక్ష్యానిది మాత్రమే కాదు, ప్రభుత్వ పర్యవేక్షణ వైఫల్యాన్ని కూడా ప్రశ్నిస్తోంది. భవనానికి అనుమతులు ఎవరిచ్చారు? అగ్నిమాపక శాఖ తనిఖీలు ఎప్పుడు నిర్వహించింది? భద్రతా లోపాలు ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదు? విద్యార్థులతో నిండిపోయే కోచింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి ఎందుకు లేదు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వమే. 'విచారణ జరుగుతోంది' అన్న మాటలు చెప్పి తప్పించుకుంటామంటే కుదరదు.ఎందుకంటే, దేశంలో ఇలాంటి ఘటనలు పదేపదే జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. పాఠశాలలు, ఆస్పత్రులు, వాణిజ్య సము దాయాలు, కోచింగ్ కేంద్రాలు అగ్నికి ఆహుతవుతున్నా పర్యవేక్షణ లేదు. ఘటన జరిగినప్పుడు మాత్రం సానుభూతి, పరిహార ప్రకటనలు షరా 'మామూలే'! కానీ కొంత కాలానికే అన్నీ మరిచిపోతారు. బాధిత కుటుంబాలు మాత్రం జీవితాంతం ఆ నష్టాన్ని మోస్తూనే ఉంటాయి. అందుకే లక్నో ఘటనను కూడా కేవలం ఒకరోజు వార్తగా పరిమితం చేయకూడదు. ఈ విషాదం మూడు ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. మొదటిది భద్రతా ప్రమాణాల అమలు. రెండోది ప్రభుత్వ పర్యవేక్షణ సామర్థ్యం.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు...

*స్వాతంత్ర్యం వచ్చాక రెండు దశాబ్దాల పాటు కాంగ్రెస్ ఏకచ్ఛత్ర పరిపాలన కొనసాగింది. 1967 నుండి ప్రాంతీయ అస్తిత్వ రాజకీయ శక్తులు నానాటికి బలపడుతూ వచ్చాయి. దేశ రాజకీయాలను శాసించే స్థితికి చేరుకున్నాయి. కానీ గత పుష్కర కాలంగా నానాటికి నీరసించి పోతున్నాయి. ఆసేతు శీతాచలం విస్తరించి ఏకఛత్ర అధికార ప్రతిష్టాపన కోసం బీజేపీ చతుర్విధో పాయాలతో ముందుకు సాగుతున్నది. దేశానికి సారథ్యం వహించేది ఆ రెండు పార్టీలేనా మూడవ ప్రత్యామ్నాయం ఇక ముగిసిన అధ్యాయమేనా అన్న విచికిత్స ప్రజలను కలవర పెడుతోంది.*

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సమాఖ్య స్ఫూర్తికి రాజకీయ రూపాలైన ప్రాంతీయ పార్టీల ఉనికి నానాటికి ప్రశ్నార్థకమవున్నది. ఏక కేంద్ర రాజకీయాల వైపు దేశం వడివడిగా అడుగు లేస్తున్నది. వైవిధ్య భరితమైన ప్రాంతాలు జాతులు, మతాలు, కులాల సమాహారమైన భారతదేశం భిన్నత్వంలో ఏకత్వ భావనలకు దూరమైపోతున్నది. స్వాతంత్ర్యం వచ్చాక రెండు దశాబ్దాల పాటు కాంగ్రెస్ ఏకచ్ఛత్ర పరిపాలన కొనసాగింది. 1967 నుండి ప్రాంతీయ అస్తిత్వ రాజకీయ శక్తులు నానాటికి బలపడుతూ వచ్చాయి. దేశ రాజకీయాలను శాసించే స్థితికి చేరుకున్నాయి. కానీ గత పుష్కర కాలంగా నానాటికి నీరసించి పోతున్నాయి. ఆసేతు శీతాచలం విస్తరించి ఏకచ్ఛత్ర అధికార ప్రతిష్టాపన కోసం బీజేపీ చతుర్విధో పాయాలతో ముందుకు సాగుతున్నది. దేశానికి సారథ్యం వహించేది ఆ రెండు పార్టీలేనా మూడవ ప్రత్యామ్నాయం ఇక ముగిసిన అధ్యాయమేనా అన్న విచికిత్స ప్రజలను కలవర పెడుతోంది.79 ఏళ్ల స్వతంత్ర భారత ప్రస్థానంలో కాంగ్రెస్‌కు చెందిన నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ఆరుగురు ప్రధానులు 54 ఏండ్లు పరిపాలిస్తే, బీజేపీకి చెందిన వాజపేయి, మోడీ పద్దెనిమిదేండ్లు (మోడీ పదవీ కాలం ఇంకా ముగియలేదు) పాలించారు. ఈ రెండు పార్టీలకు చెందని మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, వీపీ సింగ్, చంద్రశేఖర్, దేవగౌడ, గుజ్రాల్ ప్రధా నులుగా పరిపాలించిన మొత్తం కాలం కేవలం ఏడేండ్లు. దేశంలో బీజేపీ, కాంగ్రెసేతర ప్రధానులు అధికారంలో బతికి బట్టకట్టడం అంత సులభం కాదని ఆ గణాంకాలు చెప్తున్నాయి. 1989-2009 మధ్యలో జరిగిన ఏడు సాధారణ ఎన్నికల్లో బీజేపీ,కాంగ్రెస్ మెజార్టీ సాధించలేదు. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలే కొలువు తీరాయి. మిత్రపక్ష పార్టీల దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడి కొనసాగాయి. పాతికేళ్ల తర్వాత మోడీ నాయకత్వంలో బీజేపీ 2014, 2019లోక్ సభ ఎన్నికల్లో మెజార్టీ సాధించి సొంత కాళ్లమీద నిలబడగలిగే స్థాయికి ఎదిగింది. దీనికి కారణాలనేకం. ఆరెస్సెస్ పాత్ర, హిందుత్వ వాదం, కార్పొరేట్ల సహకారం కాదనలేం. కానీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ దక్కలేదు.మిత్ర పక్ష ప్రాంతీయ పార్టీల అండతో రెండేండ్లు నెట్టుకొచ్చింది. అయితే 1999లో వాజపేయి ప్రభుత్వం జయలలిత మద్దతు ఉపసంహరించడంతో కేవలం ఒక్కఓటు తేడాతో ఓడిపోయి 13 నెలలకే కూలిపోయిన పీడకలను బీజేపీ ఇంకా మరచిపోలేదు. వర్తమాన మోడీ ప్రభుత్వానికి ప్రధాన మద్దతు దారులైన చంద్రబాబు, నితీష్ ఎప్పుడు పుట్టి ముంచుతారోనన్న అనుమానంతో వారిని బీజేపీ నమ్మడం లేదు. ఇద్దరికీ వివిధ సందర్భాల్లో బీజేపీ కూటమి నుంచి వైదొలిగిన చరిత్ర ఉంది.అందుకనే ప్రత్యర్థి ప్రాంతీయ పార్టీలను చీల్చడం ద్వారా రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజార్టీకి చేరువైన బీజేపీ అదే ఫార్ములా ఉపయోగించి లోక్‌సభలో సొంతంగా మెజార్టీ సాధించడం కోసం దూకుడు పెంచింది. ప్రాంతీయ పార్టీల ధ్వంస రచనకు ఉపక్రమించింది. ఆ దెబ్బకు శివసేన, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ కకావికలమైపోయాయి. మరికొన్ని పార్టీలకు అదే వరుసలో ప్రమాదం పొంచి ఉందన్న సంకేతాలు వెలువ డుతున్నాయి. ఒకప్పటి కాంగ్రెస్‌లాగా ఇప్పుడు బీజేపీ ఏక కేంద్ర రాజకీయాధికార వ్యవస్థ కోసం డబులింజన్ సర్కార్ ధ్యేయంగా నడుం బిగించింది. అందుకోసం మోడీ-అమిత్ షా ద్వయం బహుముఖ పథక రచన చేస్తున్నది. తొలుత ప్రాంతీయ పార్టీలతో పొత్తు కలుపుకొని కాలక్రమంలో బలపడి పైచేయి సాధించడం. అధికారాన్ని లాక్కోవడం. బలమైన ప్రాంతీయ పార్టీలను చీల్చివిలీనం చేసుకోవడం, నయనా భయానా దారికి రాని ప్రాంతీయ పార్టీల నేతలపై దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం, సోషల్ మీడియా వేదికగా విపరీతమైన దుష్ప్రచారానికి ఒడి కట్టడం, విభేదించిన వారిని హిందుత్వ వ్యతిరేకులనే ముద్ర వేయడం, ఇలా సామభేదదాన దండోపాయాలతో ఒక్కొక్క రాష్ట్రాన్ని హస్తగతం చేసుకుంటూ వస్తున్నది. ఇటీవల చూస్తుండగా మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశాలో ప్రాంతీయ పార్టీల దశాబ్దాల ఆధిపత్యానికి గండి కొట్టి అధికారం కైవసం చేసుకున్న బీజేపీని నిలువరించడానికి ఒక మూడో ప్రత్యామ్నాయం తప్పదని పరిణామాలు ఘోషిస్తున్నాయి. కాంగ్రెస్ ను ఆదిశగా ఊహించలేం. ఇప్పుడు బీజేపీ చేస్తున్నదే ఒకప్పుడు కాంగ్రెస్ చేసింది.చింత చచ్చినా పులుపు చావదు అన్నట్లు కాంగ్రెస్ స్వార్థం కోసం మిత్రపక్ష ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడా నికి ఏ మాత్రం వెనుకాడడం లేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్‌పై లేనిపోని అపనిందలు మోపింది. తమిళనాడులో డీఎంకేను చౌరస్తాలో వదిలేసింది. రాష్ట్రస్థాయిలో తాత్కాలిక లబ్ధి కోసం మిత్రపక్షాలను దూరం చేసుకుంటున్న కాంగ్రెస్ వైఖరి పరోక్షంగా ప్రత్యర్థి బీజేపీ బలోపేతానికి ఉపయోగపడుతున్నది.ప్రాంతీయ పార్టీలు కేంద్రానికి వ్యతిరేకంగా ఏం మాట్లాడినా అది జాతి సమైక్యత సమగ్రతలకు భంగం కలిగిస్తున్నట్లు, దేశభక్తి రాహిత్యమైనట్లు, దేశ అస్తిత్వానికి ప్రమాదకరమైనట్లు బీజేపీ ఒకబూచిని చూపిస్తున్నది. అవసరమైనప్పుడు అవే పార్టీలను అక్కున చేర్చుకుని పబ్బం గడుపుకుంటున్నది. ఇందిరమ్మ రాజీవ్ ప్రాణ త్యాగాలను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్, పాకిస్తాన్ బంగ్లాదేశ్ అడ్డుపెట్టుకొని బీజేపీ ప్రత్యర్థి పార్టీలను దబాయిం చడానికి అలవాటు పడిపోయాయి. కేంద్రంలో అధికార వారసులం తామేనని, తమ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వాలు మాత్రమే మన గలుగుతాయని, తమకు మద్దతివ్వడం తప్ప ప్రాంతీయ పార్టీలకు మరో దారి లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి.ఇక రాష్ట్రాల విషయానికొస్తే ప్రాంతీయ పార్టీలకు తమ పొత్తు అనివార్యమన్న వాతావరణం కల్పించాయి. రెండు పార్టీలకు సమాన దూరంలో కొనసాగుతున్న ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ వంటి వేళ్లమీద లెక్క పెట్టగలిగే పార్టీలు ఏటికి ఎదురీదుతున్నాయి. మిగతావన్నీ బీజేపీ లేదా కాంగ్రెస్ ఏదో ఒక జాతీయ పార్టీ శిబిరాల్లో తలదాచుకుంటున్నాయి. ఈ విశాల భారతావనిలో ప్రధాని అభ్యర్థులు ఎవరంటే మోడీ, రాహుల్ తప్ప మరో పేరు వినిపించని శూన్యం ఏర్పడింది.




# ఆడదంటే అంత చులకనా...?

*మహిళలు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలు, రక్షణ కోసం కల్పించిన ప్రత్యేక రక్షణ చర్యలను కరపత్రాలు, హోర్డింగ్‌ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. యువతలో చైతన్యం కల్పించాలి. ఇందుకోసం ఐద్వా అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నది, ప్రభు త్వానికి విన్నవిస్తున్నది. కానీ, ప్రభుత్వాలు ఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు వెళ్లి పరామర్శిస్తారు, మంచి వైద్యం అందించాలని చెబుతారు. 'మా అంత మహానుభావులు లేరని' చెప్పి చేతులు దులుపుకుంటారు. ఆ తర్వాత ఏమవుతుంది? ఎందుకు దీనిగురించి లోతుగా చర్చించడం లేదు? ఈ భావజాలం ఎందుకు వ్యాప్తి చెందుతుంది?*



జూన్ 5వ తేదీన ఖమ్మం పట్టణంలో పన్నెండేండ్ల బాలికపై జరిగిన లైంగికదాడి ఘటన, హత్యాయత్నం హృదయాన్ని కలిచివేసింది. దేశంలో, రాష్ట్రంలో తెల్లవారి లేస్తే చాలు, ఏ బాలికపైన ఏం జరుగుతుందో అని తల్లిదండ్రులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి. వయస్సుతో నిమిత్తం లేకుండా అతి చిన్న క్లాసుల నుంచి స్కూలు, కాలేజీ, పని ప్రదేశాలు, ఇండ్లు, గుడులు, గోపురాలతో సహా అన్నీ లైంగికదాడులకు నిలయంగా మారాయి. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలలో కొంత తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ, ఆడపిల్లను సెక్స్ సింబల్‌గా చూస్తున్న ధోరణి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ విషయంపై చట్టసభల్లో చర్చించాలి. దీన్ని లోతుగా పరిశీలించి అరికట్టే దిశగా తగు చర్యలు తీసుకోవాలి. మహిళలు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న చట్టాలు, రక్షణ కోసం కల్పించిన ప్రత్యేక రక్షణ చర్యలను కరపత్రాలు, హోర్డింగ్‌ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. యువతలో చైతన్యం కల్పించాలి. ఇందుకోసం ఐద్వా అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నది, ప్రభు త్వానికి విన్నవిస్తున్నది. కానీ, ప్రభుత్వాలు ఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు వెళ్లి పరామర్శిస్తారు, మంచి వైద్యం అందించాలని చెబుతారు. 'మా అంత మహానుభావులు లేరని' చెప్పి చేతులు దులుపుకుంటారు. ఆ తర్వాత ఏమవుతుంది? ఎందుకు దీనిగురించి లోతుగా చర్చించడం లేదు? ఈ భావజాలం ఎందుకు వ్యాప్తి చెందుతుంది?

ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ ఒక మైనర్ బాలికను మోసం చేసిన కేసులో అతన్ని రక్షించడం కోసం శతవిధాలా ప్రయత్నించారు. ప్రధాన స్రవంతి మీడియాను కంట్రోల్‌లో పెట్టు కున్నారు. సోషల్ మీడియాలో పెద్దఎత్తున స్పందన, ప్రతిఘటన రావడంతో తప్పనిసరి పరిస్థితులలో మంత్రి కొడుకును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర మంత్రి కొడుకును కాపాడటానికి చేసిన వ్యాఖ్యానాలు అత్యంత హేయమైనవి. అంతిమంగా కేంద్ర మంత్రి తన కొడుకును తానే స్వయంగా పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తున్నానని ప్రకటించాడు. ముఖ్యమంత్రి మాత్రం 'మా పోలీసులే అతన్ని అరెస్టు చేశారని' చెప్పుకోవడం విచిత్రమైన పరిస్థితి.
ఆ తర్వాత ఏమవుతుంది? ఎందుకు దీనిగురించి లోతుగా చర్చించడం లేదు? ఈ భావజాలం ఎందుకు వ్యాప్తి చెందుతుంది?ఆ తర్వాత ఏమవుతుంది? ఎందుకు దీనిగురించి లోతుగా చర్చించడం లేదు? ఈ భావజాలం ఎందుకు వ్యాప్తి చెందుతుంది?మహిళ అనగానే ఎక్కడైనా ఏమైనా చేయవచ్చు. ఏ కామెంటయినా చేయవచ్చు. ఏ విధంగానైనా వాడుకోవచ్చు. ఆమె వెంటపడి, వేధించే హక్కు, ప్రేమించపోతే, పెండ్లి చేసుకోను అంటే యాసిడ్ పోసే హక్కు, హత్య చేసే హక్కు ఇవన్నీ ఏ చట్టం ఇచ్చింది? యువతలో ఇటువంటి ఆలోచనలు పురుషాధిక్య భావజాలం నుంచి వస్తున్నాయి. ఈ భావజాలాన్ని మనుధర్మ శాస్త్రం పెంచి పోషిస్తున్నది. వందల సంవత్సరాల నాడు చట్టసభలు, ఓటుహక్కు లేని కాలంలో రాసిన ధర్మాలను ఇప్పటికీ అనుసరించాలని చూస్తున్నారు. ఆనాడు స్త్రీల గురించి చాలా చులకనగా రాశారు. స్త్రీ అంటే ఒక ద్వితీయశ్రేణి పౌరురాలిగా, చేతకాని మనిషిగా, పురుషుడిగా దాసీగా, ఒక విలాస వస్తువుగా మనుధర్మం వక్రీకరించింది. మహిళలు దాన్ని బద్దలు కొట్టి అనేక హక్కులు, చట్టాలు సాధించు కున్నారు. భారతదేశానికి ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంది. రాజ్యాంగం ఏర్పడింది. ఆ రాజ్యాంగ హక్కులలో భాగంగా అనేక చట్టాలు వచ్చాయి. ఆ చట్టాలని మనం అనుసరించాల్సిన అవసరం లేదా? చదువుకున్నవారు కూడా ఈ భావజాలాన్ని ఎందుకు ప్రేమిస్తున్నారు? ఎందుకు గౌరవి స్తున్నారు? దీనికి కారణం ఆరెస్సెస్ రాజకీయ విభాగంగా ఉన్న బీజేపీ. దేశవ్యాప్తంగా ఇంకా ఇలాంటి భావజాలమే కావాలని, ఇదే కరెక్టు అని, మాకు రాజ్యాంగంతో సంబంధం లేదు అని, బీజేపీ నేతలు పేట్రేగి మాట్లాడుతుంటే, ఈ సమాజంలో ఉన్న కొందరు మేధావులు, చదువుకున్న వారు కూడా ఈ ఆలోచనా విధానాన్ని, చర్యలను బలపర్తున్నారు.

దీని పర్యవసానమే ఇవాళ ఆడపిల్లలపై ఇటువంటి దుర్మార్గాలు. 'బేటీ బచావో బేటీ పఢావో' అని నీతులు చెప్పే బీజేపీ పార్టీ ఈ భావజాలాన్ని పెంచి పోషిస్తుంటే, మీ కుటుంబాలకు ఇది వర్తించదా అని, ఆ భావజాలాన్ని ప్రేమించేవారు కూడా ఆలోచించాలి. ఖమ్మం పట్టణంలో జరిగిన ఘటన పరిశీలిస్తే, ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరిగింది కాదు. నివాస ప్రాంతంలో, ఎంతో భద్రత ఉంటుందనుకున్న అపార్టుమెంటులో ఈ దాడి జరిగింది. ఆ అపార్టుమెంటుకు సంబంధంలేని యాభై ఏండ్ల వ్యక్తి పన్నెండ్లేండ్ల మైనర్ బాలికపై లైంగికదాడి చేశాడు. అక్కడ నివాసం ఉండే అమ్మాయి కూడా కాదు. కొద్దిరోజులు అమ్మమ్మ గారింటికి వచ్చిన పాపపైన దుర్మార్గానికి ఒడిగట్టాడు. ఆ పాప బతికినప్పటికీ ఆమె జీవితాంతం ఎందుకు పనికిరాని పరిస్థితిలో జీవించాలి. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆమెకు అన్ని వసతులు కల్పించాలని ఐద్వా పోరాడుతున్నది.రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో, పట్టణంలో అనేకమంది అభ్యుదయ కాముకులైన ప్రజలు ఉన్నారు.
అందులో న్యాయవాదులు కూడా ఉన్నారు. న్యాయవాదులందరూ మీ కుటుంబాలు, మీ బిడ్డల్ని గుర్తు తెచ్చుకుని ముద్దాయికి ఎటువంటి బెయిల్ కోసం ప్రయత్నం చేయకుండా నాన్ బెయిలబుల్ సెక్షన్లను పెట్టి అతనికి కఠినమైన శిక్ష పడేలా చేయాలి. అటువంటి మానవ మృగం మనుషుల మధ్య తిరగడానికి వీల్లేదు అని నిరూపించాలి. అలాగే అతని కుటుంబానికి కావలసిన సహాయసహకారాలు ప్రజలు, ప్రభుత్వం అందించాలి.

# రాజకీయ దురంధరుడు పాములపర్తి

*ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్నాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండీ పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు. 1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు.*



సమకాలీన రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొని తదనుగుణంగా సానుకూల వాతావరణం ఏర్పరచుకుని పరిపాలన సాగించిన వాడే సమర్థుడైన నాయకుడు కాగలడు అనేది అర్థశాస్త్ర రచయిత అయిన కౌటిల్యుడిగా పేరున్న చాణక్యుని అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని, తదనుగుణంగా నడుచుకొని బలం, బలగం లేకున్నా, దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేయ గలిగారు పి.వి. నరసింహారావు.దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా, నరసింహారావు కార్యదీక్షత, దార్శనికత ద్వారా ఖ్యాతి గడించారు. "పి.వి"గా లబ్ద ప్రతిష్టులైన ఆయన బహు భాషావేత్త, రచయిత. స్నాతకోత్తర న్యాయశాస్త్ర కోవిదులు, "అపర చాణక్యుడిగా" పేరొందారు. ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్నాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండీ పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు.1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుని ఇంట్లోనే ఉంటూ, 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమం లోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నారు.1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పివి, రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా కేంద్ర మంత్రిగా, చివరకు ప్రధానిగా తన మేధాశక్తితో, క్రమానుగతంగా ఉన్నత పదవులను, కైవసం చేసుకున్న రాజనీతిజ్ఞులు ఆయన. కాంగ్రెస్ హయాంలో, పూర్తి సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని, తన చాకచక్యంతో చాణక్యనీతితో, పూర్తి కాలం నడిపించిన మేధావి. 1957 లో మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు గెలిచారు. 1962 లో మొదటిసారి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, 62 నుండి 64 వరకు న్యాయ సమాచార మంత్రిగా, 64 నుండి 67 వరకు దేవాదాయ, న్యాయ; 67 లో వైద్య ఆరోగ్య 68 నుండి 71 వరకు న్యాయ, సమాచార శాఖలను నిర్వహించారు. 77లో లోకసభకు ఎన్నికైనారు. జనవరి 1980 – జూలై 1984 కేంద్ర విదేశ వ్యవహారాల మంత్రి; జూలై 1984 – డిసెంబర్ 1984 కేంద్ర హోం శాఖమంత్రి; నవంబరు 1984 – ఫిబ్రవరి 1985 భారత ప్రణాళికా శాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, జనవరి 1985 – సెప్టెంబరు 1985 కేంద్ర రక్షణ శాఖమంత్రి, సెప్టెంబరు 1985 – జూన్, 1988కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి; జూలై 1986 – ఫిబ్రవరి 1988 కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి; జూన్ 1988 – డిసెంబర్ 1989 విదేశ వహారాల శాఖ మంత్రి; 1991 మే 29 – 1996 కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగా; జూన్ 1991 – 1996 మే 10 వరకు ప్రధానమంత్రిగా పని చేశారు. 71 సెప్టెంబర్ నుండి 73 జనవరి వరకు ముఖ్యమంత్రిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. సీఎం పీఠం అధిష్ఠించగానే అసమ్మతి. ఈ విషయమై అధిష్టానంతో చర్చించేందుకు ఢిల్లీ – హైదరాబాదుల మధ్య తిరిగేందుకే ఆయనకు సమయం సరిపోయింది. పట్టణ భూ గరిష్ట చట్టాన్ని తెచ్చింది ఆయనే. ఆ తర్వాత ఆయన కార్యక్షేత్రం ఢిల్లీకి మారింది. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా, మొదటిసారి హనుమకొండ నుండి లోకసభకు ఎన్నికైనారు. నంద్యాల ద్వారా ఉప ఎన్నికలలో, టిడిపి పోటీ లేకుండా ఐదు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుపొంది, గిన్నిస్ రికార్డు సృష్టించి, పదవ లోకసభలో అడుగిడి, పలు శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. రాజీవ్ హత్య కారణంగా 1991 లో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయకుండానే, దేశ 10వ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు. భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను, తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకుని, "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా" పేరొందిన మేధావి. ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కోసం చేపట్టిన సంస్కరణలు, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక శాస్త్రవేత్త గా ఉన్న మన్మోహన్ సింగ్ ను, ప్రత్యేకించి పిలిచి, దేశ ఆర్థిక మంత్రిని చేయడం ఆయనకే చెల్లింది. దేశాన్ని బంగారం తాకట్టు పెట్టాల్సిన స్థితి నుండి, సూపర్ పవర్ గా తేర్చి దిద్దడానికి పునాది వేశారు. ఆర్థిక సంస్కరణల ద్వారా మార్కెట్ సరళీకరణ ఆర్థిక విధానాన్ని రూపొందించారు. సంస్కరణల 1992 లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కంప్యూటర్ ఆధారిత వ్యాపార పద్ధతిని ప్రారంభించారు. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచి వేసింది ఆయన ప్రభుత్వమే. కాశ్మీర్ తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినప్పుడు, వారి డిమాండ్లను లెక్క పెట్టక బందీలను విడిపించిన ఘనత ఆయనదే. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండడం, పివి ప్రభుత్వం సాధించిన విజయమే.1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలు పెట్టింది పీవీ ప్రభుత్వమే. ఆయన కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించారు. రాష్ట్ర విద్యా మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలకు రూపకర్త అయినారు. 1973లో సీఎంగా భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ట పరిమితి, పట్టణ పరిమితి చట్టాన్ని అమలు చేసిందీ పి.వి.నే. ప్రధానిగా ఆయన హయాంలో 1992 డిసెంబర్ 6 న అయోధ్యలో బాబరీ మసీదును కూలగొట్టిన సంఘటనలో పీవి వైఖరి వివాదాస్పదమైంది. ప్రధానిగా ఐదేళ్ళ పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలను పివి ఎదుర్కొన్నారు. చివరి కేసులన్నీ వీగిపోయాయి. బహుభాషా పండితులు, 17 భాషలలో అలవోకగా మాట్లాడ గలిగిన మేధావి. 1940 లో తన సోదరులతో కలిసి కాకతీయ పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. 1948 నుండి 51 వరకు కాకతీయ పత్రిక "సంపాదకునిగా" పని చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత వేయి పడగలను, "సహస్ర ఫణ్" పేరుతో, హిందీ అనువాదం చేసి జ్ఞానపీఠ అవార్డు పొందారు. 1968-74 మధ్య తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది "ఇన్‌సైడర్" అనే ఆత్మకథ. లోపలి మనిషిగా ఇది తెలుగులోకి అనువాద మయింది. 1983 లో స్పానిష్ భాషలో ప్రసంగించి, అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో, క్యూబా అధ్యక్షులు ఫిడేల్ ను అబ్బుర పరిచిన గొప్పతనం ఆయనది. నిరాడంబరుడు, తన పిల్లలను సైతం ప్రధాని కార్యాలయానికి దూరంగా ఉంచిన నిజాయతీ పరులు. చివరిదశలో కోర్టుల చుట్టూ తిరగడానికి సొంత ఆస్తులను అమ్ముకున్న వ్యక్తి. నిజాం వ్యతిరేక పోరాట యుద్ధ తంత్ర నిపుణునిగా చివరకు స్వతంత్ర్య సముపార్జన దినం నాడు, 1947 ఆగస్టు 15 న కూడా అటవీ క్షేత్రంలో పోరాట క్రమంలోనే ఉన్న పోరాట యోధుడు. 2004 డిసెంబర్ 23 న తుది శ్వాస వదిలా రాయన.పి.వి. స్మృత్యర్థం హైదరాబాదులో భారత దేశంలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ కు పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించి,19.10.2009 న ప్రారంభించారు. పివికి భారత రత్న అవార్డు ఇవ్వాలని సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. శత జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించి, సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అనురించడం ద్వారా కేసీఆర్, తెలుగు జాతి మహోన్నత వ్యక్తికి తగిన గౌరవం ఇవ్వడం ముదావహం.



సంగనభట్ల
9440595494



# జాతీయం-అంతర్జాతీయం






## మహారాష్ట్రలో టెట్ పేపర్ లీక్
# పరీక్ష వాయిదా

**అభ్యర్థుల్లో ఆందోళన, నిరాశ**

**ముంబయి, జూన్ 27,(ఎ.ఎం.ఎస్):** బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వరుస పేపర్ లీకేజ్ ఘటనలు ఆందోళనలు కలిగిస్తున్నాయి. మొన్నటిదాకా రాజస్థాన్ లో నీట్ పేపర్ లీకేజ్ తో ఇటీవల రీఎగ్జామ్ నిర్వహించిన విషయం తెలిసిందే. అదే విధంగా పలు పరీక్షల్లో మూల్యాంకనంలో అవకతకలు వెలుగులోకి వచ్చాయి. మరో వైపు ఈ పేపర్ లీకేజ్ లను వ్యతిరేకిస్తూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ శ్రేణులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. తాజాగా మహారాష్ట్ర లో టెట్ (టీచర్ ఎలిజీబుల్ టెస్ట్) పేపర్ లీకేజీ కలకలం రేపుతోంది. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్షను వాయిదా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1,028 కేంద్రాలలో రేపు (ఆదివారం) జరగాల్సిన ఈ పరీక్ష కోసం సుమారు 4.28 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసుకుని, కేంద్రాలకు బయలుదేరే సమయానికి పేపర్ లీక్ కారణంగా పరీక్ష వాయిదా పడడంతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు, ఆందోళనకు గురవుతున్నారు. భివాండికి చెందిన కొందరు వ్యక్తుల వద్ద టెట్ ప్రశ్నపత్రానికి సంబంధించిన సమాచారం ఉన్నట్లు తెలిసిందని,. భివాండి పోలీసులు ఆ ప్రదేశంలో దాడులు నిర్వహించగా, అనేక ప్రశ్నలు అసలైన టెట్ పరీక్షా పత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు విచారణలో తేలిందని మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఎగ్జామినేషన్ పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించి సంబంధిత వ్యక్తులపై భివాండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# థాంక్యూ ఇండియా...

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కృతజ్ఞతలు
- డొనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ పేరుపై ఎమోషనల్ పోస్టు

**న్యూయార్క్,వుదయం డెస్క్,** అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును హైదరాబాద్‌లోని ఒక ప్రధాన రహదారికి పెట్టడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ అపూర్వ గౌరవంపై డోనాల్డ్ ట్రంప్ స్వయంగా స్పందించారు. ఈ విధంగా గౌరవించబడిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిని తానేనని పేర్కొంటూ.. భారత దేశానికి ఆయన తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్'వేదికగా డోనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని తెలిపారు. "భారత దేశంలోని హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'డోనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ'.. ఈ విధంగా గౌరవం పొందిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిని నేనే. థాంక్యూ" అని ట్రంప్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు ఈ వారంలో హైదరాబాద్‌లో జరిగిన అధికారిక ప్రారంభోత్సవానికి సంబంధించిన ఒక ప్రత్యేక చిత్రాన్ని కూడా ఆయన షేర్ చేశారు. ఆ చిత్రంలో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, భారత దేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కలిసి స్మారక ఫలకాన్ని ఆవిష్కరిస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని గచ్చిబౌలినానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా నిర్మించిన అమెరికన్ కాన్సులేట్ భవనానికి ఆనుకుని ఉన్న ప్రధాన రహదారికి ఈ "డోనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ" అని నామకరణం చేసింది. అత్యంత వ్యూహాత్మకమైన ఈ ప్రాంతం చుట్టూ మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాల ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకుని ఈ రోడ్డు పేరును అధికారికంగా మార్చారు. ఈ నామకరణం కేవలం ఒక వ్యక్తికి ఇచ్చిన గౌరవం మాత్రమే కాదని, అమెరికా దేశానికి భారతదేశం ఇస్తున్న గొప్ప నివాళి అని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా భారత్‌అమెరికా దౌత్య, ఆర్థిక సంబంధాలలో హైదరాబాద్ నగరం ఎంతటి కీలక పాత్ర పోషిస్తుందో చెప్పడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యూఎస్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ సమక్షంలో జరిగిన ఈ వేడుకలో.. రక్షణ, అంతరిక్ష, ఐటీ రంగాలలో ఇరు దేశాల భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ హర్షం వ్యక్తం చేశారు.



**భారత దేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కలిసి స్మారక ఫలకాన్ని ఆవిష్కరిస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి-నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్తగా నిర్మించిన అమెరికన్ కాన్సులేట్ భవనానికి ఆనుకుని ఉన్న ప్రధాన రహదారికి ఈ "డోనాల్డ్ ట్రంప్ ఎవెన్యూ" అని నామకరణం చేసింది. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును హైదరాబాద్‌లోని ఒక ప్రధాన రహదారికి పెట్టడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ అపూర్వ గౌరవంపై డోనాల్డ్ ట్రంప్ స్వయంగా స్పందించారు. ఈ విధంగా గౌరవించబడిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడిని తానేనని పేర్కొంటూ.. భారత దేశానికి ఆయన తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.**



## పాక్‌లో సూత్రధారి సైఫుల్లా కసూరీ ప్రత్యక్షం

- షోయబ్ అక్తర్ సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొన్న వైనం
- అంతర్జాతీయంగా తీవ్ర కలకలం

**ఇస్లామాబాద్, జూన్ 27:** పాకిస్థాన్ మళ్లీ తన వక్రబుద్ధిని చాటుకుంది. భారత వ్యతిరేక శక్తులకు, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులకు ఆ దేశం సురక్షితమైన ప్రాంతం అనడానికి నిదర్శనంగా మరో సంచలన వీడియో వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ సోదరుడు షాహిద్ అక్తర్ అంత్యక్రియలకు భారత్‌లో ఘోర ఉగ్రదాడులకు పాల్పడిన నిషేధిత లష్కరే తయ్యిబా అగ్రనేతలు, కమాండర్లు బహిరంగంగా హాజరవడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సైఫుల్లా కసూరీ కూడా అక్కడ కనిపించడం.. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవతడంతో.. అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇస్లామాబాద్‌లో జరిగిన షాహిద్ అక్తర్ అంత్యక్రియల్లో.. గతేడాది భారత దేశంలోని పహల్గాంలో జరిగిన ఘోర ఉగ్రదాడికి ప్రధాన సూత్రధారి, లష్కరే డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరీ అలియాస్ ఖలీద్ అందరి ముందూ బాహాటంగా తిరుగుతూ కనిపించాడు. 2025 ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన ఘోర దాడిలో 26 మంది అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ దాడి వెనుక ఈ ఖలీద్ అలియాస్ సైఫుల్లా కసూరీనే కీలక పాత్ర పోషించాడు. దాడి అనంతరం భారత్‌కు వ్యతిరేకంగా ఇతడు చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు అప్పట్లో వైరల్ అయ్యాయి. ఇంతటి మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ రాజధాని నగరంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా తిరగడం గమనార్హం.

ఈ అంత్యక్రియలకు సైఫుల్లా కసూరీతో పాటు ఐరాస నిషేధిత ఉగ్రవాది హాఫీజ్ సయీద్‌కు చెందిన పొలిటికల్ వింగ్ 'పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్' (పీఎమ్ఎమ్ఎల్) అధ్యక్షుడు ఇనామ్ ఉర్ రెహ్మాన్ కూడా హాజరయ్యాడు. లష్కరే తోయిబాపైపై ఉన్న అంతర్జాతీయ ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి హాఫీజ్ సయీద్ ఈ పీఎంఎంఎల్ అనే రాజకీయ విభాగాన్ని తెరపైకి తెచ్చాడు. విచిత్రం ఏమిటంటే.. ఈ ఉగ్రవాద అనుబంధ సంస్థ గత 2024 పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల్లో కూడా అధికారికంగా పోటీ చేసింది.

ఈ పరిణామం ద్వారా పాకిస్థాన్ ప్రభుత్వం అంతర్జాతీయ సమాజం కళ్లుగప్పుతూ ఉగ్రవాదులకు ఎలా ఆశ్రయం కల్పిస్తోందో మరోసారి స్పష్టమైంది. ప్రపంచవ్యాప్తంగా ఎంత ఒత్తిడి ఉన్నా, తమ దేశంలో ఉగ్రవాదులు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారనే భారత్ ఆరోపణలకు ఈ అంత్యక్రియల వీడియోలు పక్కా సాక్ష్యాలుగా నిలిచాయి. అంతేకాకుండా పాక్‌లోని ప్రముఖులు, మాజీ సెలబ్రిటీలపై ఈ ఉగ్రవాద సంస్థల ప్రభావం ఎంతలా ఉందో ఈ ఘటన తేటతెల్లం చేస్తోంది. 2011లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి ప్రస్తుతం ప్రముఖ క్రికెట్ విశ్లేషకుడిగా, వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న షోయబ్ అక్తర్ కుటుంబ కార్యక్రమానికి ఉగ్రవాదులు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది.

## బిల్డర్లపై సుప్రీంకోర్టు కొరఢా..
# 2016 నాటి ఉత్తర్వులు రద్దు

- కొనుగోలు దారుల హక్కుల బలోపేతానికి చర్యలు

**న్యూఢిల్లీ, జూన్ 27 ,(ఎ.ఎం.ఎస్):** రియల్ ఎస్టేట్ బిల్డర్ల ఏకపక్ష వైఖరికి అడ్డుకట్ట వేస్తూ సుప్రీం కోర్టు కొనుగోలు దారుల హక్కులను మరింత బలోపేతం చేసింది. ఫ్లాట్ లేదా ఇంటిని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా.. నిర్మాణంలో జరిగిన ఆలస్యానికి గానూ బిల్డర్ల నుంచి ఆర్థిక పరిహారం కోరే హక్కు కొనుగోలు దారులకు ఉంటుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇల్లు చేతికి వచ్చినంత మాత్రాన బిల్డర్ల వైఫల్యాలను ప్రశ్నించే అర్హతను వినియోగదారులు కోల్పోరని జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ మేరకు జాతీయ వినియోగదారుల కమిషన్ గతంలో ఇచ్చిన 2016 నాటి పాత ఉత్తర్వులను సుప్రీం కోర్టు పూర్తిగా రద్దు చేసింది.

ఢిల్లీకి చెందిన ఒక కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీలో 2003వ సంవత్సరంలో సభ్యుడిగా చేరి.. ఫ్లాట్ కొనుగోలు చేసిన ఒక వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌పై సుప్రీం కోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం.. గతంలో నేషనల్ కన్స్యూమర్ డిస్‌ప్యూట్స్ రీడ్రెసల్ కమిషన్ (ఎన్‌సీడీఆర్సీ) 2016లో ఇచ్చిన వివాదాస్పద ఉత్తర్వులను పూర్తిగా పక్కనబెట్టింది. నాడు జాతీయ కమిషన్ వినియోగదారుడికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు చెల్లదని సుప్రీం కోర్టు పేర్కొంది. బిల్డర్ నుంచి ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయకుండానే ఫ్లాట్ స్వాధీనం చేసుకున్నందున.. ఫిర్యాదు చేసే సమయానికి సదరు వ్యక్తి వినియోగదారుడు కాదంటూ ఎన్‌సీడీఆర్సీ అప్పట్లో చేసిన వాదనను సుప్రీం కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఫ్లాట్ డెలివరీ తీసుకోవడం కంటే ముందే కన్స్యూమర్ ఫోరంలో కేసు వేయాలనే నియమమేదీ లేదని కోర్టు వివరించింది. ముందే ఇంటిని స్వాధీనం చేసుకున్నారనే సాంకేతిక కారణంతో పిటిషనర్‌ను వినియోగదారుల జాబితా నుంచి మినహాయించకూడదని జాతీయ కమిషన్‌కు గట్టిగా సూచించింది. ఇల్లు కొనేటప్పుడు ఇరుపక్షాల మధ్య కుదిరిన ఒప్పంద పత్రాలలో.. ఒకవేళ మధ్యవర్తిత్వ నిబంధన ఉన్నప్పటికీ.. కొనుగోలు దారుల హక్కులకు ఎలాంటి భంగం కలగదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఒప్పందంలో సదరు నిబంధన ఉన్నంత మాత్రాన వినియోగదారుల ఫోరంలో అప్పీలు దారు దాఖలు చేసిన ఫిర్యాదును తిరస్కరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. వినియోగదారులకు కొనుగోలు చేసిన ఇండ్లల్లో లేదా రియల్ ఎస్టేట్ బిల్డర్లు అందించే సేవల్లో లోపాలుఎదురైతే.. వాటిపై ఫిర్యాదు చేయడానికి 'వినియోగదారుల రక్షణ చట్టం1986'ను సంపూర్ణంగా ఉపయోగించుకోవాలని సుప్రీం కోర్టు ఈ సందర్భంగా పిలుపునిచ్చింది.

బాధితులకు అత్యంత వేగవంతమైన, పారదర్శకమైన న్యాయ పరిష్కారాన్ని అందించడమే ప్రాథమిక లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు ధర్మాసనం గుర్తు చేసింది.







## ఆ రెండు రాష్ట్రాలకు ఉగ్రముప్పు..

- కీలక ప్రదేశాలే లక్ష్యంగా దాడులకు వ్యూహం

**న్యూఢిల్లీ, జూన్ 27 (ఎ.ఎం.ఎస్):** ఖలిస్తానీ ఉగ్రవాదులు దేశంలో దాడులు చేయనున్నట్లు నిఘా వ్యవస్థలు కీలక హెచ్చరికలు చేశాయి.

ఢిల్లీ , ఉత్తరాఖండ్‌లోని కీలక ప్రదేశాలే లక్ష్యంగా ఈ దాడులు జరగనున్నట్లు సమాచారం అందిందని నిఘా వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, పోలీసు కేంద్రాలు కూడా లక్ష్యాలుగా మారవచ్చని పేర్కొన్నారు. అనేక ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ నాయకులను లక్ష్యాలుగా ప్రస్తావిస్తూ వచ్చిన ఒక ఈమెయిల్ ద్వారా ఈ ముప్పు సమాచారం అందిందని ఆ వర్గాలు వెల్లడించాయి.

ఈ హెచ్చరిక నేపథ్యంలో, ఢిల్లీ , ఉత్తరాఖండ్ పోలీసులు, నిఘా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.




- భారత్‌పై గోబెల్స్ ప్రచారం
- ఇండియా ప్రతిపాదనపై ఇంకా స్పందించని వైనం

**ఇస్లామాబాద్, జూన్ 27:** గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. బగ్లీహార్, సలాల్ డ్యామ్‌లను మూసివేసి, నదీ ప్రవాహ డేటాను కూడా పంచుకోవడం భారత్ నిలిపివేసింది. దీంతో దాయాది సాగు, తాగు నీటికి కటకటలాడుతోంది. ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై కవ్వింపులకు పాల్పడ్డారు. తమ జల భద్రతకు ముప్పు ఏర్పడితే యుద్ధానికైనా వెనుకాడబోమని బెదిరింపులకు దిగారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత విమానాలకు తన గగనతలాన్ని పాక్ నిషేధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సింధు జలాల కోసం పాకిస్థాన్ కొత్త పన్నాగానికి తెరతీసింది.

తమ విమానాల కోసం పాకిస్థాన్ గగనతలాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా తెరిస్తే.. సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరిస్తామని, నదులలను సహజంగా ప్రవహింపజేయడానికి సిద్ధంగా ఉన్నామని భారత్ చెప్పినట్టు గోబెల్స్ ప్రచారం మొదలుపెట్టింది. పాక్ సామాజిక మాధ్యమాల్లో ఈ వార్త విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. సింధు జలాల విషయంలో భారత్ ప్రతిపాదనపై పాకిస్థాన్ ఇంకా స్పందించలేదని ఎక్స్ (ట్విట్టర్)లో ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. "న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌ల మధ్య ఒక ఆశాకిరణం... ఈ ప్రాంతానికి గోడలు కాదు, వంతెనలు కావాలి.. భారత విమానాల కోసం పాకిస్థాన్ తన గగనతలాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా తెరిస్తే, దానికి ప్రతిగా 'సింధు జలాల ఒప్పందాన్ని' పునరుద్ధరించి, నదులను సహజంగా ప్రవహింపజేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని భారత్ పాకిస్థాన్‌కు తెలియజేసింది.. దీనిపై పాకిస్థాన్ ఇంకా స్పందించలేదు.. కానీ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకురావడం ఒక సానుకూల సంకేతం. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొంటుందని నేను ఆశిస్తున్నాను. ఈ ప్రాంతానికి గోడలు కాదు, వంతెనలు కావాలి. ఇదే సరైన మార్గం'' అని పాకిస్థాన్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఎక్స్‌లో చేసిన ట్వీట్‌లో పేర్కొన్నారు.

అయితే, ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదు. భారత విమానాల కోసం పాకిస్థాన్ తన గగనతలాన్ని తెరిస్తే, సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణకు భారతదేశం అంగీకరిస్తుందని ఇదంతా పాకిస్థాన్ గూఢచారి సంస్థలు అల్లుతోన్న కట్టకథలు. ఇటువంటి ప్రతిపాదనలు ఏదీ భారత్ వైపు నుంచి వెళ్లలేదని సీనియర్ జర్నలిస్ట్ తెలిపారు. "భారత విమానాల కోసం పాకిస్థాన్ తన గగనతలాన్ని తెరిస్తే సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించి, నదుల్లో ప్రవాహాలను అనుమతించడానికి భారతదేశం అంగీకరిస్తుందని పాకిస్థానీ గూఢచారి సంస్థ ఇప్పుడు కథనాలను ప్రచారం చేస్తోంది. ఇది పూర్తిగా శుద్ధ అబద్ధం. ఆర్టికల్ 370 లాగే సింధు జలాల ఒప్పందం కూడా చెత్తబుట్టలోనే ఉండిపోతుంది. పాకిస్థాన్ తన ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోంది'' అని ఆయన కౌంటర్ ఇచ్చారు.

**గతేడాది పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. బగ్లీహార్, సలాల్ డ్యామ్‌లను మూసివేసి, నదీ ప్రవాహ డేటాను కూడా పంచుకోవడం భారత్ నిలిపివేసింది. దీంతో దాయాది సాగు, తాగు నీటికి కటకటలాడుతోంది. ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై కవ్వింపులకు పాల్పడ్డారు.**



## సీషెల్స్ నేషనల్ డేకు ప్రధాని మోడీ..

**29 వరకు అక్కడే మకాం**

**న్యూఢిల్లీ, జూన్ 27 ,(ఎ.ఎం.ఎస్):** ప్రధానమంత్రి మోడీ మూడు రోజుల పర్యటనకు గాను సీషెల్స్ దేశానికి బయల్దేరారు. సీషెల్స్ నేషనల్ డే 'గోల్డెన్ జూబ్లీ' వేడుకలకు మోదీ 'గెస్ట్ ఆఫ్ ఆనర్' గా హాజరవుతున్నారు. సీషెల్స్ కు బయల్దేరే ముందు ఎక్స్ వేదికగా మోడీ స్పందిస్తూ... "నా మిత్రుడు, సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ఆహ్వానం మేరకు నేను జూన్ 27 నుంచి 29 వరకు సీషెల్స్‌లో పర్యటిస్తున్నాను" అని తెలిపారు. "సీషెల్స్ అనేది కేవలం ఒక ద్వీప దేశం మాత్రమే కాదు. భారత రక్షణ రంగానికి అదొక కీలక సముద్ర దేశం.

హిందూ మహాసముద్రంలో భద్రత, శాంతిని పెంపొందించడానికి భారత్ తెచ్చిన 'విజన్ మహాసాగర్' వ్యూహంలో సీషెల్స్ ఒక ప్రధాన భాగస్వామి" అని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు హెర్మినీతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

## సదరన్ కమాండ్‌కు కొత్త బాస్..

- జనరల్ రాజేశ్ పుష్కర్‌కు బాధ్యతలు
- జులై ఒకటిన బాధ్యతల స్వీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 27 (ఎ.ఎం.ఎస్):** భారత సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్‌కు కొత్త బాస్ వచ్చారు. లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ ను సదరన్ కమాండ్ కొత్త జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా భారత సైన్యం నియమించింది. పుణే కేంద్రంగా పనిచేసే సదరన్ కమాండ్ బాధ్యతలను లెఫ్టినెంట్ జనరల్ రాజేష్‌పుష్కర్ జూలై 1వ తేదీ స్వీకరించనున్నారు. ఆయన ప్రస్తుతం అంబాలా కేంద్రంగా ఉన్న ఖర్గా కార్ప్స్ IIకు కమాండర్‌గా సేవలు అందిస్తున్నారు. భారత సైన్యంలో అత్యంత శక్తివంతమైన స్ట్రైక్ కార్ప్స్‌లో ఒకటైన సదరన్ కమాండ్.. పశ్చిమ సరిహద్దులో ఆర్మీ సామర్థ్యానికి కీలక బలంగా నిలుస్తోంది. స్ట్రైక్ కార్ప్స్‌కు నాయకత్వం వహించిన ఆయన ఇప్పుడు ఆర్మీ కమాండ్‌కు అధిపతిగా పదోన్నతి పొందడం ఆయనకు కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ఇక కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు బావమరిది కావడం గమనార్హం. దీనిపై స్పందించిన శశిథరూర్ సంతోషం వ్యక్తం చేశారు.

పుణే ప్రధాన కేంద్రంగా పనిచేసే సదరన్ కమాండ్.. భారత సైన్యంలో అత్యంత పురాతన, అతిపెద్ద కమాండ్‌లలో ఒకటి. పశ్చిమ, మధ్య, దక్షిణ భారత దేశంతో పాటు ద్వీపకల్ప ప్రాంతాలు, తీరప్రాంతాల భద్రత, సైనిక సన్నద్ధతకు ఈ సదరన్ కమాండ్ బాధ్యత వహిస్తుంది. ఈ సదన్ కమాండ్ పరిధిలో జోధ్‌పూర్‌లోని కోణార్క్ కార్ప్స్.. భోపాల్‌లోని సుదర్శన్ చక్ర కార్ప్స్, పలు ట్రైనింగ్ సెంటర్లు, లాజిస్టిక్స్ యూనిట్లు, పరిపాలనా విభాగాలు ఉన్నాయి.

సాధారణ సైనిక భద్రతతో పాటు తీర ప్రాంత రక్షణ, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి కీలక బాధ్యతలను కూడా ఈ సదరన్ కమాండ్ నిర్వహిస్తుంది.



## ఇరాన్‌పై అమెరికా మళ్లీ దాడి..



**టెహ్రాన్, జూన్ 27:** ఇరాన్‌పై అమెరికా మిలిటరీ మళ్లీ దాడులు ప్రారంభించింది. తీర ప్రాంతాలతో పాటు ఇరాన్‌లోని కీలక డ్రోన్, క్షిపణి నిల్వ కేంద్రాలు, కోస్టల్ రాడార్ సైట్‌లపై భీకరమైన దాడులు జరిపి ధ్వంసం చేసిందని యూ.ఎస్.సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఇటీవల రెండు దేశాల మధ్యా అవగాహన ఒప్పందం కుదిరిన తర్వాత మళ్లీ ఈ స్థాయిలో దాడులు జరగడంతో ప్రపంచ దేశాల్లో ఆందోళన మొదలైంది. నిన్న సింగపూర్ షిప్‌పై ఇరాన్ దాడి చేయడాన్ని ట్రంప్ ఖండించిన కాసేపటికే ఈ అటాక్ జరగడం గమనార్హం.

## పాక్‌లో భూకంపం.. పరుగులు తీసిన జనం...



**ఇస్లామాబాద్, జూన్ 27:** పాకిస్థాన్‌లో శనివారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.4గా నమోదైనట్లు యూరోపియన్‌మెడిటేరియన్ సీస్మలాజికల్ సెంటర్ వెల్లడించింది. భూకంప కేంద్రం భూమికి 35 కిలో మీటర్ల లోతులో ఉన్నట్లు తెలిపింది. భూమి ఒక్కసారిగా కంపించడంతో పలుచోట్ల ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఈ ఘటనలో ఆస్తి, ప్రాణ నష్టంపై ఇంకా స్పష్టత రాలేదు.

# కొట్టుకున్న ఎంపీలు



**జార్జియా పార్లమెంటులో రగడ..**

**టిబిలిసి, జూన్ 27:** జార్జియా దేశ పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య భీకర ఘర్షణ జరిగింది. ప్రధాని ఇరాక్లీ కొబఖిడ్జే తన వార్షిక ప్రభుత్వ నివేదికను సభ ముందు ఉంచి ప్రసంగించిన అనంతరం, ప్రశ్నోత్తరాల సమయంలో అధికార 'జార్జియన్ డ్రీమ్', ప్రతిపక్ష 'ఫర్ జార్జియా' పార్టీలకు చెందిన నేతలు సహనం కోల్పోయి ఒకరి షర్ట్‌లు మరొకరు పట్టుకుని పిడిగుద్దులు కురిపించుకున్నారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా



**దమ్మపేట జూన్ 27 (వుదయం ప్రతినిధి ):**
అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ , పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు శనివారం దమ్మపేట(మండలం)లోని పలు కుటుంబాలను పరామర్శించారు దీనిలో భాగంగా పట్వారిగూడెంలో గ్రామంలో నంగేడ్ల రత్నాకర్ రావు స్టంట్ వేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని...చెలికాని రంగారావు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో వారిని.. శ్రీరాముల సుబ్బయ్య చారి సర్జరీ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని..దొడ్డాకుల కార్తీక్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని.. గుళ్ళ మరియదాసు కుమార్తెను.. ఇర్ప కాంతమ్మ చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా వారిని.చెన్నువారి గూడెంలో కుర్సాం చిన్న రాజులు ఇటీవలే సర్జరీ చేయించుకొని రాగా వారిని పరామర్శించారు. నాయకులతో కూర్చొని మాట్లాడుతూ సర్ కార్యక్రమంపై ఎప్పటికప్పుడు సమాచారం ఏజెంట్ల ద్వారా తెలుసుకోవాలని.నిజమైన ఓట్లు తొలగించకుండా చూసుకోవాలని.అప్రమత్తంగా ఉండాలని.త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు జరగనున్న నేపథ్యంలో సిద్ధంగా ఉండాలని.పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒకరు సమష్టిగా పని చెయ్యాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల,మొగిలి కృష్ణ,మాజీ ఉప సర్పంచ్ రెడ్డిమల్ల నాగయ్య,శ్రీరాముల చక్రధర్ రావు,నడ్డి సత్యనారాయణ,మండవ సత్య,పద్దం అశోక్,కొనకళ్ల సురేష్, కొలికిపోగు వరప్రసాద్, పుల్లా నాగరాజు,కొలికిపోగు రత్న రాజు,కొలికిపోగు ప్రకాశ్, పర్స రాంబాబు, కుంజ చిన్న బాబు,ఇర్ప వీరస్వామి,రవి,రాయల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై సమీక్ష

**ప్రత్యేక అధికారికి పూల మొక్క అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 27**
ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణపై జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ & ముఖ్య కార్యదర్శి (ఎఫ్ ఏ సి) శ్రీమతి బి. బాలా మాయా దేవి, ఐఏఎస్. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సంబంధిత శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షించారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని, 99రోజుల కార్యాచరణలోని ప్రతి అంశాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



**చిట్యాల జూన్ 27(వుదయం ప్రతినిధి)**
చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన గులాం జిలాని స్వర్గస్థులవ్వగ శనివారం మాజీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వారి ఇంటికి వెళ్ళి, వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు అదే క్రమంలో జూకల్ గ్రామానికి చెందిన.సౌడ కిషన్ మరణించగా వారి ఇంటికి వెళ్ళి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు తిమ్మాపూర్ గ్రామ వాస్తవ్యులు కంచు బీరన్న 2 ఏండ్ల కూతురు ప్రమాదపు శాత్తు సంపులోపడి చనిపోగా వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం గణపురం మండలం, పరుశురాంపల్లి గ్రామానికి చెందిన చింతిరెడ్డి పెద్ద సమ్మిరెడ్డి, మరియు ధర్మారావుపేట గ్రామ వాస్తవ్యులు.రాగాల కొమురమ్మ మరణించగా వారి ఇంటికి వెళ్ళి, వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గండ్ర వెంకటరమణారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

## నూతన ఏఈవోల బాధ్యతలు శ్రీకారం...

**రాయపర్తి జూన్ 27 (వుదయం ప్రతినిధి):**
మండల కేంద్రంలోని వ్యవసాయకార్యాలయంలో నూతనంగా నియమితులైన ఏఈవోలు రాయపర్తి క్లస్టర్ ఎస్ గీత, సన్నూరు క్లస్టర్ పి దీపిక , (AEOలు) శనివారం తమ పదవీ బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది వారికి అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలుతెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఏఈవోలు గీత, దీపిక మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వ విధానా





లను సమర్థవంతంగా అమలు చేయడంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని తెలిపారు.పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని నూతన అధికారులకు అభినందనలు తెలియజేశారు.

# గోదావరి వరదలకు ముందస్తు సన్నద్ధత..

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

**వరదల సన్నద్ధతలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉన్నాయి:**

**జిల్లా కలెక్టర్ అంకితం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 27 (వుదయం ప్రతినిధి)**
గోదావరి వరదల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు,వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి గోదావరి వరదల సన్నద్ధతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఈ ఏడాది నుంచి మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో ఎమర్జెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత గ్రామాల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, పునరావాస కేంద్రాలను గుర్తించి వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచామని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు క్విక్ రెస్పాన్స్ బృందాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, గోదావరి వరదల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి రెవెన్యూ, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయంగా సహాయక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వరదల అనంతరం అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, వైద్యశాఖ అధికారులు మందులు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు.భద్రాచలం పట్టణంలో గోదావరి నీరు చేరకుండా వర్షపు నీరు వేగంగా నదిలోకి వెళ్లేలా పంపింగ్ మోటార్లను సిద్ధంగా ఉంచాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించిన మంత్రి, తాగునీరు, వైద్య సేవలు వంటి అత్యవసర అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు శాస్త్రీయ సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. గిరిజన రైతులు ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. వనమహోత్సవంలో భాగంగా జాతీయ రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటాలని, గోదావరి పుష్కరాల నాటికి జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భద్రాచలం–కూనవరం రహదారిపై కొనసాగుతున్న కరకట్ట నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. మూడు సంవత్సరాలుగా పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే సారపాక జాతీయ రహదారిపై ఐటీసీ ఈస్ట్ గేట్ సమీపంలో వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న సమస్యను పరిష్కరించేందుకు రహదారి ఎత్తు పెంపుపై ప్రణాళికలు సిద్ధం చేయాలని జాతీయ రహదారుల శాఖ అధికారులకు సూచించారు.ప్రజాప్రతినిధులు సైతం గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వరదలకు ముందు, వరదల సమయంలో, అనంతరం చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర సన్నద్ధతతో ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, అటవీ, అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులు భూముల సర్వే పట్టాల జారీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




**భూపాలపల్లి జూన్ 27 (వుదయం విలేకరి)**
రైతులు భూముల సర్వే పట్టాల జారీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం బుద్ధారం గ్రామంతో పాటు భూపాలపల్లి రూరల్ మండలం కమలాపూర్ గ్రామంలో తెలంగాణ భూ సర్వే సరిహద్దుల నిర్ధారణ పై నిర్వహించిన గ్రామ సభలలో ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు భూముల సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తూ,అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది పట్టాదారులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించిందన్నారు.భూపాలపల్లి నియోజకవర్గంలో తదితర గ్రామాల్లో వేల ఎకరాల భూములకు సంబంధించి పట్టాల సమస్యలు ఉన్నాయని,వాటి పరిష్కారానికి సర్వే ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.భూమి యజమాని ప్రత్యక్షంగా హాజరు కాకపోయినా,సంబంధిత వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి మరియు జిల్లా కలెక్టర్‌తో పలు మార్లు చర్చించి ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు పట్టాలు లేక రైతు భరోసా, రైతు బీమా, భూముల రిజిస్ట్రేషన్ వంటి ప్రయోజనాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచిం చారు. సింగరేణి,సోలార్ ప్రాజెక్టు లు, పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యలను కూడా సర్వే ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొ న్నారు. సర్వే ప్రక్రియ ద్వారా ప్రభు త్వ భూములు, లావాణి భూము లు, సీలింగ్ భూములు తదితర భూముల వివరాలు స్పష్టంగా నమోదవుతాయని,చట్టబద్ధ హక్కులు కలిగిన వారికి పూర్తి అధికారం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులందరూ సర్వే కార్యక్రమంలో పాల్గొని తమ భూముల హక్కులను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల కూల్చివేతపై కన్నెర్ర చేసిన వామపక్షాలు!

**హనుమకొండలో వేలాది మందితో భారీ నిరసన ప్రదర్శన**

**ఎమ్మెల్యే కూనంనేని, జాన్ వెస్లీ సహా పలువురు నేతల అరెస్ట్..**

**తీవ్ర ఉద్రిక్తత**



**హనుమకొండ, జూన్ 27 (వుదయం జిల్లా ప్రతినిధి):**
హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో పేదల గుడిసెలను ప్రభుత్వం కూల్చివేయడాన్ని నిరసిస్తూ శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రంలో వేలాది మందితో భారీ ఆందోళన నిర్వహించారు. స్థానిక ఏకశిలా పార్క్ నుండి కాళోజీ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ఈ నిరసన ప్రదర్శన సాగింది. సుబేదారి అమరవీరుల స్థూపం జంక్షన్ వద్ద వేలాదిగా తరలివచ్చిన పేదలు, వామపక్ష కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీలను బలవంతంగా అరెస్టు చేయడంతో అక్కడ తీవ్ర తోపులాట, ఉద్రిక్తత చోటుచేసుకున్నాయి.విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో పోరాటం: కూనంనేనిఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. వరంగల్ వేదికగా ప్రారంభమైన ఈ ఇళ్ల స్థలాల సాధన పోరాటం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని హెచ్చరించారు. గుండ్ల సింగారం, గోపాల్‌పూర్‌లో పేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గమన్న ఆయన, విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడతామన్నారు. జూలై 1న ఉమ్మడి జిల్లాల కలెక్టరేట్ల ముందు పికెటింగ్, జూలై 6న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ప్రభుత్వ వైఖరి మారకుంటే పతనం తప్పదు: జాన్ వెస్లీసిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. ఖమ్మం, వరంగల్ తరహాలోనే పేదలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే ఈ ప్రభుత్వానికి పేదలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్నికల హామీల ప్రకారం గుడిసెలు కూల్చిన చోటే 50 గజాల స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.ఈ మహాధర్నాలో ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాల వామపక్ష ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# 15 రోజుల్లో పరకాలను 'క్లీన్ సిటీ'గా తీర్చిదిద్దుతాం! – ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**2027 డిసెంబర్ నాటికి అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణమే లక్ష్యం**

**మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి దిశానిర్దేశం**




**పరకాల, జూన్ 27 (వుదయం ప్రతినిధి) :**
ప్రత్యేక కార్యాచరణతో రాబోయే 15 నుండి 20 రోజుల్లో పరకాల పట్టణాన్ని 'క్లీన్ సిటీ'గా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రకటించారు. శనివారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి నిర్వహించిన పురపాలక సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.మౌలిక వసతుల కల్పన: 2027 డిసెంబర్ నాటికి పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం. స్లమ్ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ జీ ప్లస్–2 విధానంలో ఇళ్ల నిర్మాణానికి చర్యలు. పారిశుద్ధ్య పనుల కోసం రూ.4.68 లక్షల వ్యయానికి, అలాగే మూడు స్వచ్ఛ ఆటోల కొనుగోలుకు సభ్యుల ఆమోదం. సిబ్బంది హాజరు పర్యవేక్షణ కోసం తక్షణమే రెండు కొత్త బయోమెట్రిక్ యంత్రాలను కొనుగోలు చేయాలని, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని ఆదేశం. పాలనా సంస్కరణలతో మున్సిపల్ కార్యాలయంపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, కేంద్ర నిధులు అధికంగా పొందేందుకు వీలుగా మున్సిపల్ పన్నుల వసూళ్లను 90 శాతానికి పెంచాలని సూచన.కలెక్టర్ ఆదేశాలతో ప్రతి వార్డులో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. ఎస్సీ కాలనీల్లో ఇంటి నంబర్లు లేని గృహాల సమస్యను రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పరిశీలించాలన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, తహసీల్దార్ విజయ లక్ష్మి , ఏసీపీ సతీష్ బాబు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్

**27-06-2026 | నల్గొండ**
అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నల్గొండలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మరియు జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ వరకు 2 కిలోమీటర్ల అవగాహన రన్ (2K Run) నిర్వహించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సంయుక్తంగా జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, యువత, పోలీసు అధికారులు, ప్రజలతో కలిసి రన్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తు, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజ శాంతిభద్రతలకు కూడా ముప్పుగా మారుతుందని అన్నారు. అనుమానాస్పదంగా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. డ్రగ్ నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ, మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖలు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు "డ్రగ్ ఫ్రీ నల్గొండ – డ్రగ్ ఫ్రీ తెలంగాణ" లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల, నాగిరెడ్డి నవీన్, సునీల్, సీఐ నాగరాజు, ఎస్ఐలు సైదా బాబు, శివ ప్రసాద్, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేజీబీవీ సందర్శించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**నాణ్యమైన విద్యే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది!**

**గణితంపై పట్టు సాధిస్తే పోటీ పరీక్షల్లో విజయం సులభం**

**ఉచిత కోచింగ్ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**

**ప్రతి 15 రోజులకు ఒకసారి స్లిప్ టెస్ట్, మాక్ టెస్ట్ తప్పనిసరి**



**జనగామ, జూన్ 27 (వుదయం ప్రతినిధి) :**
విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది నాణ్యమైన విద్యేనని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం బచ్చన్నపేట మండలంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించిన ఆయన, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 'అన్ అకాడమీ' ఉచిత తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాల, భోజన నాణ్యత, పారిశుద్ధ్యం మరియు వసతి సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఉపాధ్యాయులు, అధికారులతో మాట్లాడిన కలెక్టర్ ముఖ్య సూచనలు చేశారు. పాఠ్య ప్రణాళిక అమలు: సబ్జెక్టుల వారీగా రూపొందించిన విద్యా ప్రణాళిక ప్రకారమే బోధన జరగాలని, నిర్లక్ష్యం వహించకుండా పాఠ్యాంశాలను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతర మూల్యాంకనం: విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి స్లిప్ టెస్ట్, మాక్ టెస్ట్‌లను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.భయాన్ని అధిగమించడం: 'ఫాస్ట్ మ్యాథ్స్' పుస్తకాన్ని ప్రతిరోజూ అభ్యసింపజేయడం ద్వారా గణితంపై భయాన్ని పోగొట్టాలని, గణితం, సైన్స్, సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇది భవిష్యత్తులో బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షలకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.నిత్య పర్యవేక్షణ: విద్యార్థుల చదువు, ఆహారం, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ జరిపి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు.పేద, మధ్య తరగతి కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, తద్వారా కుటుంబానికి, సమాజానికి గర్వకారణంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, కేజీబీవీ ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి జూన్ 27 (వుదయం జిల్లా ప్రతినిధి)**
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శనివారం రేగొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కావాలని కోరుకుంటున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకోగా, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, సాఫ్ట్‌వేర్, ఉపాధ్యాయులుగా ఎదగాలనుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు.ఈ సందర్భంగా వారి లక్ష్యాలను కలెక్టర్ అభినందించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి



10వ తరగతి విద్యార్థులతో బయాలజీ, 9వ తరగతి విద్యార్థులతో లెక్కలు చేపించి ప్రతిభను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.భవిష్యత్తులో ఏం చేరుకుని ప్రజలకు సేవ చేసే అవకాశం సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. చెంచుకాలని నుండి వచ్చే విద్యార్థులు సుదూరం కావడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయులు తెలుపగా అట్టి విద్యార్థులకు రవాణా సౌకర్యం లేదా సైకిల్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేష్, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ మోనిక తదితరులు పాల్గొన్నారు.



## ఇ.వి. శ్రీనివాస్ రావు కుటుంబ సభ్యుల ఓటరు ఇన్యూమరేషన్ పూర్తి

హనుమకొండ, జూన్ 27 (వుదయం ప్రతినిధి) :
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు కుటుంబ సభ్యుల వివరాల ఇన్యూమరేషన్ పూర్తి?హనుమకొండలోని ఎక్సైజ్ కాలనీలో శనివారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముమ్మరంగా సాగింది. ఇందులో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు కుటుంబ సభ్యుల వివరాలను ఓటరు జాబితాలో నమోదు చేసే ఇన్యూమరేషన్ ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు.?ఎన్నికల విభాగం నాయబ్ తహశీల్దార్ విఠల్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, బూత్ లెవల్ ఆఫీసర్ శ్రీదేవి, బూత్ లెవల్ ఏజెంట్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ఇ.వి. శ్రీనివాస్ రావు నివాసానికి చేరుకున్న అధికారులు, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి ఆన్‌లైన్ రికార్డులలో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ”ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలి. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి, తమ కుటుంబ సభ్యుల వివరాలను సక్రమంగా అందించడం ద్వారా ఓటు హక్కును పరిరక్షించుకోవాలి.” అని ఆయన విజ్ఞప్తి చేశారు.
?ఈ కార్యక్రమంలో స్థానిక బూత్ లెవల్ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరు నుంచి పది- పది నుంచి ఇంటర్మీడియట్ వరకు స్పాట్ అడ్మిషన్లు కలవు.

**మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో.**
**కళాశాల ప్రిన్సిపాల్ పెరక సునీత.**



ఖానాపురం, జూన్ 27 (వుదయం ప్రతినిది):మండలంలోని బుధరావుపేట గ్రామ శివారు మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపల్ పెరక సునీత తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2026--27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంతో పాటు ఆరు నుండి పదవ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలుపుతూ, ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలుపుతూ, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీ, మార్కుల మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కళాశాలకు హాజరై స్పాట్ అడ్మిషన్ పొందాలని తెలుపుతూ, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు కూడా స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బాలికలకు హాస్టల్ సౌకర్యంతో ఎంపీసీ నాలుగు సీట్లు, బిపిసి ఐదు సీట్లు, ఏసీఈ ఆరు సీట్లు, సిఇసి ఆర్ సీట్లు హాస్టల్ సౌకర్యంతో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ తెలిపారు.



## ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి

రాయపర్తి జూన్ 27(వుదయం ప్రతినిధి ) : ఓటర్ జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో రాయపర్తి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సర్పంచులు ముఖ్య నాయకుల సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు అనమండ్ల ఝాన్సీ రెడ్డి పాల్గొని ప్రజలను ఓటు హక్కు వినియోగంపై చైతన్యపరిచారు.ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని, పేర్లు, చిరునామాలు లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉంటే సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమెపిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఎనగందుల మురళి, యూత్ అధ్యక్షులు బొమ్మల కళ్యాణ్ గౌడ్, ఉల్లెంగల నరసయ్య, చెవ్వ కాశినాదం, కాంచనపల్లి వనజరాణి, సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్**

జయశంకర్ భూపాలపల్లి జూన్ 27(వుదయం జిల్లా ప్రతినిధి) భూపాలపల్లి జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుండి 2026-27 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఢిల్లీ ఆహ్వానిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి యం రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు అఞఅశీఱఖ్రీఖఝతీఎర్శేమఝఎష్ట్రవతీం.వఽబఝెఅశీఅ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా దరఖాస్తులను జులై- 10వ తేది లోగా రిజిస్ట్రేషన్ చేసుకోగలరని తెలిపారు ఈ అవకాశాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

## ఓటరు జాబితాల సవరణపై అపోహలు నమ్మొద్దు: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- బచ్చన్నపేట మండలంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పరిశీలన
- నింపిన ఫారాలను 3 రోజుల్లోగా అందజేయాలని సూచన



జనగామ/బచ్చన్నపేట, జూన్ 27 (వుదయం ప్రతినిధి) : ఓటరు జాబితాలను పూర్తి పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ాూ×=) లక్ష్యమని, ఓట్ల తొలగింపుపై వస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. శనివారం బచ్చన్నపేట మండలంలో జరుగుతున్న ఇంటింటి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. బీఎల్వోల పనితీరును పర్యవేక్షిస్తూ, స్థానిక యజమానులకు ఫారాలు ఎలా నింపాలో స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాన్ని జాగ్రత్తగా పరిశీలించి, సరైన వివరాలు నమోదు చేయాలి. బీఎల్వోల సహాయంతో ఫారం నింపడంలో ఎలాంటి సందేహాలున్నా వెంటనే బీఎల్వోలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. గడువు: నింపిన ఫారాలను రెండు మూడు రోజుల్లోగా తిరిగి బీఎల్వోలకు అందజేస్తే ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతమవుతుంది. అవగాహన కల్పించాలి. ఫారాల పంపిణీ సమయంలోనే ప్రజల్లో ఉన్న భయాలను, అపోహలను తొలగించాల్సిన బాధ్యత బీఎల్వోలదేనని కలెక్టర్ ఆదేశించారు.
ఓటర్లందరూ బాధ్యతాయుతంగా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్, సంబంధిత అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## పరకాల అభివృద్ధికి చర్యలు వేగవంతం చేయాలి

**19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్.**

పరకాల జూన్ 27 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ పావు శెట్టి సునీల్ కుమార్, కమిషనర్ పవన్ తదితరులు హాజరయ్యారు.
సమావేశంలో 19వ వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అంబేద్కర్ సెంటర్--భూపాలపల్లి రోడ్డులోని డివైడర్ యూటర్న్, బస్టాండ్ సెంటర్ సమీపంలోని హుజూరాబాద్ రోడ్డువైపు డివైడర్ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వాటిని వెంటనే సరిచేసి వాహనదారులు, ప్రజలకు భద్రత కల్పించాలని కోరారు.
అలాగే రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా అన్ని డివైడర్లలో మొక్కలు నాటడంతో పాటు అమరధామాన్ని ప్రత్యేక గార్డెన్‌గా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. అక్కడ అనవసర పంచాయతీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
పట్టణంలోని ఎస్సీ కాలనీలు సహా పలు కాలనీల్లో ఇంటి నంబర్ల సమస్య నెలకొని ఉందని, దరఖాస్తులు చేసుకున్న వారికి త్వరితగతిన ఇంటి నంబర్లు కేటాయించాలని కోరారు.
జనాభా పెరుగుదలకు అనుగుణంగా శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో పరిశుభ్రత పనులు ప్రభావితమవుతున్నాయని, అదనపు సిబ్బందిని నియమించి పారిశుధ్య సేవలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై ఎమ్మెల్యే, కలెక్టర్‌కు రాతపూర్వక వినతిపత్రం కూడా అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో పట్టణం అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టి వర్షాకాలంలో ముంపు సమస్యలను తగ్గించారని అన్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ స్కూల్, డిగ్రీ కళాశాల, 100 పడకల ఆసుపత్రి వంటి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తూ పరకాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని సభలో పేర్కొన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులు తల్లిదండ్రులకు మోయలేని భారం.

**ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణ కోల్పోయిన ప్రభుత్వం.**
**విద్యాసంస్థల ఫీజులను క్రమబద్ధీకరించాలని ఎంఈఓ కి వినతి.**
**నేడు విద్య సేవా రంగం కాకుండా వ్యాపారంగా మారిందని తల్లిదండ్రుల ఆవేదన.**



వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి జూన్ 27.నర్సంపేట పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజుల భారం తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కొర్ర సారయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు ఏటేటా తరగతుల వారీగా ఫీజులను పెంచుతున్నాయని వారు ఆరోపించారు. నర్సరీ విద్యార్థుల నుంచే రూ.30 వేల వరకు ట్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నారని, ప్రతి ఏడాది రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా పెంచుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారని, ఎల్‌కేజీ విద్యార్థులకే రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు బుక్స్ ఫీజు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలలు సూచించిన బుక్ స్టాళ్లలోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నాయని, బయట కొనుగోలు చేసిన విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ పాఠశాలల ఫీజులను ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని, పుస్తకాలు, స్టేషనరీని తల్లిదండ్రులు తమకు నచ్చిన దుకాణాల్లో కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓను కోరారు.

## గుడిసెల కూల్చివేతలు ఆపాలని వామపక్షాల భారీ నిరసన.



వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జూన్ 27.పేదల గుడిసెల కూల్చివేతలను వెంటనే నిలిపివేసి, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో వరంగల్‌లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ పేదల నివాసాలను కూల్చివేయడం మానుకుని, ఎన్నికల హామీల మేరకు ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏకశిలా పార్కు నుంచి అదాలత్ సెంటర్ వరకు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాల సవరణపై ప్రజలకు అవగాహన

- ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ.
- తాహసిల్దార్ నంగునూరి రమేష్.



ఖానాపురం, జూన్ 27 (వుదయం ప్రతినిధి) : ఓటరు జాబితాల సవరణపై ప్రజలకు తహసిల్దార్ నంగునూరి రమేష్ అవగాహన కల్పించారు. మండలంలోని అయోధ్యనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామ సర్పంచ్ కూన విమలలింగమూర్తి అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేసి ముఖ్య అతిథిగా తహసిల్దార్ పాల్గొని మాట్లాడుతూ ఓటర్ జాబితాల సవరణలను పారదర్శకంగా ఖచ్చితంగా రూపొందించడమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ాూ×=) లక్ష్యమని తహసిల్దార్ ప్రజలకు తెలుపుతూ, గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు ఎన్యూమరేషన్ ఫారాలను తహసిల్దార్ పంపిణీ చేశారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని జరుగుతున్న ఇంటింటి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల బిఎల్వోలు పంపిణీ చేస్తున్నట్లు తెలుపుతూ, ఫారం నింపడంలో ఎలాంటి సందేహాలున్నా వెంటనే బీఎల్వోలను సంప్రదించలని తెలుపుతూ, నింపిన ఫారాలను రెండు మూడు రోజుల్లోగా తిరిగి బీఎల్వోలకు అందజేయాలని తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గాయత్రి, కార్యదర్శి మాలతి, జిపిఓ హైమ, ఉపసర్పంచ్ మల్లేశం, వార్డు సభ్యులు సునీత, భద్రి, రజిత, సిఏ మంజుల, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## గుగులోత్ తండాలో ‘ఇందిరమ్మ ఇళ్ల’ గృహప్రవేశాలు!

**జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు**



పర్వతగిరి , జూన్ 27 ( వుదయం ప్రతినిధి ) :పర్వతగిరి మండలం లో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు,మండల కాంగ్రెస్ అధ్య క్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ గుగులోత్ తండా గ్రామశీలో సర్పంచ్ గుగులోత్ గమ్మి - విరన్న కలిసి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో లబ్ధిదరులను పట్టు వస్త్రాలతో సత్కారించి శుభకాంక్షలు తెలిపినారు.ఈ సందర్భంగా జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల సొంతింటి కలను ఎలాంటి అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా నెరవేరుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. గతంలో జరిగినట్టు కాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులైన పేదలకు నేరుగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నట్లు తెలిపారు.పూరి గుడిసెల్లో జీవిస్తున్న గిరిజన, ఆదివాసీ కుటుంబాలకు మొదటి ప్రాధాన్యతనిచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చినట్లు వెల్లడించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతు రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల అవసరాలను బట్టి మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు, ఇళ్లతో పాటుగా పేదలకు అండగా ఉండేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లెడలో ‘ఎస్ఐఆర్’ నమోదు ప్రక్రియ ముమ్మరం!

**గ్రామ సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ కలిసి పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస నాయక్.**



పర్వతగిరి , జూన్ 27 ( వుదయం ప్రతినిధి ) :పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో స్టానికా సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ తో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఓటర్లకు అవసరమైన అవగాహన ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్ఏ లను భాగస్వామ్యం చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా చుడలాని గ్రామ అధ్యక్షులకు సూచించారు. క్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని,ప్రతి ఒక్క ఓటు తొలగించకుండా కాపాడుకునే భాధ్యత టిసుకోవలాని పార్టీ బిఎల్ఎలను,సర్పంచ్లను,గ్రామ పార్టీ అధ్యక్షులను సినియర్ నాయకులను, మండల, జిల్లా నాయకులను,యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ,అనుబంధ సంఘల అధ్యక్షులను, మాజీ ప్రజాప్రతినిధులను, క్రియాశీల కార్యకర్తలను కోరినారు.!

## మా పొట్టమీద కొట్టకండి సారూ

**క్వారీలతో ఉపాధి పొందుతున్నాము**



మహాదేవపూర్ జూన్ 27(వుదయం ప్రతినిధి )క్వారీలతో ఉపాధి పొందుతున్నాము మా పొట్టమీద కొట్టకండి సారూ అంటూ మహాదేవపూర్ మండలం పలుగుల గ్రామ ప్రజలు శనివారం మండల పంచాయితీ అధికారిని ప్రకాష్ రెడ్డి కు వేడుకుంటూ ఆవేదనతో వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలుగుల గ్రామ వార్డు సభ్యులు ఇసుక క్వారీలను నిలిపివేయాలని కోరుతూ ఇటీవల జిల్లా పంచాయితీ అధికారికి ఫిర్యాదు చేశారని తెలిపారు.జిల్లా పంచాయితీ అధికారి ఆదేశాల మేరకు విచారణ చేయడానికి గ్రామానికి వచ్చిన మండల పంచాయితీ అధికారి వేడుకుంటూ గ్రామంలో ఇసుక క్వారీల ద్వారా ఉపాధి పొందుతున్నారని,వ్యవసాయాధారిత గ్రామం కావడంతో వర్షాలు లేక పంటలు పండడం లేదని దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మాకు ఇసుక క్వారీల ద్వారా ప్రతీ కుటుంబానికి జీవనోపాధి లభిస్తుందని తెలిపారు.ఇసుక క్వారీల నుండి వచ్చే లారీలు ప్రభుత్వ రహదారి పై నుండి నడుస్తున్నాయని గతంలో ఈ రహదారిపై నుండి చెన్నూరు వెళ్ళేవారని ఇసుక లారీలను యధావిధిగా కొనసాగించి తమ గ్రామస్తులకు జీవనోపాధిని కల్పించి ఆదుకోవాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. మరోవైపు గ్రామ సర్పంచ్ గారే విజయలక్ష్మి శంకర్, ఉపసర్పంచ్ ఒద్ది చంద్రయ్య లు ఐదుగురు వార్డ్ మెంబర్లు జిల్లా అధికారికి చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని ఇసుక క్వారీలో నుండి అక్రమంగా ఇసుక అధిక లోడు తీసుకువెళ్తున్నారనేది అవవాస్తమని టిఎస్ఎండిసి పరిధిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ రహదారిపై నుండి ఇసుక లారీల రవాణా జరుగుతుందని అధికారికి వినతి పత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గారే విజయలక్ష్మి శంకర్, ఉపసర్పంచ్ చంద్రయ్య,గ్రామపంచాయతీ కార్యదర్శి సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు మానేం మహేష్, గ్రామస్తులు మచ్చ చంద్రయ్య, మచ్చ వెంకటేష్, వడ్లకొండ సమ్మయ్య, రాళ్ల బండి వెంకటేష్, మానెం లింగయ్య, మంద రవి,మంద రాజయ్య,మంద సురేష్, మంద పోచయ్య, మంద శ్రీనివాస్, నిట్టూరి బాపు, మానెం శంకరయ్య, పసుల పోశయ్య, గోనె రాజయ్య, రాగం రాజయ్య, పసుల మల్లయ్య, మానెం మల్లయ్య, లేతకారి రాజు, తొర్రెం హనుమంతు, కొట్టి చిన్న రాజయ్య, నగునూరి కృష్ణయ్య, తోపాటు గ్రామస్తులు ఉన్నారు,

# అరిగేదాకా అవే వాడుతున్నారా?

గిన్నెలు తోమడానికి, సింక్‌ని శుభ్రం చేయడానికి స్పాంజిలు, స్క్రబ్బర్లు, బ్రష్‌లు వాడడం సహజమే! అయితే వీటి వాడకంలో తీసుకున్న శ్రద్ధ.. తిరిగి వీటిని శుభ్రం చేయడంలో తీసుకోరు చాలామంది. అవసరమున్నప్పుడు వాడడం ఆపై పక్కన పడేయడం.. వంటివి చేస్తుంటారు. ఈ నిర్లక్ష్యమే వివిధ అనారోగ్యాలకు కారణమవుతుందంటున్నారు నిపుణులు. అందుకే కిచెన్ స్పాంజిలు, స్క్రబ్బర్లు, బ్రష్‌ల శుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు. అదెలాగో తెలుసుకుందాం రండి..





వంట గదిలో ఏది శుభ్రం చేయాలన్నా స్పాంజిలు, స్క్రబ్బర్లు, బ్రష్‌లే వాడుతుంటాం. అయితే ఈ క్రమంలో ఇవి టాయిలెట్ సీట్ కంటే ఎక్కువ మురికిగా మారతాయని, రెట్టింపు బ్యాక్టీరియా వీటి పైకి చేరుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. పాత్రలు తోమేందుకు పదే పదే ఇవే వాడడం వల్ల వాటి ద్వారా ఈ క్రిములు మన శరీరంలోకి చేరి వివిధ రకాల అనారోగ్యాలకు కారణమవుతాయి. అందుకే వీటిని వాడడమే కాదు.. శుభ్రం చేయడమూ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. గిన్నెలు తోమడం పూర్తయ్యాక.. పదార్థపు అవశేషాలు వీటిపై లేకుండా పూర్తిగా శుభ్రం చేయాలి. ఆపై పిండి ఎండలో ఆరబెట్టాలి. ఒక గిన్నెలో నీళ్లు పోసి అందులో శుభ్రం చేసిన స్పాంజి, స్క్రబ్బర్ వేసి ఈ పాత్రను అవెన్‌లో రెండు నిమిషాల పాటు అధిక ఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. తద్వారా దానిపై ఉండే బ్యాక్టీరియా పూర్తిగా నశిస్తుందని నిపుణులు చెబుతున్నారు. డిష్‌వాషర్ వాడే వారు ఈ స్పాంజిలు, స్క్రబ్బర్లు, బ్రష్‌లను పై ర్యాక్‌లో ఉంచి శుభ్రం చేయడం మంచిదంటున్నారు నిపుణులు. బ్రష్, స్పాంజిలు, స్క్రబ్బర్లను వైట్ వినెగర్‌లో లేదంటే బేకింగ్ సోడా కలిపిన నీటిలో పది నిమిషాల పాటు నానబెట్టాలి. ఆపై సాధారణ నీటితో కడిగేస్తే సరిపోతుంది. చాలామంది గిన్నెలు తోమే స్క్రబ్బర్లు, స్పాంజిలను డిష్‌వాషర్ లిక్విడ్‌లో వేసి రోజంతా అలాగే ఉంచేస్తారు. ఇలా తడిగా ఉన్న వాటి పైకి బ్యాక్టీరియా, క్రిములు త్వరగా చేరతాయి. అవి గిన్నెలు తోమినప్పుడు వాటి ద్వారా మన శరీరంలోకి చేరి వివిధ వ్యాధులకు కారణమవుతాయి. కాబట్టి వీటిని ఎప్పుడూ పొడిగా ఉండే ప్రదేశాల్లోనే ఉంచాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పని పూర్తయ్యాక కిచెన్ బాల్కనీలో పెట్టడం మంచిది. కిచెన్ క్లీనింగ్ కోసం సిలికాన్ తో తయారుచేసిన స్క్రబ్బర్లు, బ్రష్‌లు వాడడం మరీ మంచిదంటున్నారు నిపుణులు. ఎందు కంటే ఇవి చేతికి అనువుగా ఉండడంతో పాటు త్వరగా ఆరిపోతాయి కూడా! తద్వారా బ్యాక్టీరియా, క్రిములు వీటిపైకి చేరే అవకాశం ఉండదని చెబుతున్నారు. చాలామంది కిచెన్ స్పాంజిలు, స్క్రబ్బర్లు, బ్రష్‌లు పూర్తిగా అరిగిపోయేదాకా అలాగే వాడుతుంటారు. ఇది కూడా సరికాదంటున్నారు నిపుణులు. నిర్ణీత వ్యవధిలో వీటిని మార్చడం ఉత్తమం అంటున్నారు. ఈ క్రమంలో స్పాంజిలు, స్క్రబ్బర్లు రెండు వారాలకోసారి, బ్రష్‌లను రెండు నెలలకోసారి మార్చడం మేలంటున్నారు. ఇక మాంసాహారం వండిన గిన్నెల్ని తోమేందుకు వాడిన స్పాంజిలు, స్క్రబ్బర్లు, బ్రష్‌లను ఎప్పటికప్పుడు పడేయడమే మంచిదని చెబుతున్నారు. వీలైతే వీటి కోసం విడిగా స్క్రబ్బర్లు, బ్రష్‌లు, స్పాంజిల్ని పెట్టుకోవడం ఉత్తమం అంటున్నారు.

# వెయిట్‌లాస్‌కు మ్యాజిక్ ఫార్ములా?



అతిగా వ్యాయామం చేయకుండానే బరువును అదుపులో ఉంచుకునే అద్భుత ఫార్ములా '30-30-30'. ఉదయం నిద్ర లేచిన అరగంటలో ప్రోటీన్ తీసుకోవడం, ఆపై 30 నిమిషాల వ్యాయామంతో జీవక్రియను వేగవంతం చేసే ఈ సింపుల్ టెక్నిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. నేటి ఆధునిక జీవనశైలిలో అధిక బరువు అనేది చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య. బరువు తగ్గాలనే ఆత్రుతతో చాలా మంది క్రాష్ డైట్లు పాటించడం, అతిగా వ్యాయామాలు చేయడం లేదా సర్జరీల వైపు మొగ్గు చూపడం వంటివి చేస్తుంటారు. అయితే ఇటువంటి పద్ధతులు శరీరానికి మేలు చేయడం కంటే అనారోగ్య సమస్యలనే ఎక్కువగా తెచ్చిపెడతాయి. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ అని గుర్తించాలి. దీని కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఆరోగ్యకరమైన పద్ధతిలో పనిచేసే '30-30-30' రూల్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ పద్ధతి ప్రధానంగా మూడు అంశాల చుట్టూ తిరుగుతుంది. ఇది సరళంగా ఉన్నప్పటికీ జీవక్రియపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. ఈ నియమం ప్రకారం.. ఉదయం నిద్రలేచిన 30 నిమిషాల లోపు 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి. ఆ తర్వాత 30 నిమిషాల పాటు తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. చివరగా మనం తీసుకునే ఆహారంలో 30 శాతం క్యాలరీలు తగ్గించాలి. ఈ పద్ధతి కేవలం కొవ్వును కరిగించడమే కాకుండా రోజంతా ఆకలిని నియంత్రించడంలో అద్భుతంగా సాయపడుతుంది. శరీరాన్ని హింసించకుండానే క్రమపద్ధతిలో బరువు తగ్గడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఉదయం నిద్రలేచిన వెంటనే 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవడం వల్ల శరీర జీవక్రియ వేగవంతం అవుతుంది. పాలు, కోడిగుడ్లు, పప్పుధాన్యాలు, మొలకలు లేదా మాంసాహారం వంటి వాటిని అల్పాహారంలో భాగం చేసుకోవాలి. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కడుపు నిండుగా అనిపించి ఎక్కువ సమయం ఆకలి వేయదు. దీనివల్ల మధ్యలో అనవసరమైన స్నాక్స్ తినాలనే కోరిక తగ్గుతుంది. అల్పాహారం తీసుకున్న తర్వాత 30 నిమిషాల పాటు నడక, జాగింగ్ లేదా ఈత వంటి తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. దీనివల్ల శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు కరగడం మొదలవుతుంది. కండరాలు బలంగా తయారై శరీరం దృఢంగా మారుతుంది. బరువు తగ్గడంలో క్యాలరీల పాత్ర చాలా కీలకం. మనం ఖర్చు చేసే శక్తి కంటే ఎక్కువ క్యాలరీలు తీసుకోవడం వల్ల అవి శరీరంలో కొవ్వుగా మారిపోతాయి. అందుకే రోజువారీ క్యాలరీల ఆహారంలో 30 శాతం తగ్గించి తీసుకోవాలి. దీనివల్ల శరీరం తన అవసరాల కోసం పేరుకుపోయిన పాత కొవ్వును ఇంధనంగా వాడుకుంటుంది. ఈ రూల్ పాటించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇది డయాబెటిస్ ముప్పును కూడా తగ్గిస్తుంది. ఎటువంటి ఒత్తిడి లేకుండా స్థిరంగా బరువు తగ్గాలనుకునే వారికి ఈ విధానం ఒక సంజీవనిలా పనిచేస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం కలిస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఈ 30-30-30 రూల్ మనల్ని క్రమశిక్షణతో ఉంచడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది వేస్తుంది. కఠినమైన డైట్లు లేకపోయినా ఫలితం నెమ్మదిగా మొదలై దీర్ఘకాలంలో స్థిరంగా ఉంటుంది. బరువు తగ్గడమే లక్ష్యంగా పెట్టుకున్న వారు ఈ చిన్న మార్పును తమ దినచర్యలో భాగం చేసుకోవడం వల్ల అద్భుతమైన మార్పును చూడవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించి సరైన పద్ధతిలో అడుగులు వేయండి. మన శరీరాన్ని మనం గౌరవిస్తూ సంరక్షించుకోవడం కంటే మించిన సంతోషం మరొకటి ఉండదు.

# చక్కని ఆరోగ్యం

## రాత్రి భోజనంలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది?

నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. చాలా కుటుంబాల్లో చపాతీ, అన్నం లేకుండా భోజనం సంపూర్ణం కాదు. చపాతీ, అన్నం తినేంత వరకు అది భోజనంలా అనిపించదు. కొందరు చపాతీని ఆరోగ్యకరమైనదిగా భావిస్తే, మరికొందరు అన్నం తేలికైనదని, సులభంగా జీర్ణమవుతుందని అనుకుంటారు. ఈ రెండు ఆహారాలలో ఏది సులభంగా జీర్ణమవుతుంది? దేనికి ఎక్కువ సమయం పడుతుంది అనే ప్రశ్న చాలా మందిలో తలెత్తుతుంది.



ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి తక్కువ సమయం పడుతుంది. కానీ చపాతీ తినడం కూడా మంచిదే. నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి సాధారణంగా 1 నుండి 2 గంటల సమయం పడుతుంది. అన్నంలో అధిక మొత్తంలో పిండిపదార్థం ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అన్నం శరీరంలోకి ప్రవేశించినప్పుడు త్వరగా గ్లూకోజ్‌గా మారుతుంది. అందుకే అనారోగ్యంతో లేదా బలహీనంగా ఉన్నవారికి తరచుగా అన్నం తినమని సలహా ఇస్తారు. ఇది కడుపును తేలికగా ఉంచి, తక్షణ శక్తిని అందిస్తుంది. తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. జీర్ణక్రియకు తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్ మంచిది. మరింత ప్రయోజనకరమైనది. కాబట్టి రాత్రి పూట చపాతీ బదులు బ్రౌన్ రైస్ తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. చపాతీ పగటి వేళల్లో తీసుకుంటే మంచిది.

## తులసి, తేనె కలిపిన నీటిని తాగితే.. ఈ ఐదు లాభాలు సొంతం

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, మారుతున్న ఆహారపు అలవాట్ల మధ్య ఆరోగ్యంగా ఉండటం ఒక పెద్ద సవాలుగా మారింది. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఖరీదైన మందులు, సప్లిమెంట్ల కంటే మన పెరట్లో ఉండే తులసి, వంటింట్లోని తేనె అద్భుతంగా పనిచేస్తాయి. ఆయుర్వేదం ప్రకారం, తులసి తేనె కలయిక ఒక శక్తివంతమైన ఔషధం. ప్రతిరోజూ ఉదయం పరగడుపున ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి సహజమైన డిటాక్స్ లభించడమే కాకుండా, అనేక వ్యాధుల నుండి రక్షణ లభిస్తుంది. ఆధునిక పరిశోధనలు కూడా ఈ అద్భుత పానీయం ప్రయోజనాలను అంగీకరిస్తున్నాయి. తులసిలో యాంటీ బాక్టీరియల్



యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. మరోవైపు, తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా దొరుకుతాయి. ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం వల్ల శరీర రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుంది. ముఖ్యంగా వాతావరణం మారినప్పుడు వచ్చే జలుబు, ఫ్లూ ఇతర ఇన్ఫెక్షన్ల నుండి ఈ పానీయం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. శరీరంలోని తెల్ల రక్త కణాల సామర్థ్యాన్ని పెంచి, వ్యాధికారక క్రిములతో పోరాడే శక్తిని అందిస్తుంది. బరువు తగ్గడానికి నిర్విషీకరణకు సహకారం శరీరంలో పేరుకుపోయిన విషపదార్థాలు అనేక అనారోగ్యాలకు కారణమవుతాయి. తులసి, తేనె నీరు సహజమైన డిటాక్స్ పానీయంగా పనిచేసి రక్తంలోని వ్యర్థాలను తొలగిస్తుంది. ఇది శరీర మెటబాలిజం లేదా జీవక్రియను వేగవంతం చేస్తుంది, తద్వారా నిల్వ ఉన్న కొవ్వు కరగడానికి సహాయపడుతుంది. రు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటే, రోజును ఈ పానీయంతో ప్రారంభించడం వల్ల జీర్ణవ్యవస్థ శుభ్రపడి, ఆశించిన ఫలితాలు త్వరగా లభిస్తాయి. ఒత్తిడి తగ్గింపు.. తులసిని ఒక అద్భుతమైన 'అడాప్టోజెన్'గా పరిగణిస్తారు, ఇది మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడంలో శరీరానికి సహాయపడుతుంది. తేనెతో కలిపి దీనిని తీసుకున్నప్పుడు, ఇది శరీరంలోని కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయిలను తగ్గించి నరాలను ప్రశాంతపరుస్తుంది. దీనివల్ల రోజంతా ఉత్సాహంగా, ఏకాగ్రతతో ఉండవచ్చు. అలాగే, తులసి రక్తాన్ని శుద్ధి చేయడం వల్ల మొటిమలు తగ్గి, చర్మం లోపలి నుండి కాంతివంతంగా మారుతుంది. తేనె చర్మానికి అవసరమైన తేమను అందించి, ముఖానికి సహజమైన మెరుపును ఇస్తుంది.

## ఇలా అయితే అనారోగ్యం వచ్చినట్టే

వేసవి కాలం వచ్చిందంటే చాలు అందరికీ ముందుగా గుర్తొచ్చేది పండ్ల రాజు మామిడి పండు. ఆ రుచికి, సువాసనకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అయితే మామిడి పండ్లను ఆస్వాదించే క్రమంలో మనం చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చాలామంది మామిడి పండు తిన్న వెంటనే దాహంగా అనిపించి నీళ్లు తాగుతుంటారు. ఇది చూడటానికి సాధారణ విషయంగా అనిపించినప్పటికీ, శరీరంలోని జీర్ణవ్యవస్థను ఇది తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం రుచి కోసం పండును ఆస్వాదించడమే కాదు, దానిని ఎలా తినాలో కూడా తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మామిడి పండ్లలో చక్కెర శాతం, పీచు పదార్థం అంటే ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరంలో జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. మనం పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల పొట్టలోని జీర్ణరసాలు పలుచబడిపోతాయి. దీనివల్ల మామిడి పండులోని పోషకాలను శరీరం గ్రహించే వేగం మందగిస్తుంది. ఫలితంగా జీర్ణ ప్రక్రియ ఆలస్యమై ఆహారం పొట్టలో అలాగే ఉండిపోయి గ్యాస్ లేదా అసౌకర్యానికి దారితీస్తుంది. అందుకే మామిడి పండు తిన్న తర్వాత కనీసం అరగంట పాటు నీటిని ముట్టుకోకపోవడమే శ్రేయస్కరం. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రధాన ఇబ్బందుల్లో కడుపు నొప్పి ఇంకా విరేచనాలు ముఖ్యమైనవి. నీరు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును అడ్డుకోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాక పొట్టలో గందరగోళం మొదలవుతుంది. ఇది వికారం లేదా కడుపులో ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. మామిడి పండులోని ఫ్రక్టోజ్ (సహజ చక్కెర) నీటితో కలిసినప్పుడు బ్యాక్టీరియా చర్య వేగవంతమై ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే మామిడి పండు తిన్న తర్వాత కనీసం ముప్పై నుండి నలభై నిమిషాల వరకు వేచి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో జీర్ణక్రియ సక్రమంగా జరిగి పండులోని విటమిన్లు ఇంకా ఖనిజాలు రక్తంలో కలుస్తాయి. ఆ తర్వాత నీళ్లు తాగడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే మామిడి పండ్లను రాత్రి పూట కంటే ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల అవి మెరుగ్గా జీర్ణమవుతాయి. పండు తినే ముందు దానిని గంట పాటు నీటిలో నానబెట్టడం వల్ల అందులోని వేడి తగ్గి చర్మానికి ఎటువంటి అలర్జీలు రాకుండా ఉంటాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన పండును ఆస్వాదించేటప్పుడు ఈ చిన్న జాగ్రత్తలు పాటించడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆహారపు అలవాట్లలో క్రమశిక్షణే మనల్ని దీర్ఘకాలిక రోగాల నుండి కాపాడుతుంది.



## పదే పదే బీపీ పెరుగుతోందా.. ఇలా జరిగితే ప్రాణం ప్రమాదంలో ఉన్నట్లే!

ఈ మధ్య కాలంలో చాలా మంద అధిక రక్తపోటు భారిన పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఈ సమస్య తలెత్తుతుంది. అయితే అసలు బీపీ ఎంత ఉంటే నార్మల్, ఎంత దాటింది అంటే ప్రాణం రిస్క్‌లో ఉన్నట్లో ఇప్పుడు తెలుసుకోండి. అధిక రక్తపోటు కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఒత్తిడి, డిప్రెషన్, అతిగా ఆలోచించడం వలన కొంత మందిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అయితే ఒక వ్యక్తికి 120/80ఎఎ ఉంటే అది సాధారణం. కానీ దీనికి మించి ఉంటే అది అధిక రక్తపోటు సమస్యగా గుర్తించి, తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే కొన్ని సార్లు ఇది అకస్మాత్తుగా 200 దాటే ఛాన్స్ ఉంటుంది. అయితే ఇలా దాటింది అంటే అది తీవ్రమైన అనారోగ్య సమస్యగా గుర్తించాలి. ముఖ్యంగా ఇది శరీరంలో అనేక అవయవాలపై ప్రభావం చూపుతుంది. కొన్ని సార్లు అత్యవసర పరిస్థితిగా కూడా పరిగణించవచ్చు, ఇలానే కొనసాగితే ఇది మరణానికి కూడా దారితీస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అధిక రక్తపోటు అనేది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతుంది. కొన్ని సార్లు పక్షవాతానికి కూడా దారితీస్తుందంట. అంతే కాకుండా ఇలా పదే పదే బీపీ పెరిగి, మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి, పక్షవాతం వస్తుంది. అయితే కు బీపీ సమస్య ఉన్నప్పుడు కొన్ని సార్లు వాంతులు, కళ్లు తిరగడం, కళ్లు మసకబారడం, మైకం కమ్మడం వంటి సమస్య ఎదురు అయితే చాలా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే ఇది అధిక రక్తపోటుకు దారి తీసే ఛాన్స్ ఉన్నదంట. అంతే కాకుండా ఇది గుండెపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. కొన్ని సార్లు ఈ బీపీ సమస్య అధికం అయినప్పుడు, అధిక రక్తపోటు వలన గుండెకు రక్త సరఫరా సరిగ్గా జరగక గుండెపోటు కూడా వచ్చే ఛాన్స్ ఉంటుంది. వయసుతో సంబంధం లేకుండా హైబీపీ వలన ఇలాంటి సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే అధిక రక్తపోటు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.



## ఎండ తాకిడి నుంచి రక్షణగా..!

వేసవి సెలవులు వచ్చేస్తున్నాయి. ఎండలో ఆడొద్దు... గ్రౌండ్లకు వెళ్లొద్దు అంటే వింటారా గడుగ్గాయిలు. కొద్దిసేపట్లోనే వచ్చేస్తాం, నీడలోనే ఆడుకుంటాం అంటూ బయటికి పరుగులు తీస్తారు. మీ పిల్లలూ అంతేనా? వాళ్లకి వీటిని ఇచ్చి చూడండి. ఎండ బారిన పడకుండా కాపాడొచ్చు. మట్టితో ఆటలాడటం, ఏవి పడితే అవి పట్టుకోవడం, ఎక్కడ పడితే అక్కడ కూర్చోవడం చేస్తుంటారు పిల్లలు. దీంతో క్రిములు, సూక్ష్మజీవులు చేతులకు అంటుకుంటాయి. కొన్ని నీళ్లతో కడిగినా వదలవు. ఈ 'సడ్స్2గో క్యాప్' అమర్చిన బాటిల్‌ను వాళ్లకి ఇవ్వండి. ఈ క్యాప్‌లో రెండు భాగాలు ఉంటాయి. ఒకదానిలో లిక్విడ్ హ్యాండ్‌వాష్ వేయొచ్చు. మరోదాని నుంచి నీళ్లు వస్తాయి. ఆటలయ్యాక హ్యాండ్‌వాష్‌తో చేతులు శుభ్రం చేసుకోమంటే సరి. దీన్ని ఉపయోగించడం కూడా ఒక ఆటలా ఉంటుంది కాబట్టి, మీరు అందుబాటులో ఉన్నా, లేకున్నా పిల్లలు



పరిశుభ్రత మీద ఆసక్తి చూపిస్తారు. ఉరుకులు, పరుగులు, గెంతులు అబ్బా... పిల్లల అల్లరి మాటల్లో చెప్పగలమా! ఆడుతున్నంత సేపూ ఇల్లే గుర్తుకురాదు. దాహమో, ఆకలో వేస్తేనే ఇల్లు గుర్తొచ్చేది. దీనివల్ల డీహైడ్రేషన్‌కి గురవుతూ ఉంటారు. పోనీ బాటిళ్లు అయినా తీసుకెళతారా అంటే... 'వద్దు మమ్మీ అదో బరువు, మరచిపోతాం మళ్లీ తిడతావు' అంటూ పారిపోతారు. అలాంటప్పుడు ఈ 'రిస్ట్ వాటర్ బాటిల్'ను ఇచ్చి చూడండి. ఇది 200ఎం.ఎల్. వరకు నీటిని నిల్వ చేయగలదు. చేతికి వాచ్‌లా కట్టేసుకుంటే సరి. దాహం వేసినప్పుడు దీనికి అమర్చి ఉన్న స్ట్రా ద్వారా నీళ్లు తాగొచ్చు. దీన్ని ఫుడ్-గ్రేడ్ సిలికాన్ మెటీరియల్‌తో తయారుచేస్తున్నారు. కాబట్టి తేలికగా, మెత్తగా ఉంటుంది. ఎండకి ప్లాస్టిక్ కరిగి నీళ్లు రసాయనాలతో నిండిపోతాయన్న భయమూ



ఎండ తీవ్రతకు చాలాసార్లు సొమ్మసిల్లిపోతారు పిల్లలు. అలసటా నిస్సత్తువా ఆవరిస్తాయి. దాంతో దిగాలుగా ఇల్లు చేరుతుంటారు. అలా జరగకూడదంటే వాళ్లకి ఈ 'మిస్ట్ స్ప్రే వాటర్ బాటిల్' ఇవ్వండి. దీనిలో నీళ్లు నింపి, కొన్ని ఐస్ క్యూబ్స్ వేస్తే సరి. అవసరం అయినప్పుడు నీళ్లు తాగొచ్చు. ఎండ తీవ్రత ఎక్కువైనప్పుడు దీనికి ఉండే హ్యాండిల్‌ను నొక్కితే... నీళ్ల తుంపర్లు ముఖంపై పడి ఉపశమనం కలిగిస్తాయి.

## ఏటీఎఫ్ ధర తగ్గితే, సర్వీసులు పునరుద్ధరిస్తాం

ముడిచమురు ధరకు అనుగుణంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర బాగా పెరిగిన నేపథ్యంలో పలు విమానయాన సంస్థలు తమ సర్వీసుల సంఖ్యను తాత్కాలికంగా తగ్గించిన సంగతి విదితమే. పశ్చిమాసియా యుద్ధం ఆగి, చమురు ధర మళ్లీ పూర్వస్థితికి చేరుతున్న నేపథ్యంలో.. సర్వీసుల కోతపై పునరాలోచిస్తామని టాటా గ్రూప్ విమానయాన సంస్థ ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ శుక్రవారం తెలిపారు. ఏటీఎఫ్ ధరలు తగ్గడంతో పాటు, వివిధ దేశాలు ప్రకటించిన గగనతల ఆంక్షలు తొలగితేనే ఇది సాధ్యపడుతుందని వివరించారు. అంతర్జాతీయ సర్వీసుల్లో 27%, దేశీయ సర్వీసుల్లో 22 శాతంపై తాత్కాలికంగా కోత విధిస్తున్నట్లు గత నెలలో ఎయిరిండియా ప్రకటించిన సంగతి విదితమే.




# అంతర్జాతీయ దిగ్గజాల పెట్టుబడులు రూ.8.55 లక్షల కోట్లు



అంతర్జాతీయంగా అనిశ్చితులు నెలకొన్న నేపథ్యంలోనూ, ప్రపంచంలోని దిగ్గజ కార్పొరేట్ సంస్థలు, సంస్థాగత పెట్టుబడిదారులు తాజా పెట్టుబడులకు మనదేశాన్ని ఎంచుకున్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు – వ్యాపార అనిశ్చితుల్లోనూ భారత ఆర్థిక వ్యవస్థ అధిక వృద్ధిరేటును సాధిస్తుండటమే ఇందుకు కారణం. గత కొన్ని నెలల్లో అంతర్జాతీయ సంస్థలు మనదేశంలో పెడతామని ప్రతిపాదించిన పెట్టుబడుల విలువ 90 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.55 లక్షల కోట్లు) మించడం ఇందుకు నిదర్శనం. సరఫరా వ్యవస్థలను ఒకే దేశంలో కేంద్రీకరించడానికి బదులు భిన్న విపణులకు విస్తరించే ధోరణి కూడా ఉపకరించింది. ఈ రంగాల్లో: కృత్రిమమేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక వసతులు, తయారీ, పారిశ్రామిక సాంకేతిక రంగాల్లోకి భారీ పెట్టుబడి ప్రకటనలు వచ్చాయి.

గూగుల్: దేశంలో ఏఐ మౌలిక వసతుల విస్తృతికి 15 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.43 లక్షల కోట్లు) పెట్టుబడి పెడతామని అమెరికా సాంకేతిక దిగ్గజం గూగుల్ ఈ ఏడాది ఫిబ్రవరిలో వెల్లడించింది. డేటా కేంద్రాలు, సముద్రగర్భ కేబుల్, క్లౌడ్‌సామర్థ్యం, ఉద్యోగులకు నైపుణ్యాలు నేర్పేందుకు ఈ మొత్తాన్ని కేటాయించనుంది.

అమెజాన్: అమెరికా ఇకామర్స్ దిగ్గజమైన అమెజాన్ మనదేశంలో 2030 నాటికి మరో 13 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.23 లక్షల కోట్లు) పెట్టుబడి పెడతామని ప్రకటించింది. క్లౌడ్ వసతులు, ఏఐ, డిజిటల్ సేవలకు ఈ నిధులు వినియోగిస్తారు. ఆరు నెలల క్రితం ప్రకటించిన 35 బి.డా. (సుమారు రూ.3.33 లక్షల కోట్ల)కు ఇవి అదనం.

ఎయిర్‌ట్రంక్: ఆస్ట్రేలియా డేటా కేంద్రాల సంస్థ ఎయిర్‌ట్రంక్, 2030 కల్లా మనదేశంలో 5 గిగావాట్ల డేటాకేంద్రాలను 30 బి.డా. (సుమారు రూ.2.85 లక్షల కోట్ల)తో పెడతామని తెలిపింది. సెయింట్ గోబైన్: ఫ్రాన్స్‌కు చెందిన భవన నిర్మాణ పదార్థాల తయారీ సంస్థ సెయింట్ గోబైన్ మరో 1.15 బి.డా. (సుమారు రూ.11,000 కోట్లు) రాబోయే అయిదేళ్లలో పెడతామని ప్రకటించింది. సీపీపీఐబీ: హైపర్‌స్కేల్ డేటా కేంద్ర సామర్థ్య విస్తరణకు కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్లతో కలిసి రూ.7,000 కోట్లు పెట్టనుంది.

# భారత వృద్ధి 6.6- 6.8%



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026–27) భారత ఆర్థిక వ్యవస్థ 6.6– 6.8% వృద్ధి చెందే అవకాశం ఉందని ఈవై ఎకానమీ వాచ్ నివేదిక తెలిపింది. అంతర్జాతీయంగా ఇంధన విపణుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటుండటంతో.. సరఫరాపరమైన ఒత్తిళ్లు తగ్గుముఖం పట్టొచ్చని పేర్కొంది. వృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో పాటు ద్రవ్యోల్బణం దిగి వచ్చేందుకు తోడ్పడొచ్చని ఈవై నివేదిక వివరించింది. 'ఇటీవలి అంతర్జాతీయ పరిణామాలను పరిశీలిస్తే.. అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువ స్థాయిలకు చేరుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో రవాణా అంతరాయాలు తొలగడం భారత వృద్ధికి సానుకూలతను తెచ్చిపెట్టే అవకాశం ఉందనీ వెల్లడించింది. '2026–27లో భారత వాస్తవ జీడీపీ వృద్ధి 6.6–6.8 శాతంగా, రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.5 శాతంగా, భారత ప్రభుత్వ ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతంగా, కరెంటు ఖాతా లోటు జీడీపీలో 1.5 శాతంగా నమోదుకావచ్చని' నివేదిక అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ.. దేశీయ ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉండటం, ప్రైవేట్ రంగ పెట్టుబడుల అండతో భారత వృద్ధి పుంజుకుంటుందని పేర్కొంది.

# ఓపెన్ ఏఐ భారత్ ఎండీగా ప్రభ్‌జీత్ సింగ్




ఏఐ మార్కెట్ విస్తృతమవుతోన్న వేళ.. శామ్ ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ (OpenAI) తన కార్యకలాపాలను మరింత ముమ్మరం చేస్తోంది. భారత్‌లో ఆ సంస్థ పగ్గాలను ప్రభ్‌జీత్ సింగ్ (Prabhjeet Singh)కు అప్పగించాలని నిర్ణయించింది. సెప్టెంబర్‌లో భారత్ ఓపెన్ ఏఐ మెనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపడతారని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఓపెన్ ఏఐకు భారత్ ఓ కీలక మార్కెట్ అని ఇప్పటికే శామ్ ఆల్ట్‌మన్ విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ తమ ఉనికిని మరింత విస్తరించాలనే లక్ష్యంతో ప్రభ్‌జీత్ సింగ్‌ను ఎండీగా నియమించినట్లు తెలుస్తోంది. కంపెనీ కన్జ్యూమర్ గ్రోత్, ఎంటర్‌ప్రైజ్ అడాప్షన్, వ్యూహాత్మక భాగస్వామ్యాల రెగ్యులేటరీ వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. సింగ్ నేతృత్వంలో భారత్ వినియోగదారులకు, వ్యాపారులు, ప్రభుత్వ కార్యకలాపాలకు ఓపెన్ ఏఐ ద్వారా మరిన్ని ప్రయోజనాలు అందుతాయని కంపెనీ విశ్వసిస్తోంది. కాగా, ఓపెన్ ఏఐ తన కంపెనీ తొలి ఆఫీస్‌ను దిల్లీలో 2025లోనే ఏర్పాటుచేసింది. ప్రభ్‌జీత్ సింగ్ ఉబర్‌లో 11 ఏళ్లపాటు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహించారు. ఆయన రాజీనామాను ఉబర్ కూడా ప్రకటించింది. భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓపెన్ ఏఐ పేర్కొంది.

# భవిష్యనిధిలో 25% కనీస నిల్వ తప్పనిసరి




ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) త్వరలో కొత్త పథకాలను అమల్లోకి తీసుకురానుంది. ఇకపై వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలో 25% కనీస నిల్వను తప్పనిసరి చేయనుంది. ఉపసంహరణల పరిమితి సంఖ్యను పెంచనుంది. యూపీఐ ద్వారా నేరుగా పీఎఫ్ క్లెయిం చేసుకోవడంతోపాటు ఆటోమేషన్‌లో వేగంగా ఆమోదం లభిస్తే వెంటనే ఆ నగదు సత్వరమే బ్యాంకు ఖాతాలో జమయ్యేలా మార్పులు చేస్తోంది. ఈ మేరకు ఈపీఎఫ్‌వో కేంద్రీకృత ఐటీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తోంది. ఈపీఎఫ్‌వో పాస్‌బుక్, మెంబర్ పోర్టల్, యాజమాన్యాల పోర్టల్‌తోపాటు వెబ్‌సైట్‌ను ఈ నెల 30 వరకు మూసివేసి, క్లెయిం పరిష్కార వ్యవస్థను నిలిపివేసింది. ప్రస్తుతమున్న వెబ్‌సైట్‌ను ఆధునికీకరించడంతో పాటు క్లెయిం పరిష్కారానికి ఆటోమేషన్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేస్తోంది. కొత్త వెబ్‌సైట్, క్లెయిం వ్యవస్థ, నూతన పథకాలు, ఐటీ వ్యవస్థలను జులై 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఐటీ వ్యవస్థ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా.. ఉద్యోగులకు 2025–26 ఏడాదికి నిర్ణయించిన 8.25% వడ్డీని ఈ నెల 30లోగా ఖాతాల్లో జమ చేయనుంది. జులై 1న వడ్డీ జమతో కూడిన నగదు నిల్వల వివరాలు వెల్లడించనుంది. ఉద్యోగులు, కార్మికుల వ్యక్తిగత ఈపీఎఫ్ నిధిలో కనీసం 25% నిల్వ ఉంచి మిగిలిన మొత్తాన్ని మాత్రమే ఉపసంహరించుకునేలా ఇప్పటికే సీబీటీ ఆమోదం తెలిపింది. తరచూ ఉపసంహరణలతో కార్మికులకు పదవీ విరమణ సమయంలో చేతిలో నిధులు ఉండటం లేదని గుర్తించింది. చేతికి రూ.20 వేలు కూడా రాని కార్మికుల సంఖ్య ఎక్కువ ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో పదవీ విరమణ తర్వాత కార్మికులు గౌరవప్రదమైన జీవనం కొనసాగించేందుకు వీలుగా 25% కనీస నిల్వగా నిర్ణయించింది. అంటే.. ప్రతి ఉద్యోగి క్లెయిం దరఖాస్తు నాటికి ఉద్యోగి, యజమాని వాటాలు, ఆ మొత్తంపై వడ్డీ కలపగా వచ్చేది మొత్తం భవిష్యనిధి నిల్వ అవుతుంది. అందులో కనీస నిల్వ ఉంచి.. మిగతా మొత్తం నుంచి మాత్రమే ఉపసంహరణలకు అనుమతిస్తారు. ఇంతవరకు కనీస నిల్వ నిర్వహించాలనే నిబంధన లేదు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్)–2026, ఉద్యోగుల పింఛను పథకం(ఈపీఎస్)–2026 పథకాలను అమల్లోకి తీసుకురానుంది. ఈపీఎఫ్–1952, ఈపీఎస్–1995 పథకాల స్థానంలో ఇవి రానున్నాయి. ఇటీవల జరిగిన ఈపీఎఫ్‌వో కేంద్ర ట్రస్టీ బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. న్యాయశాఖ పరిశీలనలో ఈ పథకాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త ఐటీ వ్యవస్థతోపాటు ఈపీఎఫ్, ఈపీఎస్–2026 పథకాలను నోటిఫై చేసే అవకాశాలున్నట్లు కార్మిక వర్గాలు పేర్కొంటున్నాయి. కేటగిరీ–1: ఈపీఎఫ్ చందాదారుగా చేరిన 12 నెలల వ్యవధి తర్వాత అనారోగ్యం, విద్య, వివాహ అవసరాలకు ఉపసంహరణ చేయవచ్చు. అనారోగ్యం కేటగిరీలో ఏడాదికి మూడుసార్లు, విద్యకు మొత్తం సర్వీసులో పదిసార్లు, వివాహం కోసం ఐదుసార్లు క్లెయిం చేయవచ్చు. కేటగిరీ–2: ఇల్లు కొనుగోలు, నిర్మాణం, రుణ చెల్లింపు, మరమ్మతుల కోసం 12 నెలల చందా చెల్లింపు సర్వీసు ఉండాలి. మొత్తం సర్వీసులో ఐదుసార్లు అనుమతి ఉంటుంది. ఇప్పటిదాకా ఇది రెండుసార్లు ఉండేది. కేటగిరీ–3: ప్రత్యేక సందర్భాల్లో ఏడాది సర్వీసు పూర్తిచేయకున్నా క్లెయిం చేయవచ్చు. అయితే కనీస నిల్వ మినహాయించి నగదు పొందవచ్చు.




## టాటూగా పరమశివుడి రూపం..



స్లోవేనియా ఫుట్‌బాల్ ఆటగాడు లుకా మిట్సెన్ తన ఆటతో మైదానంలోని అభిమానులను హోరెత్తిస్తాడనే విషయం అందరికీ తెలిసిందే. అయితే.. అతడిలో మరో కోణమూ దాగుంది. పరమశివుడిపై భక్తితో.. శివుడి రూపాన్ని, మహామృత్యుంజయ మంత్రాన్ని తన వీపుపై టాటూగా వేయించుకున్నాడు. దీని వెనక ఉన్న కారణాన్ని అతడు పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించాడు. ''శాంతారామ్ అనే ప్రసిద్ధ నవల చదివిన తర్వాత భారతీయ ఆధ్యాత్మికతపై విశ్వాసం కలిగింది. మొదట ఆసక్తిగా మొదలైన ఈ ప్రయాణం నా జీవితాన్నే మార్చేసింది. నా సహచర ఆటగాడి తల్లి నన్ను చూసి రుద్ర అనే పేరు తన మదిలో మెదిలిందని చెప్పింది. అయితే ఆ పేరుకు అర్థం తెలుసుకోవాలని గూగుల్‌లో వెతకగా.. శివుడి ఉగ్ర రూపాల్లో రుద్రుడు ఒకరని తెలిసింది. శివుడి రూపాన్ని, మహామృత్యుంజయ మంత్రాన్ని ఫ్యాషన్ కోసం టాటూగా వేయించుకోలేదు. భారత్‌లో గడిపిన సమయంలో నాలో ఏర్పడిన ఆధ్యాత్మిక భావానికి ప్రతీకగా వేయించుకున్నా.

# ఐర్లాండ్‌తో తొలి టీ20లో భారత్ ఓటమి




2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత ఆడుతున్న తొలి టీ20.. అందులోనూ చిన్న జట్టు ఐర్లాండ్‌తో.. ఈ మ్యాచ్‌లో భారత్ భారీ విజయం సాధించకపోతే ఆశ్చర్యపోవాలి! కానీ ప్రపంచ ఛాంపియన్ భారత్‌కు దిమ్మదిరిగే షాకిచ్చింది ఐర్లాండ్. అటు బ్యాట్‌తో, ఇటు బంతితో అదరగొట్టి.. శ్రేయస్ సేనకు మట్టికరిపించింది. టీమ్‌ఇండియాపై ఏ ఫార్మాట్లోనైనా ఐర్లాండ్‌కు ఇదే తొలి విజయం.

బెల్‌ఫాస్ట్: శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో ఆడిన తొలి మ్యాచ్‌లో భారత టీ20 జట్టుకు షాక్ తగిలింది. తొలి టీ20లో ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించి 2 మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శుక్రవారం మొదట ఐర్లాండ్ 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. కొత్త కెప్టెన్ లోర్కాన్ టకర్ (50; 36 బంతుల్లో 5×4, 2×6), గారెత్ డెలానీ (49; 32 బంతుల్లో 3×4, 3×6) సత్తా చాటారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా (3/24), అర్ష్‌దీప్ (2/28), అక్షర్ పటేల్ (2/33) ఆకట్టుకున్నారు. అనంతరం టీమ్‌ఇండియా 18.5 ఓవర్లలో 148 పరుగులకే ఆలౌటైంది. అభిషేక్ (49; 20 బంతుల్లో 7×4, 2×6) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హోలార్డ్ (3/28), హంఫ్రీస్ (3/38) భారత్‌ను దెబ్బతీశారు. ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడని అనుకున్నా.. అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. సిరీస్‌లో చివరిదైన రెండో టీ20 ఆదివారం జరుగుతుంది.

ఆ ఒక్కడు తప్ప..: 183 పరుగుల లక్ష్యం కాస్త పెద్దదే అయినా.. భారత్ బ్యాటింగ్‌కు అదేం కష్టం కాదనిపించింది. కానీ రెండో ఓవర్ తొలి బంతికే శాంసన్ (5)ను ఔట్ చేసిన మూన్‌ద్రా భారత్‌ను దెబ్బకొట్టాడు. కానీ అభిషేక్ దూకుడుగా ఆడాడు. మెకార్తీ వేసిన మూడో ఓవర్లో 4 ఫోర్లు బాదాడు. 3 ఓవర్లకు 45/1తో భారత్‌కు బలమైన పునాది పడింది. అయితే ఇషాన్ కిషన్ (1), శ్రేయస్ (3)లను ఔట్ చేసి భారత్‌ను హోలార్డ్ గట్టి దెబ్బ తీశాడు. అర్ధసెంచరీకి చేరువలో అభిషేక్ కూడా ఔటైపోవడంతో భారత్ 8 ఓవర్లకు 80/4తో ఇబ్బందుల్లో పడింది. హంఫ్రీస్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ఆడబోయిన తిలక్ వర్మ (19) కూడా ఔటైపోయాడు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్‌తో పాటు భారత్‌పై ఒత్తిడి కూడా పెరిగింది. కాసేపు నిలిచిన శివమ్ దూబె (25), అక్షర్ (15) కూడా కీలక సమయంలో డగౌట్ చేరిపోయారు. 19వ ఓవర్లో హర్షిత్ (8), అర్ష్‌దీప్ (2) వికెట్లను ఖాతాలో వేసుకున్న హంఫ్రీస్.. భారత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఐర్లాండ్ పడి లేచి..: మొదట పవర్ ప్లే లోపే 3 వికెట్లు పడినా.. టకర్, డెలానీ మెరుపులతో ఐర్లాండ్ పెద్ద స్కోరు చేసింది. హర్షిత్ రాణా ఆరంభంలో ప్రత్యర్థిని గట్టి దెబ్బ తీశాడు. రాస్ అడైర్ (12), టిమ్ టెక్టార్ (17)లను బుట్టలో వేశాడు. మధ్యలో హ్యారీ టెక్టార్ (0)ను అర్ష్‌దీప్ ఔట్ చేయడంతో 4 ఓవర్లకు 30/3తో ఐర్లాండ్ కష్టాల్లో పడింది. ఐర్లాండ్ 10 ఓవర్లకు 68/4తో నిలిచింది. ఈ దశలో టకర్ బ్యాట్ ఝుళిపించాడు. అక్షర్ వేసిన 13వ ఓవర్లో అతడు 4, 4, 6 బాది స్కోరు పెంచాడు. అర్ధసెంచరీ తర్వాత టకర్ వెనుదిరిగినా.. డెలానీ, డాక్రెల్ చెలరేగారు. ప్రసిద్ధ్ వేసిన 17వ ఓవర్లో డెలానీ హ్యాట్రిక్ సిక్సులు, ఓ ఫోర్ కొట్టగా... డాక్రెల్ ఒక ఫోర్ బాదాడు.

ఐర్లాండ్ ఇన్నింగ్స్: టిమ్ (సి) శ్రేయస్ (బి) హర్షిత్ 17; అడైర్ (సి) శాంసన్ (బి) హర్షిత్ 12; హ్యారీ టెక్టార్ (సి) శాంసన్ (బి) అర్ష్‌దీప్ 0; టకర్ (సి) తిలక్ (బి) హర్షిత్ 50; కాలిట్స్ (సి) ప్రసిద్ధ్ (బి) దూబె 15; డెలానీ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 49; డాక్రెల్ (సి) అర్ష్‌దీప్ (బి) అక్షర్ 19; మెకార్తీ (సి) తిలక్ (బి) అక్షర్ 7; హంఫ్రీస్ రనౌట్ 2; మూన్‌ద్రా నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 9

మొత్తం: 20 ఓవర్లలో 9 వికెట్లకు 182

వికెట్ల పతనం: 1–20, 2–25, 3–30, 4–51, 5–115, 6–164, 7–178, 8–178, 9–182

బౌలింగ్: అర్ష్‌దీప్ 4–0–28–2; హర్షిత్ 4–0–24–3; ప్రసిద్ధ్ 4–0–57–0; దూబె 3–0–18–1; అక్షర్ 4–0–33–2; సుందర్ 1–0–19–0.

## పరిస్థితులను త్వరగా అర్థం చేసుకోలేకపోయాం: అభిషేక్ శర్మ

టీ20 ప్రపంచ కప్ తర్వాత తొలిసారి పొట్టి ఫార్మాట్‌లో ద్వైపాక్షిక సిరీస్‌ను భారత్ ఆడుతోంది. తొలి మ్యాచ్‌లోనే టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. అదీనూ ఐర్లాండ్ వంటి జట్టు చేతిలో పరాజయం చవిచూసింది. అయితే.. పరిస్థితులకు త్వరగా అలవాటు పడకపోవడం వల్లే తాము ఓడినట్లు టీమ్‌ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ వ్యాఖ్యానించాడు. ఐర్లాండ్‌పై 49 పరుగులు చేసిన అభిషేక్ శర్మనే భారత్



తరఫున టాప్ స్కోరర్. ''పిచ్ పరిస్థితులకు ఎంత త్వరగా అలవాటు పడుతున్నామనేది చాలా కీలకం. ప్రస్తుత కాలంలో వరుసగా మ్యాచ్‌లు ఆడుతున్నాం. ప్రాక్టీస్ సెషన్లు దొరికినప్పుడు లేదా పరిస్థితులకు అలవాటు పడే అవకాశం ఉన్నప్పుడు జట్టుగా ముందుకు వచ్చి వాటికి అనుగుణంగా త్వరగా మారాలి. బలమైన జట్టుగా మేం పరిస్థితులకు త్వరగా సర్దుకుపోవాలి. కానీ, ఐర్లాండ్‌తో తొలి మ్యాచ్‌లో అది సాధ్యపడలేదు'' అని అభిషేక్ తెలిపాడు. ఐర్లాండ్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్య ఛేదనలో సంజు శాంసన్ (5), ఇషాన్ కిషన్ (1), శ్రేయస్ అయ్యర్ (3) త్వరగానే పెవిలియన్‌కు చేరారు. మరోవైపు అభిషేక్ శర్మ మాత్రం దూకుడుగా ఆడాడు. ఏడు ఫోర్లు, రెండు సిక్సుల సాయంతో 20 బంతుల్లో 49 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అయితే, 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసినట్లు తొలుత వచ్చింది. కానీ, అభిషేక్ ఎదుర్కొన్న ఐదో బంతికి సింగిల్ రన్ లెగ్‌బై రూపంలో వచ్చింది. దానిని అభిషేక్ ఖాతాకు యాడ్ చేయడంతో.. అదనంగా ఒక పరుగు వచ్చి చేరింది. ఆ రన్ లేకపోవడంతో 49 పరుగులే అభిషేక్ చేసినట్లైంది.

# యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ..



యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు అదరగొట్టేస్తున్నారు. మహిళలు, పురుషుల విభాగంలో ముగ్గురు ప్లేయర్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో దేవికా సిహాగ్ విజయం సాధించగా.. పురుషుల విభాగంలో కిదాంబి శ్రీకాంత్, రౌనక్ చౌహాన్ సెమీఫైనల్స్‌లో అడుగు పెట్టారు.

18 ఏళ్ల రౌనక్ చౌహాన్ ఇప్పుడు బ్యాడ్మింటన్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. ప్రిక్వార్టర్‌ఫైనల్స్‌లో ఆరో ర్యాంకర్‌ను ఓడించిన రౌనక్.. క్వార్టర్స్‌లోనూ దూకుడు కొనసాగించాడు. కేవలం 38 నిమిషాల్లోనే ఇజ్రాయెల్‌కు చెందిన ఒలింపియన్ ప్లేయర్ మిషా జిల్బెర్‌మన్‌ను చిత్తు చేశాడు. 23–21, 21–11 తేడాతో విజయం సాధించాడు. దీంతో తొలిసారి మెగా టోర్నీ సెమీస్‌లో అడుగు పెట్టాడు.

మరో సింగిల్స్‌లో సీనియర్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ 21–9, 12–21, 21–8 తేడాతో చైనీస్ తైపీ ప్లేయర్ లియావో జౌపుపై విజయం సాధించాడు. ఇవాళ జరగనున్న సెమీస్‌లో జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ యుద్దై ఒకిమోటోతో శ్రీకాంత్ తలపడతాడు. మహిళల విభాగంలో దేవికా 22–20, 21–19 తేడాతో మూడో సీడ్ జపాన్ ప్లేయర్ రికో గున్‌జిపై గెలిచింది.

## ఒక్క మ్యాచ్ గెలవకుండానే నాకౌట్‌కు!

ఫిఫా ప్రపంచ కప్ 2026లో కాబో వెర్దె చరిత్ర సృష్టించింది. కేవలం 5.30 లక్షల జనాభా కలిగిన ఈ అతిచిన్న దేశం ఇప్పుడు వరల్డ్ కప్ నాకౌట్‌కు చేరుకుని అద్భుతం చేసింది. తొలిసారి ఫిఫా ప్రపంచ కప్ బరిలోకి దిగిన ఈ జట్టు.. ఆడిన మూడు మ్యాచుల్లో ఒక్క దాంట్లోనూ విజయం



సాధించలేదు. అయినా, రౌండ్ 32కు చేరుకొని వార్తల్లో నిలిచింది. గ్రూప్ Hలో స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియా జట్లతో కాబో వెర్దె బరిలోకి దిగింది. స్పెయిన్ మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో అగ్రస్థానం సాధించి నాకౌట్‌కు వెళ్లింది. కాబో వెర్దె మాత్రం మూడు డ్రాలు చేసుకుని రెండో స్థానంతో ముందుకు దూసుకెళ్లింది. నాకౌట్‌లో అర్జెంటీనాతో తలపడనుంది. మరోవైపు స్పెయిన్ చేతిలో 1–0 తేడాతో ఉరుగ్వే ఓటమిపాలైంది. దీంతో సౌదీ అరేబియాతోపాటు ఉరుగ్వే ఇంటిముఖం పట్టాయి. ఫిఫా ప్రపంచ కప్‌లో ఫ్రాన్స్‌కు తిరుగులేదు. హ్యాట్రిక్ విజయాలతో గ్రూప్ Iలో అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరుకుంది. నార్వేతో జరిగిన పోరులో ఫ్రాన్స్ ఆటగాడు ఉస్మాన్ డెంబెలె హ్యాట్రిక్ గోల్స్‌తో మెరిశాడు. ఆట మొదలైన 7వ నిమిషంలో గోల్ కొట్టి ఫ్రాన్స్‌కు ఆధిక్యం అందించాడు. మళ్లీ 20వ నిమిషంలో గోల్‌తో ఆ జట్టు 2–0 లీడ్‌లోకి వెళ్లింది. అయితే, థెలో అస్గార్డ్ 21వ నిమిషంలో గోల్‌తో నార్వేను రేసులోకి తీసుకొచ్చాడు. కానీ, 32వ నిమిషంలోనే డెంబెలె హ్యాట్రిక్ గోల్‌తో 3–1 ఆధిక్యం సాధించింది. ఆట మరికాసేపట్లో ముగుస్తుందనగా.. డిసైర్ డౌ (90+4వ నిమిషం) గోల్‌తో ఫ్రాన్స్ 4–1 తేడాతో నార్వేపై విజయం సాధించింది. ఇదే గ్రూప్ నుంచి సెనెగల్ 5–0 తేడాతో ఇరాక్‌ను ఓడించింది.

# వుదయం సినిమా

MOVIE TIME!

## ప్రముఖ నటుడు , దర్శకుడికి అక్షర నివాళి



ప్రముఖ నటుడు, దర్శకుడు మరియు 'స్క్రీన్‌ప్లే ల్యాబ్'గా వెండి తెర ప్రముఖులచే కీర్తించబడిన కె. భాగ్యరాజ్ గారి ఆకస్మిక మృతి చలన చిత్ర రంగానికి తీరని లోటు. 73 సంవత్సరాల వయసులో ఈ రోజు ఉదయం (జూన్ 27, 2026) ఆయన చెన్నైలో గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. మధ్యతరగతి కుటుంబాల కథలకు సున్నితమైన హాస్యంజత చేసి వెండితెర పై ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించిన ధన్యజీవి అయన స్మృత్యర్థం, ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ సంతాప సందేశం!!అక్షర నివాళిస్క్రీన్‌ప్లే మహారాజుకు సుమ సున్నిత విమర్శక నయనాల శ్రద్ధాంజలి!!!కథల నవాబు ! కానరాని లోకాలకు తరలి పోయావా?వెండితెరపై సామాన్యుడి నాడిని పట్టిన వినోద వైద్య వేదానివి"!!

## 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' విడుదల తేదీ ఖరారు



**వుదయం:** తెలుగు సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్ ఎట్టకేలకు వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తోన్న కుటుంబ కథా చిత్రం “ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 – AK47” విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 2, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీస్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ పోస్టర్ సినిమాలోని హృద్యమైన, ఉత్సాహభరితమైన ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది. ఇందులో వెంకటేష్, శ్రీనిధి శెట్టి ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ, ఆత్మీయ కుటుంబ కథకు అద్దం పట్టేలా ఉన్నారు. ఈ చిత్రం భావోద్వేగాలు, వినోదం, హృదయాన్ని హత్తుకునే క్షణాలతో నిండిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందని పోస్టర్ స్పష్టం చేస్తోంది.వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ప్రకటన వచ్చినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్రివిక్రమ్ శైలిలో మనసును హత్తుకునే భావోద్వేగాలు, గుర్తుండిపోయే పాత్రలు, కట్టిపడేసే హాస్యం, అర్థవంతమైన కథనం కలగలిపి, ప్రేక్షకులకు సంపూర్ణమైన సినిమా అనుభూతిని అందించడానికి ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47’ సిద్ధమవుతోంది. తన సహజమైన ఆకర్షణ, అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే వెంకటేష్.. ఈసారి కూడా కుటుంబ విలువలతో కూడిన పాత్రలో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రానికి అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రవి కె. చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, కెవిన్ కుమార్ యాక్షన్ సన్నివేశాల కొరియోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు.హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

## ప్రొడక్షన్ నెం.1 లాంఛనంగా ప్రారంభం



**వుదయం:** మీరా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మౌర్య సిద్ధవరం, తన్వి ఆకాంక్ష హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం శనివారం లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా..అల్లు స్నేహ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. యంగ్ ప్రొడ్యూసర్ బన్నీ వాస్ స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సందర్భంగా...నిర్మాత సందీప్ రామినేని(శాండి) మాట్లాడుతూ “మా బ్యానర్‌లో ప్రొడక్షన్ నెం.1 మూవీగా రాబోతోన్న ఈ సినిమా ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్. డైరెక్టర్ గీత సి.శేఖర్ ఫన్ ఎంటర్‌టైనింగ్ కంటెంట్‌తో సినిమాను రూపొందిస్తూనే ఓ ఎమోషనల్ టచ్‌తో ఉండేలా స్క్రిప్ట్‌ను రెడీ చేశారు. మౌర్య, తన్వి జోడీ క్యూట్‌గా మెప్పించనున్నారు. ఆగస్ట్ నుంచి షూటింగ్‌ను ప్రారంభించబోతున్నాం.

## సంబరాల ఏటిగట్టు గ్రాండ్ ఫైనల్ షెడ్యూల్ ప్రారంభం



**వుదయం:** మెగా హీరో సాయి దుర్గ తేజ్ ప్రతిష్టాత్మక పాన్–ఇండియా ప్రాజెక్ట్ SYG (సంబరాల ఏటిగట్టు). రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. 'అసుర ఆగమన' గ్లింప్స్, ప్రమోషనల్ కంటెంట్ కి వస్తున్న భారీ స్పందనతో ఈ చిత్రంపై హ్యూజ్ బజ్ నెలకొంది. పాన్–ఇండియా సంచలనం 'హనుమాన్'ను అందించిన ఈ నిర్మాణ సంస్థ, అత్యున్నత స్థాయి సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. భారీ సెట్ల నుండి అత్యున్నత సాంకేతిక ప్రమాణాల వరకు, నిర్మాతలు రాజీపడకుండా గొప్ప విజన్ తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.నిర్మాణంలో చివరి, అత్యంత కీలకమైన దశకు నాంది పలుకుతూ 'సంబరాల ఏటిగట్టు' చిత్రం హైదరాబాద్‌లో చివరి షెడ్యూల్ చిత్రీకరణను ప్రారంభించింది. అత్యంత అద్భుతమైన యాక్షన్–ప్యాక్డ్ సన్నివేశాలకు జీవం పోయడానికి, ప్రత్యేకంగా ఒక భారీ సెట్‌ను గ్రాండ్ గా నిర్మించారు. ఈ చివరి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొనే కీలకమైన ఘట్టాలుఉంటాయి, ఇది ఒక మరపురాని సినిమా ఎక్స్ పీరియన్స్ కి వేదిక కానుంది. సాయి దుర్గ తేజ్ తన కెరీర్‌లోనే అత్యంత పవర్ ఫుల్, ఇంటెన్స్ పాత్రలలో కనిపించబోతున్నారు. విలక్షణమైన కథలను ఎంచుకోవడంలో పేరుగాంచిన సాయి తేజ్ ఈ సినిమా కోసం అద్భుతమైన ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. ఇది ప్రేక్షకులకు మునుపెన్నడూ చూడని మాస్ అప్పీల్‌తో కూడిన సినిమాని ప్రామిస్ చేస్తోంది.దర్శకుడు రోహిత్ కేపీ ఈ చిత్రాన్ని పవర్ ఫుల్ కథనం, ఉత్కంఠభరితమైన విజువల్స్, హై–ఆక్టేన్ సన్నివేశాల మేళవింపుతో ఒక గ్రాండ్ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. ఇది ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న పాన్ ఇండియన్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తోంది.

## జూలై 3న గ్రాండ్ "ఆర్ కే దీక్ష" రిలీజ్

**వుదయం:** ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం “ఆర్ కే దీక్ష”. డి.ఎస్. రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూలై 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోదర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – మా "ఆర్ కే దీక్ష" సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై 3న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మా మూవీ చాలా బాగా వచ్చింది. ఐదు పాటలు ఆకట్టుకుంటాయి. అందులో మధు ప్రియ మూడు పాటలు పాడింది. వీర జవాన్ల గొప్పదనం చెప్పేలా చేసిన స్పెషల్ సాంగ్ ను మధు ప్రియ పాడింది. ఆ పాట మా మూవీకి హైలైట్ అవుతుంది. ఈ చిత్రంలో ఫైట్ మాస్టర్ రవి మంచి యాక్షన్ సీక్వెన్సులు కంపోజ్ చేశారు. డూప్ లేకుండా మా హీరో కిరణ్ అద్భుతంగా ఆ ఫైట్స్ చేశాడు. అతనికి ఈ సినిమాతో హీరోగా మంచి పేరొస్తుంది. ఈ సినిమా మ్యూజిక్ ను మా ఆర్కే ఆడియో లేబుల్ ద్వారా రిలీజ్ చేస్తాం. నేను నిర్మాతగా 44 చిత్రాలు చేశాను, దర్శకుడిగా 9 చిత్రాలు రూపొందించాను. "ఆర్ కే దీక్ష" సినిమాకు ఆంధ్ర, సీడెడ్ డిస్ట్రిబ్యూషన్ కంప్లీట్ అయ్యింది. నైజాంలోనే థియేటర్స్ ఇవ్వడం లేదు. ఇండస్ట్రీలోని ఆ నలుగురు థియేటర్స్ ను గుప్పిట్లో పెట్టుకుని చిన్న సినిమాను చంపేస్తున్నారు. మా సినిమాకు థియేటర్స్ ఇవ్వకుంటే పోరాటం మొదలుపెడతాం. సోమవారం నుంచి ఫిలించాంబర్ ముందు టెంట్ వేసి నిరాహార దీక్ష చేపడతాం. క్యూబ్ యూఎఫ్ఓ లతో దోపిడీ చేస్తూ, థియేటర్స్ లోనూ మోనోపలీ చేస్తున్నారు.



## 'ఇరుముడి కట్టు' జూన్ 29న రిలీజ్



**వుదయం:** మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' చిత్రంతో విభిన్నమైన ఎమోషనల్ పాత్రలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం, ఇప్పటికే విడుదలైన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' వీడియోతో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఆ వీడియో ఎమోషన్ ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఇందులో రవితేజ అంకితభావం గల తండ్రిగా కనిపించారు, తండ్రి కూతురు అనుబంధమే కథకు ప్రధాన బలంగా నిలవనుంది. ఇప్పుడు షూటింగ్ మొత్తం పూర్తయిన నేపథ్యంలో చిత్ర బృందం మ్యూజిక్ ప్రమోషన్స్ పై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా, జూన్ 29న 'ఇరుముడి కట్టు' తొలి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయ్యప్ప మాల ధరించిన రవితేజ, రాబోయే యాత్రా సీజన్‌కు అనుగుణంగా ఈ పాట విడుదల కానుండటంతో, ఇది ఆధ్యాత్మిక అనుభూతిని అందించడమే కాకుండా చిత్ర సంగీతానికి సరైన ఆరంభంగా నిలవనుంది.

## 'గుర్తుకొస్తున్నాయి' ట్రైలర్ లాంచ్

**వుదయం:** యంగ్ ట్యాలెంటెడ్ విరాజ్ అశ్విన్ హీరోగా వినోద్ గాలి దర్శకత్వంలో శరత్ చంద్ర నాయుడు నిర్మిస్తున్న సిరిస్ 'గుర్తుకొస్తున్నాయి'. యశశ్రీ రావు, రోహిణి హట్టంగడి, శివ నారాయణ నారిపెద్ది, ప్రియదర్శిని రామ్ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా గ్లింప్స్, సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జూలై 3 నుంచి ఈటీవీ విన్‌లో ప్రత్యేకంగా స్ట్రీమింగ్ కానుంది. ఈ రోజు మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ వేడుకలో హీరో సత్యదేవ్, దర్శకులు బోయపాటి శ్రీను, కరుణా కరణ్, నిర్మాతలు మైత్రీ రవి, బన్నీవాసు, ఎస్కేఎన్, ధీరజ్, వంశీనందిపాటి అతిథులుగా పాల్గొన్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈరోజు భాగ్యరాజ్ గారి మరణ వార్త చాలా బాధాకరం. ముందుగా



ఆయనను స్మరించుకుంటూ మౌనం పాటిద్దాం. మన ఇండస్ట్రీలో నేను పని చేసిన గొప్ప సంస్థల్లో గీతా ఆర్ట్స్ ఒకటి. 'సరైనోడు' సినిమా సమయంలో బన్నీ బాబుతో చేసిన ప్రయాణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ ప్రయాణంలో ఎంతోమంది పరిచయమయ్యారు. ఈరోజు వారందరూ నా బెస్ట్ ఫ్రెండ్స్. అందులో శరత్ కూడా ఒకరు. శరత్ ఒక మంచి కథను వెబ్ సిరీస్‌గా రూపొందించి, దాన్ని రిలీజ్ చేయడానికి ఈటీవీ విన్‌ను ఎంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. తనకు ఆల్ ది బెస్ట్. ఈటీవీ విన్‌లో ఈ సిరీస్ రావడమే ఒక విజయం. గీతా ఆర్ట్స్, ఈటీవీ విన్ రెండూ కూడా అత్యుత్తమ కంటెంట్‌ను అందించే సంస్థలు. అలాంటి సంస్థల్లో ఈ సిరీస్ విడుదల కావడం గొప్ప విషయం. ఈ విజయం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. ఈ రోజుల్లో చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా లేదు. అదే వరుసలో 'గుర్తుకొస్తున్నాయి' కూడా గొప్ప విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ సిరీస్‌కు పనిచేసిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు.హీరో సత్యదేవ్ మాట్లాడుతూ.. గీతా ఆర్ట్స్ నుంచి ధీరజ్ గారు, ఎస్కేఎన్ గారు, శరత్ గారు, బన్నీ వాసు గారు... ఇలా ఎంతోమంది నిర్మాతలుగా రావడం, అందరూ సక్సెస్‌ఫుల్‌గా మంచి సినిమాలు చేయడం నిజంగా చాలా ఆనందంగా ఉంది.

## 'నాగబంధం' విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది..

**వుదయం:** విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం – ది సీక్రెట్ ట్రెజర్'. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.నాగబంధం ప్రాజెక్టులోకి మీరు ఎలా వచ్చారు?–మేము సాఫ్ట్‌వేర్ కంపెనీని విజయవంతంగా నిర్వహించాం. అక్కడి నుంచి ఎగ్జిట్ అయిన తర్వాత బిజినెస్‌ను డైవర్సిఫై చేయాలనే ఉద్దేశంతో సినిమా పరిశ్రమను కూడా ఒక మంచి అవకాశంగా భావించాం. నాగబంధం కంటే ముందు మరో కథ విన్నాం. అది చాలా పెద్ద హీరోతో చేయాల్సిన భారీ ప్రాజెక్ట్. అయితే



అప్పటికి మేము నిర్మాతలుగా నిరూపించుకోలేదు కాబట్టి ఆ అవకాశం రాలేదు.– రవీందర్ రెడ్డి గారు అభిషేక్ నామా గారి వద్ద ఉన్న స్క్రిప్ట్ గురించి చెప్పారు. అలా మేము అభిషేక్ గారిని కలిశాం. ఆయన విజన్ మాకు చాలా నచ్చింది. పెద్ద స్థాయిలో సినిమా చేయాలనే ఆలోచనతో నాగబంధం మొదలైంది.

## "సోల్జర్ - 24x7 ఆన్ డ్యూటీ" ఫస్ట్ లుక్ విడుదల

**వుదయం:** కొనంకి ఎంటర్‌టైన్‌మెంట్స్ తమ ప్రతిష్టాత్మక యాక్షన్ థ్రిల్లర్ "సోల్జర్ – 24×7 ఆన్ డ్యూటీ" చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేసింది. దేశభక్తి, ధైర్యం, త్యాగం, కర్తవ్య నిబద్ధతకు ప్రతీకగా రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కొనంకి కార్తీక్ శక్తివంతమైన సైనికుడి పాత్రలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. యుద్ధ వాతావరణం, పోరాట ఛాయలు, గర్వంగా రెపరెపలాడుతున్న భారత త్రివర్ణ పతాకం మధ్య ఆయన లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. "24×7 ఆన్ డ్యూటీ" అనే ట్యాగ్‌లైన్‌తో దేశ సరిహద్దుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తూ దేశ భద్రత కోసం అహర్నిశలు కృషి చేసే భారత సైనికులకు ఈ చిత్రం ఘన నివాళిగా నిలవనుంది.ఈ చిత్రంలో కొనంకి కార్తీక్ మరియు ప్రియాంక వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.



## 'మండాడి' నుంచి మేకింగ్ వీడియో..

**వుదయం:** సుహాస్, సూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘మండాడి’. ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాని ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ నిర్మిస్తోంది. మదిమారన్ పుగళేంది ఈ మూవీకి దర్శకత్వం వహిస్తు న్నారు. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్లు, టైటిల్ పోస్టర్లతో బజ్ క్రియేట్ చేశారు. ఈ ప్రాజెక్టుపై అటు కోలీవుడ్‌లోనూ, ఇటు టాలీవుడ్‌లోనూ అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. తీరప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో సాగే ఈ మూవీలో సూరి, సుహాస్ ఇద్దరూ కూడా రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారు. రియల్ లొకేషన్స్‌లో నేచురలిస్టిక్‌గా తెరకెక్కించిన ఈ మూవీని సెప్టెంబర్ 4న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. రు. దాదాపు 80 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్, బోట్ సీక్వెన్స్ హైలెట్ అవుతాయని సమాచారం. సుహాస్, సూరి మధ్య సన్నివేశాలు నెక్స్ లెవెల్లో ఉంటాయని టీం చెబుతోంది. ఇక తాజాగా సుహాస్ పాత్రకు సంబంధించిన మేకింగ్ వీడియోని షేర్ చేశారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.